పార్టీ ఎడ్యుకేషన్ సిరీస్

2

# చారిత్రక భౌతిక వాదం

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ

## పార్టీ ఎడ్యుకేషన్ సిరీస్ 2

# ముందుమాట

**భా**రత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఎడ్యుకేషన్ సబ్‌కమిటీ 2022 అక్టోబరులో సెంట్రల్ టీచర్ ట్రైనింగ్ స్కూలును నిర్వహించింది. ఆ స్కూలులో ఇచ్చిన నోట్స్‌ను క్లాసుల్లో చర్చలు, అభిప్రాయాలు ఆధారంగా ఫైనల్ చేయడం జరిగింది. అవసరమైన మార్పులతో మేము ఈ క్రింది నోట్స్‌ను ప్రచురిస్తున్నాము.

చారిత్రక భౌతిక వాదం లో మూడు అధ్యాయాలు ఉన్నాయి. ఒకటి, చారిత్రక భౌతిక వాదం, రెండు, భారత సామాజిక స్వరూపాలు, మూడు, మార్క్సిస్టు చారిత్రక అవగాహన – హిందూత్వ శక్తులు భారత దేశ చరిత్రను వక్రీకరించడం. ఈ మూడింటిని కలిపి కాని, విడివిడిగా కాని క్లాసులుగా అన్ని స్థాయిల్లోను బోధించేందుకు ఉపయోగించుకోవచ్చు.

ఈ నోట్స్ క్లాసులు బోధిస్తున్న వారికి ఉపయోగపడుతుందని, ఇతరులు సబ్జెక్టు గురించి అవగాహన చేసుకోవడానికి దోహదపడుతుందని ఆశిస్తున్నాము.

**పార్టీ ఎడ్యుకేషన్ సబ్ కమిటీ,**
**కేంద్ర కమిటీ, సిపిఐ(ఎం)**

**ఫిబ్రవరి 2023**

# I. చారిత్రక భౌతిక వాదం

## పరిచయం

సామాజిక ఆర్థిక పరిణామాలను చారిత్రక భౌతికవాదం ప్రకృతితో మానవుని సంబంధాలు, వాటిని అనుసరించి మానవుల మధ్య ఏర్పడే సంబంధాల దృష్టితో చూస్తుంది. మానవుని ప్రాథమిక కార్యకలాపం ఉత్పత్తి అన్నది మౌలిక ప్రాతిపదిక. మార్క్స్, ఎంగెల్స్ ఇలా చెప్పారు, "మానవుడు తన జీవనాధారాన్ని ఉత్పత్తి చేసుకోవడం ఆరంభించిన వెంటనే మానవునికి, జంతువులకి మధ్య విభజన ఏర్పడుతుంది." ఆ విధంగా సమాజంలో మానవులు తమను తాము పునరుత్పత్తి చేసుకునేందుకు భౌతిక, ఉత్పాదక కార్యకలాపంలో పాల్గొంటారు. ఉత్పత్తి కార్యంలో మనం ప్రకృతిని స్వాధీనం చేసుకొని దాన్ని మార్పు చేస్తాం. అంతే సమానమైన ముఖ్యమైన విషయమేమంటే, భౌతిక ఉత్పత్తి క్రమంలో మనల్ని మనం మార్పు చేసుకుంటాం. అత్యంత కీలకమైన విషయం, మనం నేర్చుకుంటాం అనేది. ఉత్పత్తి కార్యకలాపం ద్వారా మనం మన పరిసరాలపై కొంత అదుపు సాధిస్తాం.

మార్క్స్, ఎంగెల్స్ ఈ విషయాలను ఇలా చెప్పారు, "*.... జీవితమంటే అన్నింటికంటే ముందు తినడం, తాగడం, నివాసం, దుస్తులు ఇంకా చాల ఇతర అంశాలు. ఈ విధంగా మొట్టమొదటి చారిత్రక కార్యకలాపం ఈ అవసరాలను నెరవేర్చుకునే సాధనాలను ఉత్పత్తి చేసుకోవడమే, అంటే భౌతిక జీవనాన్ని ఉత్పత్తి చేయడమే.*' ఇంకా ఇలా అన్నారు, "*అందుచేత వ్యక్తులుగా జీవితాన్ని వారు ఎలా వ్యక్తం చేస్తారు, వారు ఎలా ఉన్నారు, ఎందుకు ఉన్నారు అనే అంశాలకు వారు ఏమి ఉత్పత్తి చేస్తున్నారు, ఎలా ఉత్పత్తి చేస్తున్నారు అన్నదానితో సంబంధం ఉంటుంది. అలా వ్యక్తుల స్వభావం వారు పాల్గొనే ఉత్పత్తిని నిర్దేశించే భౌతిక పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.*"

## ఉత్పాదక శక్తులు, సామాజిక ఉత్పత్తి సంబంధాలు

ఉత్పత్తి అనేది ఒక వ్యక్తి తానొక్కడే ఇతరులతో సంబంధం లేకుండా చేసేది కాదు. ఉత్పత్తి సమాజం లోపల, సమాజం ద్వారా జరుగుతుంది. అందుచేత ఉత్పత్తి అనేది అనివార్యంగా సామాజిక ఉత్పత్తి. ఆ విధంగా ఉత్పత్తి అనే దాన్ని "దంద్వ స్వభావం కలిగినదిగా చూడాలి, ఒకవైపున, అది ప్రకృతి సంబంధమైనది, మరొక వైపున సామాజిక సంబంధమైనది."

ఉత్పత్తి అనేది సామాజికమైనది కాబట్టి, ఎంతోమంది వ్యక్తుల మధ్య సహకారం దానిలో ఇమిడి ఉంటుంది. అలాంటి సామాజిక ఉత్పత్తి ఎల్లప్పుడూ సమాజంలోని సభ్యులందరి మధ్య సామాజిక సంబంధాలతో కూడి ఉంటుంది. సమాజాన్ని ఉత్పత్తి చేసేటపడు, పునరుత్పత్తి చేసేటపుడు ప్రజలు ఒకరితో మరొకరు పరస్పరం నిర్దిష్టమైన సామాజిక సంబంధాలను ఏర్పరచుకుంటారు.

అందుచేత మానవ సమాజాన్ని అధ్యయనం చేసేటపుడు తప్పని సరిగా రెండు అంశాలపై దృష్టి సారించాలి. మొదటిది, భౌతిక జీవన ఉత్పత్తి పద్ధతులు, అవి గత కాలపు, వర్తమాన కాలపు భౌతిక కార్యకలాపాల పర్యవసానం. సైద్ధాంతిక, ఆచరణాత్మక పరిజ్ఞానపు మొత్తం అవి. గత, వర్తమాన సామాజిక స్వరూపాల ద్వారా వ్యక్తమయ్యే ప్రకృతిసిద్ధ పర్యావరణంపై మన అదుపు. రెండవది, సామాజిక ఉత్పత్తిలో సమాజంలోని సభ్యులు పాల్గొనే క్రమంలో వారు తమ మధ్య ఏర్పరుచుకునే నిర్దిష్టమైన సామాజిక సంబంధాలు. మార్క్స్ మొదటి వాటిని 'ఉత్పాదక శక్తులు' అని, రెండవ వాటిని 'ఉత్పత్తి సంబంధాలు' అని పిలిచాడు. ఇక్కడ ఒక పొరపాటు అవగాహనకు లోను కాకూడదు, 'ఉత్పాదక శక్తులు' అన్న దాన్ని 'సాంకేతిక పరిజ్ఞానం' అన్నదానికి కుదించి చూడరాదు. మార్క్స్ ఇలా చెప్పాడు, "ఒక పారిశ్రామిక దశ ఎల్లప్పుడూ ఒక నిర్దిష్ట సహకార విధానం లేదా సామాజిక దశతో కలిసి ఉంటుంది. ఈ ఉత్పాదక విధానాన్నే ఉత్పాదక శక్తి అని అంటాము."

మానవులు ఉత్పత్తి కార్యకలాపంలో పాల్గొంటూ, ఆచరణ ద్వారా నేర్చుకుంటూ తమను తాము మార్చుకుంటూ ఉంటే సమాజం నూతన ఉత్పాదక శక్తులను సముపార్జించుకుంటుంది. ఏ నిర్దిష్ట సమయంలో అయినా సమాజంలో ఉత్పాదక శక్తుల అభివృద్ధి ప్రత్యేక దశ ఉంటుంది. అంటే, నిర్దిష్ట రూపాలలో సామాజిక సహకారం, పని విభజన, సమాజం లోని సభ్యుల మధ్య సామాజిక సంబంధాలు ఉంటాయి. ఉత్పాదక శక్తుల అభివృద్ధిలో ఒక నిర్దిష్ట దశకు అనుగుణమైన ఉత్పత్తి సంబంధాలు ఉంటాయి, వాటినే  సామాజిక సంబంధాలు అని కూడ అంటాము. ఆ

విధంగా ఫ్యూడల్ ఐరోపాలో భౌతిక ఉత్పత్తిలో భూమి, వ్యవసాయం ఆధిపత్య స్థానంలో ఉండేవి. ఆధిపత్య ఉత్పత్తి సంబంధం కూడ భూమి ప్రాతిపదికన ఫ్యూడల్ ప్రభువుకు, అర్థ బానిస రైతుకు మధ్య ఉండేది. ఆధునిక పెట్టుబడిదారీ పారిశ్రామిక ఉత్పత్తి విధానానికి అనుగుణంగా ఆధిపత్య ఉత్పత్తి సంబంధం వేతన కార్మికునికి, పెట్టుబడిదారునికి మధ్య ఉంటుంది.

**ఉత్పత్తి విధానం**

సమాజంలో ఒక దశలో ఉత్పాదక శక్తులకు, ఉత్పత్తి సంబంధాలకు మధ్య అనుగుణ్యత ఉంటుంది. ఈ అనుగుణ్యత సమాజం అభివృద్ధి క్రమంలోనే నిరంతరం చెదిరిపోతూ ఉంటుంది. ఇది తప్పనిసరిగా జరుగుతూ ఉంటుంది. ఎందువల్లనంటే సమాజం తనంత తాను భౌతికంగాను, సామాజికంగాను అభివృద్ధి చెందుతున్నపుడు ఉత్పాదక శక్తులు ఎల్లప్పుడూ పెరుగుతూనే ఉంటాయి. ఆ విధంగా ఉత్పాదక శక్తులకు, ఉత్పత్తి సంబంధాలకు మధ్య వైరుధ్యం తలెత్తుతుంది. సమాజ అభివృద్ధి ముందుకు సాగుతున్నకొద్దీ ఈ వైరుధ్యం అంతకంతకు తీవ్రతరమవుతుంది. సమాజంలోని ఆస్తి సంబంధాలు అని 'క్రోడీకరించదగిన' (క్రోడీకరించడం మాత్రమే) ఉనికిలో ఉన్న ఉత్పత్తి సంబంధాల ఉత్పత్తి శక్తులతో అనుగుణ్యత అంతకంతకు తగ్గిపోతూ ఉంటుంది. ఉత్పాదక శక్తులకు, ఉత్పత్తి సంబంధాలకు మధ్య వైరుధ్యం పేరుకుపోయినకొద్దీ ఒక నిర్దిష్ట దశలో పరిణామాత్మక 'గంతు' గా మారుతుంది. ఉత్పాదక శక్తుల నూతన అభివృద్ధి దశకు మరింత అనుగుణమైన ఉత్పత్తి సంబంధాలు ఏర్పడతాయి. ఒక సామాజిక విప్లవం సంభవిస్తుంది. ఉత్పాదక శక్తులు, ఉత్పత్తి సంబంధాలు నూతనంగా పోగవుతాయి. ఆ విధంగా నూతన ఉత్పత్తి విధానం ఉనికిలోకి వస్తుంది.

**సామాజిక నిర్మాణం**

ఇది సామాజిక మార్పు గతిశీలతకు సంబంధించి చారిత్రక భౌతిక వాద దృక్పథపు రేఖామాత్రమైన, అతి స్థూలమైన వివరణ మాత్రమే. అందుచేత కొన్ని అంశాలను మనం గమనంలో ఉంచుకోవాలి. మొదటిది, ఉత్పత్తి విధానం అనేది సైద్ధాంతికపరమైనది, ముఖ్యమైన అంశాల కుదింపు. అయినప్పటికీ ఎంతో ప్రాధాన్యత కల భావన. అది తక్షణ వాస్తవికతలో ఏ చారిత్రక సమాజమూ కాదు. ఒక నిర్దిష్ట వాస్తవిక సమాజాన్ని 'సామాజిక నిర్మాణం' అని పిలవడం సరిగా ఉంటుంది. అలాంటి

సామాజిక నిర్మాణం అనేక రకాల సామాజిక సంబంధాలను కలిగి ఉంటుంది. కొన్ని సంబంధాలు ఒక ఉత్పత్తి విధానానికి సంబంధించి ఉంటాయి, మరికొన్ని ఇతర ఉత్పత్తి విధానాలకు సంబంధించి ఉంటాయి. ఆ విధంగా భారత సామాజిక నిర్మాణంలో పెట్టుబడి దారీ ఉత్పత్తి సంబంధాలు, పెట్టుబడిదారీ పూర్వ ఉత్పత్తి విధానాలకు సంబంధించిన ఫ్యూడల్, ఫ్యూడల్ పూర్వ అంశాలతో సహా ఉంటాయి. ఉదాహరణకు కులవ్యవస్థ భారత దేశంలో ప్రాచీన తెగల సమాజాలు విచ్ఛిన్నం అయిన నాటి నుండి కొనసాగుతూ వస్తున్నది. ఇదే సమయంలో ఒక విషయాన్ని మనం తప్పనిసరిగా గుర్తించాలి. కుల వ్యవస్థ కీలక భాగంగా ఉన్న సమాజాల సారాంశం భారత సమాజ నిర్మాణ సుదీర్ఘ పరిణామంతో పాటు మారుతూ వస్తున్నది.

స్థూలంగా చెప్పాలంటే, ఒక నిర్దిష్ట సామాజిక నిర్మాణం రెండు లేదా అంతకన్నా ఎక్కువ వేర్వేరు ఉత్పత్తి విధానాల ప్రత్యేక కలయికగా ఉంటుంది. 'ఉత్పత్తి విధానం' భావనకు, 'సామాజిక నిర్మాణ' భావనకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించడం కీలకమైనది. ఒక సామాజిక నిర్మాణం పరిణామం చెందుతూ వస్తున్నపుడు దానిలోని వేర్వేరు ఉత్పత్తి విధానాల పొందిక కూడ మారుతూ వస్తుంది. ఆ సామాజిక నిర్మాణాన్ని మనం ఏ చారిత్రక సందర్భంలో పరిశీలిస్తున్నాము అన్న దాన్ని బట్టి ఆ సామాజిక నిర్మాణపు పొందిక నిర్ణయించబడుతుంది. ఆ సామాజిక నిర్మాణంలో వర్గపోరాటం ఏ స్థితిలో ఉంది అన్నదాన్ని బట్టి ఆ 'సందర్భం' ప్రధానంగా నిర్ణయించబడుతుంది.

రెండవది, చారిత్రక భౌతికవాద దృక్పథం సామాజిక, చారిత్రక అభివృద్ధికి ఉండే వస్తుగత ప్రాతిపదికను నొక్కి చెబుతుంది. అయితే ఇవి 'అనుల్లంఘనీయమైన చారిత్రక నియమాలు' కాబట్టి ప్రతి ఒక్క మానవ సమాజం తప్పనిసరిగా ఒకే మాదిరి చారిత్రక పరిణామం గుండా పయనిస్తుందని మాత్రం చెప్పదు.

మూడవది, మార్క్సిస్టు అవగాహన ప్రకారం మానవ చరిత్రకు చోదక శక్తి 'అమూర్తంగా' (లేదా ఏకపక్షంగా) భావించిన ఉత్పాదక శక్తులకు, ఉత్పత్తి సంబంధాలకు మధ్య ఉండే వైరుధ్యం కాదు. మానవ భాగస్వామ్యం ద్వారా అంటే సామాజిక వర్గాల మధ్య పోరాటం ద్వారా నిర్దిష్టంగా వ్యక్తం చేయబడిన ఉత్పాదక శక్తులు, ఉత్పత్తి సంబంధాలకు మధ్య వైరుధ్యం మాత్రమే ఆ చోదక శక్తి.

## ఉత్పాదక శక్తుల అభివృద్ధి, వర్గ సమాజపు ఆవిర్భావం

'ఫ్యూడల్', 'పెట్టుబడిదారీ', 'వర్గాలు' – ఈ పదాలు పరిచయం చేయబడ్డాయి. వాటికి సంబంధించి కొంత వివరణ అవసరం ఉంది.

మానవ సమాజాల అభివృద్ధి ప్రాథమిక దశలో ఉన్నపుడు ప్రకృతిపై మానవుల అదుపు చాల పరిమితంగా ఉండేది. ఉత్పాదక శక్తుల అభివృద్ధి చాల తక్కువ స్థాయిలో ఉండేది. ఇలాంటి దశలో మానవ శ్రమ ఉత్పాదకత తప్పనిసరిగా అతి తక్కువగా ఉంటుంది. సమాజంలోని మానవులు కనీస జీవనం సాగించడానికి సైతం ఆ సమాజంలో అందుబాటులో ఉన్న మొత్తం శ్రమకాలం, అంటే శ్రమ చేయకలిగిన వారంతా ఉత్పత్తిలో పాల్గొనవలసి ఉండేది. ఉత్పాదక శక్తులు మరింత అభివృద్ధి చెందినపుడు సమాజంలో కొంత శ్రమ కాలం 'మిగులు' గా మారే స్థాయికి శ్రమ ఉత్పాదకత పెరుగుతుంది. అంటే ఆ సమయంలో జీవన స్థాయి సామాజిక అవసరాలకు కావలసిన దానికన్నా **మిగులు ఉత్పత్తి ఆవిర్భవించే** పరిస్థితి ఏర్పడుతుంది. అలాంటి మిగులు ఏర్పడటం సమాజంలో కొందరు పనిచేయకుండా, ఇతరుల శ్రమ మీద ఆధారపడి బ్రతికే సైద్ధాంతిక సాధ్యతను తీసుకొస్తుంది. ఈ అవకాశం **వర్గసమాజ ఆవిర్భావాన్ని** సాధ్యం చేస్తుంది. అంటే అలాంటి సమాజంలో ఒక ప్రజా బృందం పాదార్థిక ఉత్పత్తి సామాజిక నిర్వహణలో ఒక ప్రత్యేకమైన స్థానానిఇ్న ఆక్రమించి ఇతరుల శ్రమపై ఆధారపడి బ్రతికే పరిస్థితి ఏర్పడుతుంది. సాపేక్షంగా ఎక్కువ అభివృద్ధి చెందిన తెగ (దాని ఉత్పాదక శక్తుల అభివృద్ధి రీత్యా) అంతకన్నా తక్కువ అభివృద్ధి చెందిన తెగను జయించినపుడు ఈ సాధ్యత మొట్టమొదట చారిత్రక వాస్తవంగా మారింది. వర్గసమాజపు కచ్చితమైన ఆవిర్భావం ఒక సంక్లిష్టమైన అంశం. దాన్నిక్కడ వివరించడం సాధ్యం కాదు. వర్గ సమాజం ఆవిర్భవించినపుడు అతి ముఖ్యమైన మార్పు ఆస్తిసంబంధాలలో జరుగుతుంది అని సూటిగా చెప్పుకోవచ్చు. **భూమి, ఇతర ఉత్పత్తి సాధనాలపై సమిష్టి యాజమాన్యం, ప్రైవేటు యాజమాన్యంగా మారుతుంది.**

పైన పేర్కొన్న విషయం సూటిగా రెండు అంశాలను చెబుతుంది. తొలుత సమాజంలో ఉత్పత్తి శక్తుల అభివృద్ధి తక్కువ స్థాయిలో ఉన్నపుడు మానవ జాతి చరిత్రలో కొంత మంది మరికొందరి శ్రమపై ఆధారపడి బ్రతకని వర్గ రహిత సమాజం ఒకటి ఉండేది. తర్వాత సమాజంలో మిగులు ఏర్పడినపుడు వర్గ సమాజాలు ఆవిర్భవిస్తాయి. ఈ సమాజంలో ఒక వర్గానికి చెందిన ప్రజలు సామాజిక ఉత్పత్తి క్రమంలో వారి నిర్దిష్ట స్థానం రీత్యా ఇతరుల శ్రమపై ఆధారపడి బ్రతుకుతారు.

'వర్గం' అనే భావన (కొంత స్థూలమైనది, నైరూప్యమైనది) ఉత్పత్తి ప్రక్రియ సామాజిక నిర్వహణలో ఒక నిర్దిష్టమైన స్థానాన్ని తెలియచేస్తుంది. వర్గసమాజం అనేది తప్పనిసరిగా సామాజిక పని విభజన అభివృద్ధి చెందడాన్ని సూచిస్తుంది. (ప్రాథమిక స్థాయిలో చెప్పాలంటే పని చేసేవారికి, పనిచేయని వారికి మధ్య విభజన.) పనిచేయని వర్గానికి, పనిచేసి మిగులు అందించే వర్గానికి మధ్య సంబంధాన్ని మార్క్స్ దోపిడీ

సంబంధం అని అన్నాడు. అందుచేత మార్క్సిస్టు అవగాహనలో దోపిడీ అనే మాటకు చాల కచ్చితమైన విశ్లేషణాత్మక సారాంశం ఉంది. కొందరు చెబుతున్నట్లు ఇది నైతిక పరమైనది కాదు.

ఇంకా మరికొంత చెప్పుకోవాలి. ఉత్పాదక శక్తులు అభివృద్ధి చెంది మిగులు ఏర్పడకలిగిన పరిస్థితిలో మాత్రమే వర్గ సమాజ ఆవిర్భావానికి అవకాశం ఉంటుంది. ఈ సమాజంలో ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం కలిగిన మైనారిటీ ప్రజానీకం మెజారిటీని దోపిడీ చేస్తుంది. దోపిడీ వర్గం చేపట్టే ***బలప్రయోగం*** దోపిడీ చేయబడే వర్గాలు సమాజంలో తమ స్థానాన్ని అంగీకరించేలా వత్తిడి చేసేందుకు అవసరమవుతుంది. అలా వర్గ సమాజాల్లో ***రాజ్యం బలప్రయోగానికి సాధనం*** గా ఒక అనివార్యమైన లక్షణంగా ఉంటుంది.

అంతేకాదు, దోపిడీ చేసే వర్గం, దోపిడీ చేయబడే వర్గాన్ని భౌతికమైన బలాన్ని శాశ్వతంగా, నిరంతరాయంగా ప్రయోగించడం ద్వారానే పాలించజాలదు. దోపిడీవర్గాల పాలనను ***చట్టబద్ధం*** చేస్తేనే ఆ వర్గ సమాజం అవసరమైనది అన్న భావన నెలకొల్పబడుతుంది. ఈ భావన నెలకొల్పబడటం భావజాలం ద్వారా జరుగుతుంది. మతము, సాహిత్యం, పురాణ గాథలు, కుటుంబంలోను, సమాజంలోను సామాజీకరణ చెందడం మొదలైన రూపాలలో భావజాలం ఈ పనిచేస్తుంది. ఉదాహరణకు స్కూళ్ళకు వెళ్ళడం అనేది విద్యకు సంబంధించిన అంశం మాత్రమే కాదు. కచ్చితంగా చెప్పుకోవాలంటే, దోపిడీకి గురయ్యే వర్గాలకు చెందిన బాలల్లో ఉన్నదాన్ని అంగీకరించడం, అణగిమణగి ఉండటం నేర్పించడం కూడ. అలా నేర్పబడినవారు పెద్దయిం తర్వాత ఆచరణలో అమలవుతున్న దోపిడీ సంబంధాలను అంగీకరిస్తారు. ఇప్పుడు చెప్పుకున్న దాని ప్రకారం మనకు అర్థమయ్యే అంశం ఏమంటే, 'భావజాలం' అనేది కేవలం కొన్ని భావాల సముదాయం మాత్రమే కాదు. కొన్ని భౌతిక ఆచరణల్లో కూడ అది ఇమడ్చబడుతుంది. ఉదాహరణకు క్రతువులను చెప్పుకోవచ్చు.

## చరిత్రలో ఉత్పత్తి విధానాలు

చారిత్రక భౌతికవాద విస్తృత చట్రాన్ని వినియోగించి పశ్చిమ ఐరోపా చరిత్రను వివిధ ఉత్పత్తి విధానాలు ఆధిపత్యస్థానంలోఉండే కొన్ని నియమిత కాలాలుగా ఫలవంతంగా విభజించడం జరిగింది. ఆ సామాజిక నిర్మాణాలు వరుసగా, ఆదిమ కమ్యూనిస్టు సమాజం (విస్మరించదగిన, లేదా అసలు ఏమీ మిగులు లేని వర్గరహిత

సమాజాలు), *బానిస విధానం* (దండయాత్రల ద్వారా సమకూరిన బానిసల శ్రమతో పరిమిత పరిమాణంలో మారకం కోసం ఉత్పత్తి), ఫ్యూడల్ *విధానం* (అర్ధ బానిస రైతు వ్యవస్థ పై ఆధారపడినది. తొలి దశలో శ్రమద్వారా కౌలు చెల్లింపు, తర్వాత పంట రూపంలో శిస్తు చెల్లింపు, క్షీణిస్తున్న చివరి దశలో డబ్బురూపంలో కౌలు చెల్లింపు), పెట్టుబడిదారీ *విధానం* (ఆధునిక పరిశ్రమ అభివృద్ధి, ఆధిపత్య సంబంధం తొలుత పారిశ్రామిక పెట్టుబడికి, తర్వాత ఫైనాన్స్ పెట్టుబడికి, 'స్వేచ్ఛాయుత' వేతన కార్మికునికి మధ్య సంబంధం, స్వేచ్ఛాయుత అంటే అర్థబానిస రైతు భూమికి బంధించబడిన దానికి భిన్నంగా, ఇంకా మార్క్స్ చెప్పినట్లు తన జీవనాధార సాధనాల నుండి స్వేచ్ఛ పొంది పెట్టుబడిదారుని వద్ద పనిచేయక తప్పని పరిస్థితి) కంట్రిబ్యూషన్ *టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ* కి మార్క్స్ రాసిన ముందుమాటలో దిగువ ఇచ్చిన కొంత భాగాన్ని చూడండి:

*''మానవుడు తన జీవన సామాజిక ఉత్పత్తిలో నిర్దిష్ట సంబంధాలను ఏర్పరుచుకుంటాడు. అవి అనివార్యమైనవి, వారి ఇష్టాఇష్టాలకు అతీతమైనవి, అవే ఉత్పత్తి సంబంధాలు. అవి భౌతిక ఉత్పాదక శక్తుల నిర్దిష్ట అభివృద్ధి దశకు అనుగుణంగా ఉంటాయి. మొత్తంగా ఈ ఉత్పత్తి సంబంధాలే సమాజపు ఆర్థిక స్వరూపం. న్యాయపరమైన, రాజకీయ పరమైన ఉపరితలం దీనిమీదనే ఆవిర్భవిస్తుంది. సామాజిక చైతన్య నిర్దిష్ట స్వరూపాలు దీనికి అనుగుణంగానే ఉంటాయి. సామాజిక, రాజకీయ, మేథో జీవనాలను ఉత్పత్తి విధానమే నిర్దేశిస్తుంది. మానవ చైతన్యం అతని జీవితాన్ని నిర్దేశించదు, దానికి విరుద్ధంగా అతని సామాజిక జీవితమే అతని చైతన్యాన్ని నిర్దేశిస్తుంది. అభివృద్ధి ఒక నిర్దిష్ట దశకు చేరినపుడు సమాజం యొక్క భౌతిక ఉత్పాదక శక్తులు, ఉనికిలో ఉన్న ఉత్పత్తి సంబంధాలతో సంఘర్షణలో పడతాయి. లేదా అదే విషయాన్ని న్యాయశాస్త్రపరమైన పరిభాషలో చెప్పాలంటే అప్పటివరకు అవి పనిచేసిన ఆస్తిసంబంధాల చట్రంతో సంఘర్షణలో పడతాయి. ఉత్పాదక శక్తుల అభివృద్ధి రూపాలుగా ఉన్న ఈ సంబంధాలు వాటికి ప్రతిబంధకాలుగా తయారవుతాయి. అప్పుడు సామాజిక విప్లవ యుగం ప్రారంభమవుతుంది. ఆర్థిక పునాదిలో మార్పులు త్వరగానో, కొంత ఆలశ్యంగానో బ్రహ్మాండమైన మొత్తం ఉపరితల పరివర్తనకు దారితీస్తాయి. ఈ పరివర్తనలను అధ్యయనం చేసేటపుడు ఎల్లప్పుడూ జీవ శాస్త్ర కచ్చితత్వంతో సమానంగా చెప్పకలిగిన ఉత్పత్తి యొక్క ఆర్థిక పరిస్థితుల్లో వచ్చే భౌతిక పరివర్తనలకు, న్యాయపరమైన, రాజకీయ పరమైన, కళాత్మక, తాత్విక–సూటిగా చెప్పాలంటే మానవుడు ఈ సంఘర్షణను చైతన్యయుతంగా తెలుసుకొని, పరిష్కారానికి పోరాడే భావజాల రూపాలకు మధ్య వ్యత్యాసాన్ని*

తప్పనిసరిగా గుర్తించాల్సి ఉంది. ఒక వ్యక్తి తన గురించి తాను ఏమనుకుంటున్నాడో అన్నదాన్ని బట్టి ఆ వ్యక్తిపై ఎలా నిర్ధారణకు రామో, ఒక పరివర్తనా కాలంపై కూడ దాని చైతన్యాన్ని బట్టి నిర్ధారణకు రాలేము. దానికి విరుద్ధంగా, ఆ చైతన్యాన్ని భౌతిక జీవనంలోని వైరుధ్యాల నుండి, ఉత్పత్తి యొక్క సామాజిక శక్తులకు, ఉత్పత్తి సంబంధాలకు మధ్య సంఘర్షణ నుండి వివరించాల్సి ఉంటుంది. స్థూలంగా చెప్పాలంటే, ఆసియా తరహా, ప్రాచీన, ఫ్యూడల్, ఆధునిక బూర్జువా ఉత్పత్తి విధానాలను సామాజిక ఆర్థిక అభివృద్ధి పురోగమనాన్ని సూచించే వివిధ దశలు అని చెప్పవచ్చు. బూర్జువా ఉత్పత్తి విధానం ఉత్పత్తి సామాజిక క్రమంలో చివరి శత్రు వైరుధ్యభరిత విధానం. శత్రువైరుధ్యం అంటే వ్యక్తిగతమైన శత్రువైరుధ్యం కాదు, వ్యక్తి సామాజిక ఉనికి పరిస్థితుల నుండి ఆవిర్భవించిన శత్రువైరుధ్యం.– కాని బూర్జువా సమాజం లోపల అభివృద్ధి చెందే ఉత్పాదక శక్తులే ఆ శత్రువైరుధ్య పరిష్కారానికి కావలసిన భౌతిక పరిస్థితులను కూడ సృష్టించుకుంటాయి. మానవ సమాజ చరిత్ర పూర్వ దశ ఈ సామాజిక నిర్మాణపు ముగింపుతో పాటు ముగిసిపోతుంది.

నిర్దిష్ట సామాజిక నిర్మాణాలలో ఒక ఆధిపత్య ఉత్పత్తి విధానం స్థానంలోకి మరొక ఆధిపత్య ఉత్పత్తి విధానం రావడం గురించిన సంక్లిష్ట అంశాలలోకి మనం ఇప్పుడు వెళ్లడం లేదు. కాని ఇక్కడ ఒక విషయాన్ని మాత్రం గుర్తించాలి. ఈ పరివర్తనలలో కీలక పాత్ర వహించే శక్తి వర్గాల మధ్య పోరాటమే. అందుచేతనే మార్క్సిస్టు పండితుడు మారిస్ డాబ్ ఇలా చెప్పాడు: ఐరోపాలో ఫ్యూడలిజం విచ్ఛిన్నం కావడంలో దూరప్రాంత వాణిజ్యం అభివృద్ధి చెందడం, డబ్బు – సరుకు సంబంధాలు ప్రధానమైనవే అయినప్పటికీ, అతి ముఖ్యమైన అంశం ఫ్యూడల్ ప్రభువులకు అర్ధ బానిస రైతులకు మధ్య సంఘర్షణ తీవ్రం కావడమే. ఐరోపా సామాజిక నిర్మాణాలలో ఫ్యూడలిజం క్షీణించి పెట్టుబడిదారీ విధానం ఆధిపత్య స్థానాన్ని ఆక్రమించడం చాల సుదీర్ఘమైన ప్రక్రియ. ఈ ప్రయాణంలో 'ముందుకు సాగడం'తో పాటు 'వెనక్కి నెట్టివేయబడటాలు' కూడ ఉన్నాయి. ఉదాహరణకు, బ్రిటిష్ అనుభవం చెబుతున్నట్లు ఈ పరివర్తనలో నిర్ణాయకమైన అంశం ఎదుగుతున్న పెట్టుబడిదారీ వర్గానికి, పాలక ఫ్యూడల్ వర్గమైన ఫ్యూడల్ భూస్వామ్య కులీన వర్గానికి మధ్య పోరాటమే.

ఉత్పాదక శక్తుల అభివృద్ధి – దూరప్రాంత వాణిజ్యానికి అవసరమైన సాధనాల అభివృద్ధి (నౌకాయానం అభివృద్ధి), యంత్రాలు, ఆధునిక భారీ పరిశ్రమల అభివృద్ధి, దానికి అనుగుణమైన పనివిభజన, సహకారం అభివృద్ధి – బ్రిటన్‌లో పెట్టుబడిదారీ విధానం ఆవిర్భవించి అభివృద్ధి చెందడంలో నిర్ణాయక పాత్ర వహించాయి. అయితే అవి 'సాంకేతిక' అభివృద్ధిగా ఆ పాత్రను నిర్వహించలేదు. ఉత్పాదకశక్తులకు,

*ఉత్పత్తి సంబంధాలకు మధ్య గతితార్కిక సంబంధంగా అంటే వర్గ పోరాట క్రమంగా* ఆ పాత్రను నిర్వహించాయి.

పెట్టుబడిదారీ విధానానికి ముందు ఏర్పాటు కావలసింది – ఏవిధమైన ఆస్తి లేకుండా, తాము బ్రతకాలంటే తమ 'శ్రమ శక్తి' (రెక్కల కష్టం) ని మాత్రమే అమ్ముకోవలసిన వారు ఒకవైపు, ఉత్పత్తి సాధనాలపై గుత్తాధిపత్యం కలిగి ఉండి, ఆస్తి లేని కార్మికులను పనిలో పెట్టుకొని సరుకులు తయారు చేయించి, వాటిని అమ్మి లాభాలు సంపాదించే వారు మరొక వైపు ఉంటారు. – ఈ కార్మికులు, పెట్టుబడిదారులు ఫ్యూడలిజం క్షీణించి, విచ్ఛిన్నమైపోతున్న సమయంలో జరిగిన వర్గపోరాట ఫలితమే. ఆ విధంగా సామాజిక మార్పుకు మౌలిక చోదక శక్తి అయిన ఉత్పాదక శక్తులకు, ఉత్పత్తి సంబంధాలకు మధ్య వైరుధ్యం ఉత్పత్తి సంబంధాలను రూపాంతరం చెందించే వర్గాల మధ్య పోరాటంలో నిర్దిష్టంగా వ్యక్తం అవుతుంది.

చాల మంది మార్క్సిస్టు రచయితలు ఉత్పాదక శక్తులు, ఉత్పత్తి సంబంధాలు– ఈ రెండింటిని కలిపి సమాజ 'నిర్మాణం' లేదా 'ఆర్థిక పునాది' అని పిలిచారు. దీనికి భిన్నంగా భావజాలం, రాజకీయ, న్యాయ, ఇంకా ఇతర రంగాలను కలిపి 'ఉపరినిర్మాణం' అని అన్నారు. చారిత్రక భౌతికవాద దృక్పథాన్ని క్లుప్తంగా చెప్పాలంటే, 'ఆర్థిక పునాది' సమాజంలోని రాజకీయ, న్యాయ ఇంకా ఇతర సంబంధాలను నిర్దేశిస్తుంది. లేదా 'నిర్మాణం' 'ఉపరినిర్మాణాన్ని' నిర్దేశిస్తుంది. కొన్ని సందర్భాలలో ఉపరినిర్మాణం, పునాదిపై ప్రభావం చూపుతుందన్నది వాస్తవం. కాని ఆధిపత్య ప్రభావం మాత్రం పునాది నుండి ఉపరినిర్మాణంపైనే ఉంటుంది. జాగ్రత్తగా చెప్పిన ఈ అంశాలన్నీ చాల విలువైనవి. ఈ పదాలు తప్పుదోవ పట్టించే అవకాశం ఉంది కాబట్టి వాటిని మనం తప్పించుకుందాం. ఎందువల్ల ఇవి తప్పుదోవ పట్టిస్తాయంటే– ఒకటి, సాధారణ వినియోగంలో 'ఆర్థిక' అనే పదానికి చాల పరిమితమైన అర్థమే ఉంది. మార్క్సిస్టు వినియోగంలో 'ఆర్థిక పునాది' అంటే సామాజిక ఉత్పత్తి యొక్క భౌతిక పరిస్థితులన్నీ కలిసి ఉంటాయి. మార్క్సిస్టు అర్థంలో 'ఆర్థిక' అనే పదానికున్న ప్రాధాన్యతను పూర్తిగా అర్థం చేసుకోని వారు మార్క్సిజాన్ని, చారిత్రక భౌతిక వాదాన్ని ఆర్థిక నిర్దేశికతతో పొరపాటుగా సమం చేస్తారు. రెండవది, రాజకీయ, భావజాల రంగాలు సూటిగా, యాంత్రికంగా 'ఆర్థిక పునాది' చేత నిర్దేశించబడతాయని మార్క్సిజం చెప్పదు. దానికి భిన్నంగా, భావజాల, రాజకీయ రంగాలు గణనీయమైన సాపేక్ష స్వతంత్రతను (స్వయం ప్రతిపత్తి) కలిగి ఉంటాయని స్పష్టంగా చెబుతుంది. 'ఆర్థిక వ్యవస్థ' (మనం ఇంతకు ముందు చెప్పుకున్న విస్తృతమైన అర్థంలో) అంతిమంగా నిర్దేశిస్తుంది అని చెబుతుంది. చివరిగా, సమాజాల పరివర్తనా చరిత్ర చెబుతున్నట్లు,

(ఉదాహరణకు చైనా సమాజం, సోషలిజానికి పరివర్తన చెందడం) ఈ కాలాల్లో రాజకీయ, భావజాల అంశాలు కీలక పాత్ర పోషిస్తాయి.

ఏ సంఘటనలో అయినా, చారిత్రక భౌతికవాదంలో ముఖ్యమైన అంశాలమేంటే – సామాజిక ఉత్పత్తి, ఉత్పత్తి సంబంధాలు, వర్గపోరాటం చరిత్రకు చోదక శక్తి – అని నొక్కిచెప్పడం. ఈ అంశాలు ఇప్పటికి స్పష్టమయ్యానుకుంటా.

## సంగ్రహంగా

1. చారిత్రక, భౌతిక వాద (మార్క్సిస్టు) దృక్పథంతో సమాజాన్ని అధ్యయనం చేయడంలో సామాజిక ఉత్పత్తి గురించి ఉద్ఘాటించబడుతుంది. రెండు ముఖ్యమైన విశ్లేషణా భావనలు – 'ఉత్పాదక శక్తులు', సాంకేతికంగానే కాదు, ఆ పారిశ్రామిక దశకు సంబంధించిన సామాజిక పని విభజన, సహకార రూపాలు, ఆ దశకు సంబంధించిన సైద్ధాంతిక, ఆచరణాత్మక పరిజ్ఞానం, ప్రకృతి శక్తులపై అదుపు– ఇవన్నీ కలిసి ఉంటాయి. 'ఉత్పత్తి సంబంధాలు', ఉత్పత్తి క్రమంలో సమాజంలోని సభ్యుల మధ్య ఏర్పడే సామాజిక సంబంధాలు (వివిధ వర్గాల మధ్య సంబంధాలు), ఇవి న్యాయపరంగా ఆ సమాజపు ఆస్తి సంబంధాల రూపంలో వ్యక్తం చేయబడతాయి.

2. సామాజిక మార్పు గతిశీలత అనేది ఉత్పాదక శక్తుల, ఉత్పత్తి సంబంధాల మధ్య వైరుధ్యం. సామాజిక ఉత్పత్తి పటంలో వివిధ స్థానాలను ఆక్రమించిన వర్గాల మధ్య పోరాటం రూపంలో ఈ వైరుధ్యం వ్యక్తమవుతుంది. ఈ వైరుధ్యం కాలానుక్రమంలో సామాజిక విప్లవం ద్వారా పరిష్కరించబడుతుంది. సమాజంలో కొత్త ఉత్పత్తి విధానం ఆధిపత్య స్థానంలోకి వస్తుంది. ఉత్పాదక్త శక్తులు, ఉత్పత్తి సంబంధాల మధ్య నూతన పొందిక ఏర్పడుతుంది.

3. ప్రతి సమాజం దానిలో ఒక నిర్దిష్ట ఉత్పత్తి విధానం ఆధిపత్య స్థానంలో ఉండటం ద్వారా తన స్వభావాన్ని వెల్లడించుకుంటుంది. అందుచేత ఒక సమాజాన్ని విశ్లేషిస్తున్నపుడు ఆ ఉత్పత్తి విధానపు భావవర్గాలనే వినియోగించాలి. అదే సమయంలో ఒక సమాజంలో ఉత్పాదక శక్తులకు, ఉత్పత్తి సంబంధాలకు మధ్య వైరుధ్యం అంతర్గతంగా ఉంటుంది కాబట్టి ప్రతిసమాజం మార్పు చెందేదే. అందుచేత మార్క్సిస్టు దృక్పథం సమాజం యొక్క చారిత్రకంగా సాపేక్ష స్వభావాన్ని నొక్కిచెబుతుంది. సమాజాల్ని అధ్యయనం చేసేటపుడు చారిత్రకంగా నిర్దిష్టమైన విశ్లేషణా భావవర్గాలను వినియోగించాలని గట్టిగా చెబుతుంది.

4. కొన్ని మార్క్సిస్టు వివరణల్లో 'ఆర్థిక పునాది' (అంటే ఉత్పాదక శక్తులు, ఉత్పత్తి సంబంధాలు) ఉపరినిర్మాణాన్ని (అంటే రాజకీయాలు లేదా భావజాలాలు)

నిర్దేశిస్తుందని చెప్పబడుతుంది. అయితే ఇక్కడ ఒక విషయాన్ని నొక్కిచెప్పాలి. ఆర్థిక పునాదికి, 'రాజకీయ', 'భావజాల' రంగాలకు మధ్య సంబంధం యాంత్రికంగా ఉండదు, గణిత శాస్త్రంలో మాదిరి సూటిగా ఉండదు. ఈ రెండు రంగాలు సాపేక్ష స్వతంత్రతను కలిగి ఉంటాయి. అసలు ఈ మూడు రంగాల అసమాన అభివృద్ధే సామాజిక వైరుధ్యాలను సృష్టిస్తుంది. ఆ విధంగా మార్క్సిస్టు సామాజిక దృక్పథం అన్ని అంశాలను తేలిగ్గా ఒక దగ్గర పోగుపోయడం కాదు, వాటియొక్క సంక్లిష్ట సంయోగం మాత్రమే. ఆ సమాజంలో తేలిగ్గా అంతటా ఉండే ఒక్కటే వైరుధ్యం ఉండదు. అనేక వైరుధ్యాల సంక్లిష్టత దానిలో ఇమిడి ఉంటుంది. ఆ వైరుధ్యాలలో 'ఆర్థిక' వైరుధ్యం *అంతిమంగా* నిర్ణాయక పాత్ర వహిస్తుంది. ఇక్కడ మరొక విషయాన్ని గమనించాలి. మార్క్సిస్టు అవగాహనలో భావజాలం అంటే కొన్ని భావాల సంచయనం మాత్రమే కాదు. కొన్ని భావాలు ఆధిపత్య పాత్ర వహించే భౌతిక ఆచరణలు కూడ.

5. ఈ అధ్యయన పద్ధతికి సంబంధించిన వివరణ, ఇప్పటికిప్పుడు ఒక చారిత్రక సందర్భానికి సంబంధించిన నిర్దిష్టమైన ప్రశ్నలకు సమాధానం చెప్పలేదు. అలా చేయాలంటే నిశితమైన అనుభవపూర్వక అధ్యయనం ఉండాలి. చారిత్రక భౌతికవాద పద్ధతి, దృక్పథం నిర్దిష్ట వాస్తవాన్ని చారిత్రకంగా నిర్దిష్టమైన విశ్లేషణా భావవర్గాలను వినియోగించి అర్థం చేసుకోడానికి మార్గదర్శిగా ఉపయోగపడుతుంది. అందుచేత నిర్దిష్ట వాస్తవికతను మన ఆలోచనల్లో పునర్నిర్మించుకోవడానికి, నిర్దిష్ట వాస్తవికత తక్షణ పరిశీలన అందించే గందరగోళపు చెత్తను పక్కన పెట్టాలి. కాని ఆ వాస్తవాన్ని మార్పుచేయాలంటే దానికి సంబంధించిన సైద్ధాంతిక అవగాహన ఒక అవసరమైన అంశం. అయితే అదొక్కటే సరిపోదు. ఆ సైద్ధాంతిక అవగాహన ఆధారంగా చేపట్టే ఆచరణాత్మక కార్యాచరణ ద్వారా మాత్రమే ఆ వాస్తవాన్ని ప్రయోజనకరంగా మార్పుచేయగలం. సిద్ధాంతము, ఆచరణల కలయిక ప్రయోజనాత్మక సామాజిక మార్పుకు అవసరమైన, సరిపోయిన షరతు. ఇదే మార్క్సిజానికి అనివార్యమైన నిర్వచనం.

# II. భారత సామాజిక నిర్మాణాలు చరిత్ర పట్ల మార్క్సిస్టు అవగాహన

## 1. పరిచయం

**వ**రుసగా ఏర్పడే ఉత్పత్తి విధానాల పరంగా చరిత్రను చూడటాన్ని మార్క్స్ మనకు బోధించాడు. భారత దేశ చరిత్ర అధ్యయనంలో మార్క్సిస్టు చట్రాన్ని అన్వయించడం సమస్యగానే ఉండిందని మనకు తెలుసు. ఎందువల్లనంటే, భారత దేశంలో బ్రిటిష్ పాలనకు పూర్వం ఆసియా తరహా ఉత్పత్తి విధానం ఉండేదని మార్క్స్, ఎంగెల్స్ చెప్పారు. ఈ అంశం గురించి మనం తర్వాత చెప్పుకుందాం. ఇక్కడ ఒక విషయం చెప్పుకుంటే సరిపోతుంది. గత ఏభై ఏళ్లుగా భారత దేశ చరిత్రను పరిశోధించిన ప్రముఖ మార్క్సిస్టు మేధావులందరూ స్థూలంగా ఆసియా తరహా ఉత్పత్తి విధానం అనే భావనను విడనాడాలి, లేదా పెద్ద ఎత్తున సవరించాలి అన్న అభిప్రాయానికి వచ్చారు.

భారత దేశపు చారిత్రక అనుభవానికి విస్తారమైన చట్రంలో స్థానం కల్పించడానికి ఆధునిక పూర్వ దశ ప్రపంచంలో సామాజిక నిర్మాణాల గురించిన సంక్షిప్త వీక్షణం ఉపయోగకరంగా ఉంటుంది. ప్రపంచ చరిత్రలో వర్గసమాజ ఆవిర్భావం, తొలిదశ రాజ్యం నిర్మాణం అతి ప్రాచీన కాలంలో దక్షిణ ఇరాక్ ప్రాంతంలో అసాధారణసమగ్ర రీతిలో వ్యక్తమయిందని చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. మనకు సుమేరియన్ నాగరికతగా తెలిసిన తొలి నాగరికత ఆ ప్రాంతంలో క్రీ.పూ. 3000 నాడే మొదలయింది. ఆహారాన్ని సేకరించే, వేటాడే సమాజం నుండి (పాత రాతియుగం, మధ్య రాతియుగం) నుండి తొలి ఆహార

ఉత్పత్తి సమాజం (కొత్త రాతియుగం) మనం తొలుత భావిస్తున్నట్లు సారవంతమైన నదీలోయల్లో కాకుండా, మారుమూల నివాస ప్రాంతాలలో మొదలయింది. ఇలా ఆవిర్భవించిన కీలకమైన ప్రాంతాలు – పాలస్తీనా లోని మృత సముద్ర ప్రాంతం, జోర్డాన్ లోయ, సిరియా, ఉత్తర ఇరాక్, వాయవ్య ప్రాంత ఇరాన్ లోని భాగాలు. కొత్త రాతియుగపు తొలి స్థావరాలు క్రీ.పూ. 9000 నుండే కనిపిస్తాయి. క్రీ.పూ. 6000 నాటికల్లా ఉత్తర ప్రాంత ఇరాక్ అంతటా ఆహార ఉత్పత్తి (వ్యవసాయం, పశు పోషణ ద్వారా) విస్తరించింది. ఆ తర్వాత మూడు వేల సంవత్సరాల కాలంలో దక్షిణ ఇరాక్‌లో పెద్దఎత్తున మిగులు ఉత్పత్తి కావడానికి, ఆ మిగులును పాలకవర్గాలు స్వాధీనం చేసుకొని వర్గ సమాజం ఏర్పడటానికి చారిత్రక పరిస్థితులు రూపుదిద్దుకున్నాయి. క్రీ.పూ. 3000 నాటి కల్లా ఈ ప్రాంతంలో సుమేరియన్ నాగరికత ఉనికిలోకి వచ్చింది. విస్తారమైన పట్టణీకరణ, చేతిరాత, చక్రం వినియోగం, కృత్రిమ సాగునీటి సదుపాయాలు, రాజకీయ అదుపు కలిగిన శక్తివంతమైన పూజారి వర్గం, కంచు లోహపరిశ్రమ, పితృస్వామ్యం, బానిస సమాజం – ఇవి సుమేరియన్ నాగరికత లక్షణాలు.

మిగులు ఉత్పత్తికి అనుకూలమైన సామాజిక, సాంకేతిక అవకాశాలు, పెద్ద మానవ సమూహాలను దీర్ఘకాలం పాటు బందీలుగా ఉంచేందుకు రాజకీయ న్యాయపరమైన వ్యవస్థల ద్వారా బలాన్ని సమీకరించకలిగిన సామర్థ్యం– ఇవి ప్రాచీన మెసపటోమియా, ఈజిప్టు, అనటోలియా మొదలైన ప్రాంతాలలో సామాజిక నిర్మాణాలు ఏర్పడేలా చేశాయి. బానిసత్వంతో పాటు, ఈ సమాజాలలో వివిధ స్థాయిల్లో స్వేచ్ఛలేని కట్టుబానిస రూపాలు ఉండేవి. అయినప్పటికీ ఈ ప్రాంతాలలో వ్యవసాయం బానిస శ్రమను విస్తారంగా వినియోగించడంపై ఆధారపడలేదు. ఈ పరిణామం తర్వాత గ్రీకు–రోమన్ సమాజాలలో చోటుచేసుకుంది. వ్యవసాయంలోను, చేతివృత్తులలోను కనీసం క్రీ.పూ. 800 నుండి గ్రీసులో బానిస శ్రమను విరివిగా వినియోగించిన దాఖలాలు కనిపిస్తాయి. క్రీ.పూ. 500 నాటికి సంప్రదాయ యుగం ప్రారంభం అయ్యే సమయానికి గ్రీసు దేశం చాల భాగంలో బానిస ఉత్పత్తి విధానం బాగా వేళ్లూనుకుంది. స్వేచ్ఛగా వ్యవసాయం చేసుకునే రైతాంగం నుండి వివిధ రూపాలలో మిగులు స్వాహా చేయడం ఉన్నప్పటికీ, సంప్రదాయ యుగంలో మిగులు స్వాధీనం చేసుకునే ప్రక్రియలో బానిస శ్రమ దోపిడీయే ఆధిపత్య స్థానంలో ఉండేది. (దీని గురించి సెక్షను 3 చూడండి.) ఆ తర్వాత రోమన్ సామ్రాజ్యం పశ్చిమ ప్రాంతంలో క్రీ.పూ. 300 నుండి

క్రీ.శ. 300 మధ్య కాలంలో బానిస శ్రమ దోపిడీ అత్యున్నత స్థాయికి చేరింది. ఈ కాలంలో ప్రాచీన రోమ్‌లోని పాలక వర్గం తమ సంపదను పెద్ద ఎత్తున బానిస శ్రమను దోచుకోవడం ద్వారానే సమీకరించింది. ఇంత భారీగా బానిస శ్రమ దోపిడీ మరే ఇతర సమాజంలోను జరగలేదు.

అనేక అంశాలు, ఉదాహరణకు బానిస వ్యాపారం తగ్గిపోవడం, జర్మానిక్ తెగల వారి వలసలతో విచ్ఛిన్నాలు మొదలైన వాటి ద్వారా క్రీ.శ. 3వ శతాబ్దం మధ్య నుండి బానిస ఉత్పత్తి విధానం సంక్షోభంలో పడటం ఆరంభం అయింది. 5, 6 శతాబ్దాల కల్లా బానిస ఉత్పత్తి విధానం క్షీణించింది. ఆ తర్వాతి శతాబ్దాలలో నూతన ఉత్పత్తి సంబంధాలు రూపుదిద్దుకోవడం మొదలయింది. ప్రత్యేకించి పశ్చిమ ఐరోపాలో (బానిస శ్రమ అత్యంత విస్తారంగా ఉండే ఈ ప్రాంతంలో, సామ్రాజ్యపు ఇతర ప్రాంతాలలోకన్నా ఎక్కువ తీవ్రంగా బానిస ఉత్పత్తి విధానం సంక్షోభంలో పడింది.) ఇది బానిస ఉత్పత్తి విధానం నుండి అర్ధబానిస రైతు వ్యవస్థకు దారితీసింది. మిగులు స్వాధీనం చేసుకోవడంలో ఆధిపత్య స్థానంలో ఉన్న బానిస శ్రమ స్థానాన్ని అర్ధ బానిస రైతు దోపిడీ ఆక్రమించింది. ఈ దోపిడీ ఫ్యూడల్ ఉత్పత్తి విధానానికి ప్రాతిపదికగా పనిచేసింది. పదవ శతాబ్దం ఆరంభం నాటికి పశ్చిమ ఐరోపాలో ఫ్యూడల్ వ్యవస్థ పూర్తిగా వేళ్లూనుకుంది. అర్ధ బానిస రైతు విధానంలో అర్ధ బానిస రైతులు చిన్న చిన్న భూఖండాలు కలిగి ఉంటారు. (ఆ భూమిపై ఆ రైతే కాకుండా మొత్తం రైతు కుటుంబం అంతా శ్రమిస్తుంది.) ఫ్యూడల్ ప్రభువు ఎస్టేట్ భూముల్లో నిర్బంధంగా పనిచేసేదానికి బదులుగా వారికి ఈ భూఖండాలు లభిస్తాయి. అర్ధ బానిస రైతు శ్రమ ద్వారా స్వాధీనం చేసుకోబడిన మిగులు (ఇంకా ఇతర దోపిడీ విధానాల ద్వారాను, మధ్యయుగాల వరకు కొనసాగిన బానిసశ్రమ దోపిడీ ద్వారాను పోగైన మిగులు) ఫ్యూడల్ ప్రభువులు సాయుధ బలగాలను పోషించడానికి వనరులను సమకూర్చేది. వారు ఫ్యూడల్ సంబంధాలతో నిచ్చెన మెట్ల రాజకీయ, సైనిక, వ్యవస్థలో స్థానాలను పొందేవారు. రైతాంగ తిరుగుబాట్లతో పద్నాలుగవ శతాబ్ది తర్వాత అర్ధ బానిస రైతు వ్యవస్థ క్షీణించి, పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల అభివృద్ధికి మార్గం సుగమమయింది.

భారత దేశపు ఆధునిక పూర్వ దశను భౌతికవాద దృక్పథంతో అర్థం చేసుకునేటపుడు ఒక విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. ఐరోపాలో బానిస విధానం, ఫ్యూడలిజాలు గ్రీకు–రోమను ప్రాచీనతకు, మధ్య యుగాల ఐరోపాకు సంబంధించిన ప్రత్యేక చారిత్రక క్రమాల ఫలితం అని గ్రహించాలి.

## 2. భారత దేశంలో సామాజిక నిర్మాణాల చారిత్రక రేఖా చిత్రం

భారత దేశంలో వలస పూర్వ సమాజాన్ని మార్క్స్, ఎంగెల్స్ ఆసియా తరహా ఉత్పత్తి విధానం అని పిలవడం, అంటే తాము సవివరంగా అధ్యయనం చేసిన (ప్రధానంగా) ఐరోపా సమాజాలకు భిన్నమైనదిగా ఉందని చెప్పడం, భారత దేశంలో మార్క్సిస్టు చారిత్రక అధ్యయనానికి కొన్ని ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ఆసియా తరహా ఉత్పత్తి విధానం అనేదాన్ని మార్క్స్ ఎప్పుడూ విపులంగా వివరించలేదు. ఆ సమాజంలో ఉత్పత్తి యూనిట్లుగా ఒకేతరహా గ్రామీణ సముదాయాలు ఉండేవని చెప్పాడు. ఆ గ్రామ సముదాయంలో ఉత్పత్తి అయిన దాదాపు మొత్తం మిగులును నిరంకుశ రాజ్యమే స్వాధీనం చేసుకునేది. భూమిపై యాజమాన్యం అంతా పాలకునిదే. ప్రైవేటు ఆస్తి హక్కులనేవి లేనేలేవు. దానిమూలంగా వర్గ వ్యత్యాసాలు అనేవి దాదాపు లేనేలేవు. మార్క్స్ చెప్పిన ప్రకారం, భారత దేశంలో గ్రామీణ సముదాయాలు అనేవి వేల సంవత్సరాలుగా ఎలాంటి మార్పు లేకుండా కొనసాగాయి. పైస్థాయిలో రాజ్యాలు, రాజుల మార్పులు ఈ సముదాయాలపై ఎలాంటి ప్రభావం చూపలేదు. గ్రామీణ సముదాయాలపై మార్క్స్ అభిప్రాయాలు కాల క్రమలో ఏర్పడ్డాయి, కాని మార్క్స్ తర్వాత సంవత్సరాల్లో వర్గ వ్యత్యాసాలు కలిగిన మరింత సంక్లిష్టమైన గ్రామీణ సముదాయాల గురించి చెప్పాడు. ఈ సామాజిక నిర్మాణాన్ని విధ్వంసం చేయడంలో బ్రిటిష్ పాలన కూడ 'పునరుజ్జీవన' పాత్ర పోషించింది. అయితే దానికి అపారమైన మానవ కడగండ్లతో మూల్యం చెల్లించాల్సి వచ్చింది.

ఇరవై శతాబ్దం మధ్య నుండి భారత చరిత్రను అధ్యయనం చేస్తున్న చరిత్రకారులు ఈ ఆసియా తరహా ఉత్పత్తి విధానాన్ని విమర్శిస్తూ వరుసగా రచనలు చేస్తూ వచ్చారు. ఆ రచనల ద్వారా ఒప్పుకునే రీతిలో ఆ భావనను తిరస్కరించారు. డిడి కొశాంబి, ఆర్ఎస్ శర్మ, ఇర్ఫాన్ హబీబ్ ఈ విషయంలో మార్గదర్శక కృషి చేశారు. ఈ అంశంపై మౌలిక రచన డిడి కొశాంబి 'యాన్ ఇంట్రడక్షన్ టు ఇండియన్ హిస్టరీ' (భారత దేశ చరిత్ర– ఒక పరిచయం) 1956, తర్వాత ఆర్ఎస్ శర్మ 'శూద్రాస్ ఇన్ ఏన్సియంట్ ఇండియా' (ప్రాచీన భారత దేశంలో శూద్రులు) 1958, హబీబ్ రచన 'అగ్రేరియన్ సిస్టమ్ ఆఫ్ మొగల్ ఇండియా' (మొగల్ సామ్రాజ్యంలో వ్యవసాయ వ్యవస్థ) 1963, ఆర్ఎస్ శర్మ రచన 'ఇండియన్ ఫ్యూడలిజం' (భారత దేశంలో ఫ్యూడలిజం) 1965. ఈ రచనలన్నీ కలిసి భారత దేశపు గతాన్ని గురించిన, ప్రత్యేకించి వలస పూర్వ దశకు సంబంధించిన మార్క్సిస్టు అవగాహనకు పునాది వేశాయి. ఈ

రచనలన్నీ కూడ మార్క్సిస్టు పద్ధతితో తీవ్రమైన చారిత్రక అధ్యయనం చేసినవి, ఈ అంశంపై జరిగిన అతి తాజా పరిశోధనలన్నింటినీ ఈ రచనలు తమలో ఇముడ్చుకున్నాయి. భారత ఉపఖండపు చరిత్రను కూడ ఇతర చోట్ల కొనసాగిన సమాజాల మాదిరిగానే వరుసగా ఏర్పడే ఉత్పత్తి విధానాల తోనే అధ్యయనం చేయవచ్చునని చెప్పాయి. వివిధ స్థాయిల్లో వర్గ సంఘర్షణల ద్వారాను, సాంకేతికతలో వచ్చే మార్పులు, మిగులును స్వాధీనం చేసుకునే రూపాల్లో మార్పుల ద్వారాను ఉత్పత్తి విధానాలు మారుతూ వచ్చాయని చెబుతాయి. అంతేకాదు, ఆదిమ కమ్యూనిస్టు, బానిస, ఫ్యూడల్, పెట్టుబడిదారీ సమాజాల వరుస ఇక్కడ ప్రతిరూపం మాదిరి కనిపించదు. ఇలా వరుస ఉత్పత్తి విధానాల విశ్వజనీనత భౌతిక వాద దృక్పథానికి అత్యవసరం ఏమీ కాదు. భారత సామాజిక నిర్మాణాలలో వివిధ స్థాయిల్లో బానిస విధానం పైన, ఫ్యూడల్ విధానంపైన ఆధారపడిన ఉత్పత్తి సంబంధాలు కనిపిస్తాయి. భారత ఉపఖండంలోని ప్రత్యేక చారిత్రక పరిస్థితుల్లో వాటికి ఆ నిర్దిష్టతలు సంతరించాయని వేరుగా చెప్పనక్కరలేదు. కొందరు మార్క్సిస్టు పండితులయితే ఈ ప్రత్యేకతలు సృష్టించిన భిన్నత్వాలు 'బానిస' లేదా 'ఫ్యూడల్' అనే ముద్ర వేయడాన్ని కూడ కష్టతరం చేస్తాయని చెబుతారు. ఇవన్నీ కూడ మార్క్సిస్టు అవగాహనతో చరిత్రను అధ్యయనం చేయడంపై కొనసాగుతున్న చర్చలోని అంశాలు.

♦ ♦ ♦

భారత ఉపఖండంలో ఆహార సేకరణ, వేటాడే దశనుండి, ఆహార ఉత్పత్తి దశకు పరివర్తన సుమారు క్రీ.పూ. 7000 లో జరిగింది. ఆహార ఉత్పత్తి ఆరంభం గురించిన ఆధారం బలూచిస్తాన్‌లో గుర్తించబడిన పురావస్తు ప్రాంతం మెహర్‌ఘర్‌లో లభించింది. ఆ తర్వాత 4000 సంవత్సరాలలో ఆహార ఉత్పత్తి విస్తరించి కొత్త రాతి యుగపు సంస్కృతులు రూపుదిద్దుకొని బలూచిస్తాన్ నుండి సింధు పరివాహక ప్రాంతానికి వ్యాపించాయి. సింధు పరివాహక ప్రాంతంలో అభివృద్ధి చెందిన కొత్త రాతియుగ సంస్కృతులు క్రీ.పూ. 3200 లలో ఏర్పడ్డాయి. వీటిలో అత్యంత ప్రముఖమైనది అధిక విస్తీర్ణంలో వ్యాపించిన కోట్ డిజి సంస్కృతి (క్రీ.పూ. 3200–2600). వ్యవసాయం అభివృద్ధి చెందటం, నాగలిని వినియోగించడం, రాగి ఖనిజ తయారీ మొదలవడం – ఇవన్నీ కలిసి కోట్ డిజి ప్రాంతం (పరిమాణంలోను, సంక్లిష్టతలోను బాగా అభివృద్ధి చెందిన) లో మిగులు ఉత్పత్తికి అవసరమైన పరిస్థితులను

సృష్టించాయి. హరప్పా సంస్కృతి క్రీ.పూ. 2600లో ఉనికిలోకి వచ్చింది. క్రీ.పూ. 2500 నాటికి పరిపక్వ దశకు చేరింది. ఈ పరిపక్వ దశ క్రీ.పూ. 2000 వరకు కొనసాగింది. అయితే, హరప్పా సంస్కృతి ఆరంభం గురించిన సమాచారం ఇప్పటికీ అస్పష్టంగానే ఉంది. ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న పరిజ్ఞానం ప్రకారం అంతకు ముందున్న ఏ సంస్కృతులూ ఈ సంస్కృతి ఆవిర్భావానికి నేరుగా దారితీశాయని చెప్పడానికి ఆధారాలు లేవు. ఇదే సమయంలో మనం ఒక్క విషయం మాత్రం గుర్తించాలి. క్రీ.పూ. 2600 కన్నా ముందు సింధు పరివాహక ప్రాంతంలో నాగరికత అభివృద్ధి చెందటానికి కావలసిన పరిస్థితులు కచ్చితంగా ఉండే ఉంటాయి.

హరప్పా నాగరికత (లేదా సింధు నాగరికత) అభివృద్ధి చెందిన సమయంలో పట్టణీకరణ విప్లవం జరిగింది. పెద్ద పెద్ద, చక్కటి లేఅవుట్లతో కూడిన నగరాలు విస్తారమైన ప్రాంతంలో ఉనికిలోకి వచ్చాయి. (వాయివ్య ప్రాంత సరిహద్దు రాష్ట్రం, సింధ్, పంజాబ్, హర్యానా, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, పశ్చిమ ఉత్తర ప్రదేశ్) ఈ నగరాలు అన్నీ ఆశ్చర్యకరమైన రీతిలో కేంద్రీకృత అదుపు ఉండేలా ఒకే మాదిరిగా ఉంటాయి. ఆయా ప్రాంతాలలో లభించిన పురావస్తు ఆధారాలు పాలక కులీన వర్గపు విలాసవంతమైన జీవితాన్ని వెల్లడిస్తున్నాయి. ఇలాంటి జీవనం పెద్దఎత్తున వ్యవసాయ మిగులు ఉత్పత్తిని సమర్థవంతంగా స్వాధీనం చేసుకోవడం ద్వారానే సాధ్యమవుతుంది. బహుశా వాణిజ్యంపై విధించిన పన్ను వసూళ్లు కూడ ఉండి ఉంటాయి. నగర ఆవాసాలలో గుర్తించదగిన ఏకరూపత బహుశా దండయాత్రల ద్వారా మోపబడిన కేంద్రీకృత అదుపు వల్ల కావచ్చు. మనం దీన్ని 'సింధు సామ్రాజ్యం' అని కూడ పిలవవచ్చు. ఏదేమయినప్పటికీ, బాగా విస్తారమైన హరప్పా నాగరికత ప్రాంతం అనేది ఉండింది. ఇది అక్షరాస్యత కలిగిన సమాజం అయినప్పటికీ ఆ లిపిని ఇంతవరకు అర్థం చేసుకోవడం జరగలేదు. అందువల్ల హరప్పా నాగరికత రాజకీయ చరిత్రను తెలుసుకోవడం సాధ్యం కాలేదు. హరప్పా నాగరికతలో లభించిన ముద్రల్లోని గుర్తులు పూర్తిగా అభివృద్ధి చెందిన లిపిని సూచించడం లేదన్న అభిప్రాయం కూడ ఉంది. లభించిన ఒక్కో ముద్రలో సగటున ఐదు గుర్తులు లభించాయి. కేవలం అవే పూర్తిస్థాయి లిపికి సరిపోవు.

హరప్పా నాగరికత క్రీ.పూ. 2000–1900 మధ్యలో అర్థంతరంగా అంతరించింది. ఎలా అంతమయిందన్న దానిపై చరిత్రకారుల్లో వూహలు మాత్రమే ఉన్నాయి. ఒక అర్థవంతమైన కచ్చితమైన సమాధానం మనకు ఇప్పటి వరకు లేదు.

వనరులను మితిమీరి కొల్లగొట్టడం పర్యావరణ క్షీణతకు దారితీసిందన్నది పరిగణనలోకి తీసుకోదగిన ఒక ప్రతిపాదన. దౌర్జన్యపూరిత చొరబాట్లు జరిగిన ఆధారాలు కూడ ఉన్నాయి. ఇంతకు ముందు వీటిని ఆర్యుల 'దండయాత్రలు' తో సంబంధం ఉన్నవని చెప్పారు. అయితే ఈ సంబంధం గురించి తగినంత సాక్ష్యాధారాలు మాత్రం లభ్యం కాలేదు. క్రీ.పూ. 1900 తర్వాత నగరాలు అంతరించాయి, చేతిరాత కూడ అదృశ్యమయింది, హరప్పా నాగరికతకు సంబంధించిన అనేక లక్షణాలు కనిపించకుండా పోయాయి. తర్వాత అనేక శతాబ్దాల తర్వాత కాని నగరాలు మళ్ళీ ఏర్పడలేదు. లిపి అయితే క్రీ.పూ. 3 వశతాబ్ది ఆరంభంలో కాని కనిపించలేదు.

హరప్పా నాగరికత ముగిసిన తర్వాత కాలం, ఇరాన్ నుండి, అఫ్ఘనిస్తాన్ నుండి ఆర్యులు వలసలు వూపందుకున్న కాలం కూడ. క్రీ.పూ. 1600 నాటికల్లా భారత ఉపఖండం వాయివ్య ప్రాంతంలో ఆర్యుల స్థావరాలు ఒక నూతన పశు పోషక ఆర్థిక వ్యవస్థను ఏర్పరుచుకున్నాయి. 'ఆర్యులు' అనేది భాషా గ్రూపును సూచించే పదం. అంటే ఇండో – ఆర్యన్ గ్రూపుకు సంబంధించిన ఒక భాషను మాట్లాడే వారికి చెందినది. అది ఒక 'జాతి'ని సూచించే పదం మాత్రం కాదు.

ఇండో– ఆర్యన్ భాషా కుటుంబం, మరింత పెద్దదైన ఇండో– యూరోపియన్ భాషా కుటుంబంలో ఒక భాగం. ఈ నూతన పశుపోషక సామాజిక నిర్మాణపు (తొలి వేద యుగం) సాక్ష్యాలు పురావస్తు పరిశోధనల్లోనే కాకుండా, రుగ్వేదంలో కూడ (క్రీ.పూ. 1500 నుండి క్రీ.పూ. 1000 మధ్య కాలంలో కూర్చబడింది) కనిపిస్తాయి. ఇది దాదాపు పూర్తిగా గ్రామీణ సమాజం, ప్రత్యేకంగా పశుపోషణపైనే ఆధారపడిన సమాజం. వేద కాలపు ఆర్థిక వ్యవస్థ గురించిన తొలి అధ్యయనాలు ఆ వ్యవస్థ పూర్తిగా పశుపోషక వ్యవస్థేనని చెప్పినప్పటికీ, పురావస్తు సాక్ష్యాలు, రుగ్వేదంలోని ఆధారాలు ఆ వ్యవస్థలో వ్యవసాయానికి కూడ కొంత పాత్ర ఉన్నట్లు చెబుతాయి. అంతేకాదు, ఆర్యులు తమతో పాటు మచ్చికచేయబడిన గుర్రాన్ని కూడ తీసుకొచ్చారు. ఇక్కడ వేదకాలపు పూర్వం గుర్రం ఉన్నట్లు మనకు సాక్ష్యాలు లేవు.

ఇక్కడ మనం ఒక విషయం గుర్తించాలి. ఉపఖండం వాయివ్య ప్రాంతంలోను, ఉత్తర ప్రాంతంలోను వేద యుగంలో పశుపోషక, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ తన ప్రత్యేకతలతో అభివృద్ధి చెందుతున్నపుడే, ఉపఖండం ఇతర ప్రాంతాలలో ఆహార సేకరణ, వేటపై ఆధారపడిన, ఆహార ఉత్పత్తిపై ఆధారపడిన లేదా రెండింటి కలయికతో కూడిన జీవనానికి సరిపడినంత మాత్రమే ఉత్పత్తి చేయకలిగిన వ్యవస్థలు

రూపొందుతుండేవి. మధ్య భారతంలోను, దక్షిణ భారతంలోను, తూర్పు భారతంలోను, ఈశాన్య భారతంలోను కొత్తరాతియుగానికి, లోహాల వినియోగానికి మారిన కాలక్రమణిక కొద్దిగా తేడాగా ఉంది. ఉదాహరణకు మణిపూర్‌లో కొత్తరాతియుగపు స్థావరం నాపెషిక్‌లో క్రీ.పూ. 1700 లో ఆరంభం అయినట్లు ఆనవాళ్లు లభించాయి. కొత్త రాతియుగపు పనిముట్లు మేఘాలయ (సెల్బాల్‌గిరి) లోను, అస్సాం (సరుతారు) లోను, నాగాలాండ్ లోను లభించాయి. అయితే వాటి గురించిన పూర్తి తవ్వకాలు కాని, సవివరమైన అధ్యయనాలు కాని ఇంకా జరగలేదు. ఉప ఖండపు ప్రాచీన చరిత్రను సమగ్రంగా తెలుసుకోవాలంటే ఇలాంటి స్థావరాల అధ్యయనానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. ఉత్తర భారత దేశ చరిత్రపైనే కేంద్రీకరించడం మూలంగా ఇలాంటి చోట్ల చరిత్ర అధ్యయనానికి తగినంత నిధులు కాని, ప్రభుత్వ మద్దతు కాని కొరవడింది.

రుగ్వేదంలో నిరంతరం ప్రస్తావించబడే గుర్రం వేద-సంస్కృత భాష మాట్లాడే ఆర్యులకు సంబంధించిన ఒక ప్రత్యేక సంకేతం. హరప్పా నాగరికతలో గుర్రాన్ని మచ్చిక చేసి పోషించిన దాఖలేమీ కనిపించవు. వేదాల్లో ప్రస్తావించబడటమే కాకుండా, భారత దేశంలో హరప్పా అనంతర కాలంలో మాత్రమే మచ్చిక చేయబడిన గుర్రం ఉన్నట్లు పురావస్తు పరిశోధనలు చెబుతున్నాయి. హరప్పా సంస్కృతిని, వేద ఆర్య సంస్కృతిని సమానం చేసి చెప్పడానికి ఈ మచ్చిక చేయబడిన గుర్రం ప్రస్తావన భారత దేశపు చరిత్రను వక్రీకరించే వారికి అవరోధంగా ఉంది. అయితే, హరప్పా సంస్కృతి కాలంలోనే గుర్రం ఉందని సాక్ష్యాలను సృష్టించడానికి ప్రయత్నం జరగడం ఆశ్చర్యం కలిగించదు. కాని ఇలాంటి వారి ప్రయత్నాలన్నీ తిప్పికొట్టబడినాయి. ఎన్ఎస్ రాజారాం తన 'చదవబడిన సింధూ లిపి' (2000) గ్రంథంలో ఇలాంటి ప్రయత్నమే చేశారు. ఇంతకు ముందు మనం చెప్పుకున్నట్లు ఈ లిపి అసలు పూర్తి స్థాయి లిపి అవునా కాదా అన్న విషయం కూడ ఇంకా నిర్ధారించబడలేదు. ఒక హరప్పా ముద్రపై గుర్రం బొమ్మ ఉన్నట్లు ఈ పుస్తకంలోని ఒక చిత్రం సూచిస్తుంది. కాని గుర్రం ఉందని చెప్పడానికి ఆయన చేసిన ఈ ప్రయత్నం మోసం అని తర్వాత రుజువయింది. అది 'కంప్యూటర్లో సృష్టించబడిన చిత్రం' అని ఆయనే అంగీకరించాల్సి వచ్చింది. ఆయన గణిత శాస్త్రంలో శిక్షణ పొందిన వ్యక్తి, తన కెరీర్‌లో కొంత కాలం అమెరికాలోని 'నాసా' లో పనిచేసినట్లు చెప్పుకున్నాడు. భారత దేశపు చరిత్రపై జరుగుతున్న దాడికి స్ఫూర్తిలో ఎక్కువ భాగం చరిత్రకారులు కానివారి నుండి,

సాధారణంగా జీవశాస్త్రం, గణిత శాస్త్రాల లాంటి వాటికి సంబంధించిన అమెరికాలో స్థిరపడిన ఎన్నారైల నుండే లభిస్తున్నదని చెప్పడానికి పెద్ద తెలివితేటలేవీ అవసరం లేదు. ఈ దాడిని పాశ్చాత్య దేశాలలోని ఒక సెక్షను ఎన్నారైలు కొంత నిర్వహిస్తున్నారు. హిందూత్వ రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకువెళ్ళడంలో ఇలాంటి వారి సహవాసాన్ని సంఘ్‌పరివార్ ఎంతో విలువైనదిగా పరిగణిస్తుంది. ప్రత్యేక పరిజ్ఞానం లేని సెక్షన్లలో చరిత్రపై దాడికి ఇది చట్టబద్ధతను కల్గిస్తుంది. ప్రత్యేకించి పట్టణప్రాంత మధ్యతరగతి వర్గం దీన్ని అభివృద్ధి చెందిన చరిత్ర పరిశోధనగా భావిస్తుంది.

తొలి ఆర్య కాలంలో గుర్రాలు పూనిన రథాలు (హరప్పా కాలానికి చెందిన ఎద్దులు పూనిన రథాల స్థానంలో వచ్చాయి.) బహుశా వివిధ ఆర్య, ఆర్యేతర ప్రజలను జయించి లొంగదీసుకోవడానికి వీలు కల్పించి ఉండవచ్చు. ఋగ్వేదంలో ఒక వైపున ఆర్య తెగలకు, మరొక వైపున దస్యులు, దాసులకు మధ్య సంఘర్షణలు జరిగిన ప్రస్తావనలు నిరంతరం కనిపిస్తాయి. దస్యులు, దాసులు సైతం ఆర్యులే అయి ఉంటారు. (వీరు కూడ ఆర్య భాష లేదా యాసనే మాట్లాడతారు, అయితే వీరి భాష వేద సంస్కృత భాష మాట్లాడే ప్రజలకు భిన్నమైనది. బహుశా తొలి దశలో వలస వచ్చిన ఆర్యులు అయి ఉంటారు. ఒక భాషా గ్రూపుగా ఆర్యులు అంతర్గతంగా ఎలాంటి వ్యత్యాసాలు లేనివారని అనుకోరాదు. దాసులు తక్కువ శతృత్వాన్ని ఎదుర్కొన్నారు. (దస్యుల ఊచకోత గురించిన ప్రస్తావనలు తరచు కనిపిస్తాయి. అదే దాసుల విషయంలో అలాంటి ప్రస్తావనలు ఉండవు.) దాసులు భాషాపరంగా వేద సంస్కృత ఆర్యుల భాషా గ్రూపుకు దగ్గరివారయి ఉంటారు. అయితే ఇది ఊహ మాత్రమే. తర్వాత్తర్వాత భాషాపరమైన, తెగపరమైన ఆర్యులలో వేద సంస్కృతం మాట్లాడే గ్రూపు ఆర్యులు ఆధిపత్యం సంపాదించారు.

తొలి ఆర్య యుగం ముగింపుకొచ్చేసరికల్లా లొంగదీసుకోబడిన దస్యులు, దాసులు కూడ కలపబడి 'శూద్రులు' గా వర్గీకరించబడి ఉండవచ్చు. ఋగ్వేదంలో శూద్ర ప్రస్తావన ఒకే ఒక్క సారి మాత్రమే కనిపించినప్పటికీ (ఋగ్వేదం పుస్తకం 10, పురుష సూక్తంలో ఈ ప్రస్తావన ఉంటుంది. బహుశా ఈ పుస్తకం మలి వేద యుగం ఆరంభానికి దగ్గరగా కూర్చబడి ఉండవచ్చు.) తొలి ఆర్య యుగం ముగింపు దశలో నిచ్చెన మెట్ల వర్ణ వ్యవస్థ ప్రాథమిక రూపంలో కనిపించడం ప్రారంభం అయిందని అది ప్రస్తావించబడిన సందర్భం, తర్వాత కాలంలో లభించిన సాక్ష్యాలు సూచిస్తున్నాయి. శూద్రులు, వీరిలో కొంత భాగం బానిసలుగా చేయబడినవారు

(బానిసలకు ఉపయోగించబడిన మరొక పదం దాసులు, ఈ పదం లొంగదీసుకోబడిన దాసుల నుండి వచ్చింది.) వేద సంస్కృత భాష మాట్లాడే ఆర్యుల కన్నా తక్కువ వారు. వారికి ఎలాంటి హక్కులు ఉండవు, శ్రమ మాత్రమే చేయవలసి ఉంటుంది. మొట్టమొదట బానిసల ప్రస్తావన స్త్రీ బానిసల గురించి చెప్పడం కోసం చేయబడిందని గుర్తించాలి. యుద్ధాలు, విజయాలు జరిగిన క్రమంలో పరాజితులైన గ్రూపులకు చెందిన పురుషులను చంపివేసి, వారి మహిళలను బానిసలుగా చేసుకొని ఉండవచ్చు. వేద ఆర్యుల స్థావరాలు విస్తరించిన కొద్దీ వేద ఆర్య సమాజాలతో సంబంధంలోకి వచ్చిన ఆర్యేతరులు ఎలా శూద్రుల స్థాయికి దిగజార్చబడేవారో అలాగే వేద తెగలలో వ్యత్యాసాలు పెరుగుతున్న కొద్దీ వేద సంస్కృతం మాట్లాడే ఆర్యుల్లోను, ఇతర ఆర్య తెగల్లోను కొందరు శూద్రులుగా చేయబడి ఉండవచ్చు.

ఈ పరిణామాలు తదుపరి తుది వేద యుగంలో (క్రీ.పూ. 1000– 700) మరింత ప్రముఖంగా చోటుచేసుకున్నాయి. ఈ దశలో వేద ఆర్యుల స్థావరాలు తూర్పుకు గంగా పరీవాహక ప్రాంతానికి విస్తరించాయి. ఈ సారవంతమైన ప్రాంతంలో స్థావరాలు ఏర్పరుచుకోవాలంటే దట్టమైన అడవులను నరకడం అవసరం అయింది. అది ఇనుప ఖనిజ తయారీ పరిజ్ఞానం ఆగమనంతో (క్రీ.పూ. 1000 ఆ తర్వాత) సాధ్యమయింది. అయితే ఇనుమును విరివిగా వాడటం తుది వేద యుగం ముగింపుకొచ్చే సమయానికి మాత్రమే ఆచరణలోకి వచ్చింది. ఆర్యుల స్థావరాలు తూర్పు దిక్కుకు మారడం, దానితో పాటు సాంకేతిక అభివృద్ధి ఉదాహరణకు బెజ్జంతో కూడిన ఇనుప గొడ్డలి, ఇనుప నాగలి కర్రు మొదలైన పరికరాలు బారీగా మిగులు ఉత్పత్తికి భౌతిక పరిస్థితులను సృష్టించాయి. ఈ పరిణామం వర్గ విభజనను వేగవంతం చేసింది. ఇది బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే కఠినమైన నిచ్చెన మెట్ల వర్ణవ్యవస్థ ఏర్పడటంలో ప్రతిబింబించింది. వర్గ విభజన పెరుగుతుండటంతో శూద్రులు ఎలాంటి ఆస్తి లేకుండా అంతకంతకూ సేవకుల స్థాయికి దిగజార్చబడ్డారు.

శూద్రుల స్థాయి దిగజార్చబడటం అనే ఈ చారిత్రక ధోరణి (కొంత మేరకు వైశ్యుల స్థాయి కూడ) వేద యుగం ముగిసిన తర్వాత కూడ కొనసాగింది. ఈ కాలంలోనే కఠినంగా విభజించబడిన వర్గ సమాజం ఉనికిలోకి వచ్చింది. ఈ వర్గ సమాజం శూద్రుల, వైశ్యుల, 'కుల బహిష్కృతుల' శ్రమపై ఆధారపడింది. నిచ్చెనమెట్ల వర్ణవ్యవస్థతో కూడిన బ్రాహ్మణ భావజాలాన్ని విపులీకరించడం ఈ కాలంలోనే జరిగింది. ఇది క్రింది కులాల వారి దోపిడీని చట్టబద్ధం చేస్తుంది. సాధారణంగా

శూద్రులకు ఆస్తి ఏమీ ఉండదు. వ్యవసాయ కార్మికులుగా (కర్మకారులు/కమ్మకారులు) పనిచేస్తారు. లేదా చేతివృత్తులు చేస్తారు. వ్యవసాయంలో బానిస శ్రమను విస్తారంగా వినియోగించనప్పటికీ, శూద్రుల్లో ఒక సెక్షను బానిసలుగా ఉంటారు. శూద్రులు అపవిత్రులని పూజాపునస్కారాలలో పాల్గొననీయక పోవడం క్రీ.పూ. 600 నుండి మొదలయింది. అంతేకాదు, శూద్రుల్లో మరింత ఎక్కువ అణచివేతకు గురయ్యే ఒక సెక్షనును వర్ణవ్యవస్థకు వెలుపల ఉంచబడి, ఇంకా వివిధ అంశాలకు దూరంగా ఉంచబడి  అంటరానివారుగా/ అస్పృశ్యులుగా చేయబడ్డారు. ఇంకా వివిధ రూపాల అణచివేతలకు గురయ్యేవారు కూడ (ఉదాహరణకు చండాలురు) వీరిలో ఉన్నారు.

ఆధిపత్య కులాల వారి వద్ద సంపద శూద్రుల నుండి మిగులును స్వాధీనం చేసుకోవడం (బానిస వ్యవస్థలో సైతం  బానిస శ్రమను స్వాధీనం చేసుకోవడం) ద్వారాను, వైశ్యుల నుండి  కూడ మిగులును (పన్నుల రూపంలో) స్వాధీనం చేసుకోవడం ద్వారాను పోగుపడింది. వైశ్యులు రైతుల్లో అత్యధిక భాగంగా ఉండేవారు. (ఆ కాలంలో వైశ్యులకు వాణిజ్యం ద్వితీయ వృత్తిగా మాత్రమే ఉండేది.) దీన్ని 'శూద్ర వైశ్య సామాజిక నిర్మాణం' అని పిలవడం (మరొక ప్రత్యామ్నాయ పదం లేదు కాబట్టి) తప్పు కాదనుకుంటాను. ఈ సామాజిక నిర్మాణం దాదాపు ప్రాచీన కాలం చివరి వరకు కొనసాగింది.

ఈ ఉత్పత్తి విధానపు విజయాన్ని మనం మౌర్య సామ్రాజ్య ఆవిర్భావంలో చూడవచ్చు. ఆ సామ్రాజ్యానికి అవసరమైన వనరులను, మిగులును ఈ ఉత్పత్తి విధానమే సమకూర్చింది. విస్తృతమైన అధికార యంత్రాంగం, ఉప ఖండంలో అంతకు ముందెన్నడు లేనంత విస్తారమైన సామ్రాజ్యం, పెద్దఎత్తున శాశ్వత సైన్యం, వ్యవసాయ విస్తరణ, వాణిజ్య అభివృద్ధి మొదలైన వాటితో కూడిన శక్తివంతమైన రాజ్యం ఏర్పాటు శూద్రుల నుండి, వైశ్యుల నుండి క్రమబద్ధంగా మిగులును స్వాధీనం చేసుకోవడం ద్వారానే సాధ్యమైంది. క్రీ.పూ. 350 నాటికల్లా రూపుదిద్దుకున్న ఈ సామాజిక నిర్మాణాన్ని పటిష్టం చేయడంలోను, విస్తరించడం లోను మౌర్య రాజ్యం ప్రధానమైన పాత్ర పోషించిందని కౌటిల్యుని 'అర్థ శాస్త్రం' ద్వారా తెలుస్తుంది. దీనికోసం రాజ్యమే నేరుగా వ్యవసాయ ఉత్పత్తిలో పాల్గొనేది. రాజ్యానికి చెందిన భూముల్లో బానిస శ్రమపై ఆధారపడి, ప్రధానంగా శూద్రులతో వ్యవసాయాన్ని నిర్వహించేది.

క్రీ.పూ. 500 నుండి ఆవిర్భవించిన బౌద్ధం, జైనం, తదితర మతాలు బ్రాహణ భావజాలాన్ని సవాలు చేశాయి కాని, వర్ణ వ్యవస్థ భావజాలాన్ని కాని, దాని

ఆచరణను కాని తీవ్రంగా ఎదుర్కొనలేదు. కులప్రాతిపదికన ఉండే అసమానతలను బుద్ధుడు విమర్శించాడు. కాని తర్వాత రూపుదాల్చిన బౌద్ధ భావజాలం బ్రాహ్మణవాద ఆధిపత్యాన్ని సవాలు చేయడంపైన, జంతుబలులతో కూడిన క్రతువులను ఎదుర్కొనంపైన కేంద్రీకరించింది కాని, క్రింది కులాలవారిని వేరుచేసి, అణచివేతకు గురిచేయడంపై మాత్రం నికరమైన విమర్శకు పూనుకోలేదు.

♦ ♦ ♦

ఇటీవల వరకు భారతదేశ చరిత్రను ప్రాచీన, మధ్యయుగాల, ఆధునిక చరిత్రగా వర్గీకరించడం ఆనవాయితీగా వస్తున్నది. వలసవాద కాలపు వర్గీకరణను కొనసాగించడానికి ఇది ఉపయోగపడింది. 19వ శతాబ్దం ఆరంభం నుండి వలసవాద భారత చరిత్ర రచన బ్రిటిష్ వారి రాకకు పూర్వపు గతాన్ని మతాల ఆధారంగా హిందూ, ముస్లిం యుగాలుగా వర్గీకరించింది. ఆ విధంగా క్రీ.శ. 1206 కు పూర్వం (1206 ఢిల్లీ సుల్తానుల పాలన ఆరంభాన్ని సూచిస్తుంది.), లేదంటే క్రీ.శ. 1000 కి ముందు (క్రీ.శ. 1000 మహ్మద్ ఘజనీ దండయాత్రను సూచిస్తుంది.) చరిత్ర అంతటినీ 'హిందూ యుగం' అని పేర్కొంది. మహ్మద్ ఘజనీ దండయాత్ర క్రీ.శ. 1000 నుండి లేదా ఢిల్లీ సుల్తానుల పాలన మొదలైన క్రీ.శ. 1206 నుండి 18వ శతాబ్ది ఆరంభం వరకు భారత చరిత్రను 'ముస్లిం యుగం' అని పేర్కొంది. బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ బెంగాల్‌ను స్వాధీనం చేసుకోవడం 'బ్రిటిష్ యుగం' ఆరంభంగా పరిగణించబడింది. ఈ వర్గీకరణను ప్రచారంలోకి తెచ్చింది జేమ్స్ మిల్. భారత చరిత్రపై ఆయన రచన 19వ శతాబ్ది అంతటా అత్యంత సాధికారమైన వలసవాద పుస్తకంగా గుర్తించబడింది. ఆ విధంగా ఆ పుస్తకం పెద్ద ఎత్తున ప్రభావం చూపింది.

మిల్ ఈస్టిండియా కంపెనీలో ఒక అధికారి. ఆయన ఇంగ్లండులో 1819 నుండి సర్వీసులో ఉన్నాడు. (ఆయన ఎన్నడూ భారత దేశాన్ని సందర్శించలేదు.) ఆయన తన ప్రభావ శీలమైన 'హిస్టరీ ఆఫ్ బ్రిటిష్ ఇండియా' పుస్తకాన్ని 1817-18లో మూడు వాల్యూములుగా ప్రచురించాడు. ఆయన ఈ పుస్తకంలో బ్రిటిష్ పాలన ఎంతో మెరుగైనదని, జ్ఞానవంతమైనదని తన అభిప్రాయాలను వెల్లడించాడు. భారత్ ఒక వెనుకబడిన సమాజమని, దాన్ని పురోగమన పథంలో పెట్టవలసిన చారిత్రక బాధ్యత బ్రిటిష్ వారిదని చెప్పాడు. ఈ పుస్తకంలో ఆయన భారత సమాజ జడత్వాన్ని నొక్కి చెప్పాడు. బ్రిటిష్ పూర్వ భారత దేశానికి చరిత్ర అనేదే లేదు, గుర్తించదగిన విజయాలేవీ

లేనేలేవు. జేమ్స్ మిల్, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న యుటిలిటారియన్ భావజాల ధోరణి, భారత గతం పట్ల కొంత గౌరవం కలిగిన విలియం జోన్స్ లాంటి పండిత అధికారుల అభిప్రాయాలతో తలపడాల్సి వచ్చింది. ఈ పండిత అధికారులు బ్రిటన్ లోని ఓరియంటలిస్ట్ ధోరణికి చెందిన వారు. ఈ ధోరణి 18వ శతాబ్దం చివరిలోను, 19వ శతాబ్దం ఆరంభంలోను అభివృద్ధి చెందింది. 1784లో కలకత్తాలో స్థాపించబడిన ఆసియాటిక్ సొసైటీ ద్వారాను, 1800 లో కలకత్తాలోనే స్థాపించబడిన ఫోర్ట్ విలియమ్స్ కాలేజీ ద్వారాను ఓరియంటలిస్ట్ అధ్యయనం అభివృద్ధి చెందింది. ఈ ఓరియంటలిస్టుల భావజాలం బాగానే ప్రభావం చూపించింది. వీరు ప్రధానంగా సంస్కృతంలో ఉన్న పవిత్ర గ్రంథాల అధ్యయనంపై కేంద్రీకరించారు. ఆ గ్రంథాలను అర్థం చేసుకోవడానికి స్థానిక పండితుల సహాయాన్ని వారు స్వీకరించారు. వారి వ్యాఖ్యానాలపైనే ఎక్కువగా ఆధారపడ్డారు. దీంతో హిందూ యుగంలో భారత దేశం పూర్తిగా అనాగరికమైనదేమీ కాదన్న భావన ఇష్టం లేకపోయినప్పటికీ ఏర్పడింది. అయినప్పటికీ అది ప్రతిష్టంభనలో ఉంది, ముందుకు సాగే శక్తి దానికి లేదు. హిందూ యుగంలో ఏమైనా చిన్న చిన్న విజయాలు సాధించబడినా వాటిని ముస్లిం దండయాత్రలు తుడిచి పెట్టాయి. ఆ విధంగా ప్రాచీన భారతం 'హిందూ నాగరికత' గా చెప్పబడింది. 'మధ్య యుగాల భారత దేశం' ముస్లింల దండయాత్రలు, భారత దేశాన్ని ముస్లిములు ఆక్రమించడం గా చెప్పబడింది. ముస్లింల పాలనను అంధకార యుగంగా పిలిచారు. ఈ విభజనలో బ్రిటిష్ పాలన గురించి ఎలాంటి విమర్శ లేదు. ప్రముఖంగా పేర్కొనబడిన సంఘర్షణలు కొద్దిగా ఏమైనా ఉన్నాయంటే అవి ముస్లిం దండయాత్రికులకు, లేదా ముస్లిం పాలకులకు, హిందువులకు మధ్య (మొఘల్ కాలంలో ముస్లిములకు సిక్కులకు మధ్య కూడ) జరిగినవే. ఈ చరిత్ర రచనలో వలసవాద వ్యతిరేక ప్రతిఘటనకు ఎలాంటి స్థానం లేదు. మతతత్వ చరిత్ర రచనలో కూడ ఈ అభిప్రాయాలే ప్రధానంగా కొనసాగుతున్నాయి.

ఇలాంటి యుగవిభజనలో మరొక ప్రధాన సమస్య ఏమంటే, మొత్తం ఉపఖండం అంతటికీ ఒకే మాదిరి యుగవిభజన, కాలక్రమణిక ఉంటుందని వూహించడం. ఆ విభజన: హిందూ ఇండియా లేదా ప్రాచీన భారతం (చరిత్ర పూర్వ దశ క్రీ.శ. 1000/1206 వరకు), ముస్లిం ఇండియా లేదా మధ్య యుగాల భారతం (క్రీ.శ. 1000/1206 నుండి 1707 అంటే ఔరంగజేబు మరణం వరకు), బ్రిటిష్ ఇండియా లేదా ఆధునిక భారత దేశం (1707–1947). మరింత తాజాగా ప్రామాణిక

పాఠ్యగ్రంథాలలో యుగ విభజన ఎలా ఉందంటే, ప్రాచీన యుగం (చరిత్ర పూర్వ యుగం నుండి క్రీ.శ. 750 వరకు), మధ్య యుగాల భారత దేశం (క్రీ.శ. 750 నుండి 1750 వరకు), ఆధునిక భారత దేశం (క్రీ.శ. 1750 నుండి 1947 వరకు). క్రీ.శ. 750 ప్రాధాన్యత ఏమంటే, అది ప్రాంతీయ రాజ్యాల ఆవిర్భావాన్ని, ప్రత్యేకించి ద్వీపకల్ప భారతంలో సూచిస్తుంది. అయినప్పటికీ అది సింధ్‌ను అరబ్బులు ఆక్రమించడాన్ని (క్రీ.శ. 712), వాయివ్య భారతంలో ముస్లిముల ఉనికి ఆరంభాన్ని సూచిస్తుంది. అంతకు ముందరి గతం నుండి విడగొట్టుకోవడంగా దీన్ని భావిస్తారు.

సవరించబడిన, మరింత ఆమోదయోగ్యమైన యుగ విభజన ఇలా ఉంటుంది: ప్రాచీన యుగం (చరిత్ర పూర్వ యుగం నుండి క్రీశ 600 వరకు), తొలి మధ్యయుగాల భారతం (క్రీ.శ. 600 నుండి 1200 వరకు), మధ్య యుగాల భారతం (క్రీ.శ. 1200 నుండి 1750 వరకు), ఆధునిక భారత దేశం (క్రీ.శ. 1750 నుండి 1947 వరకు). క్రీ.శ. 600 తర్వాత రాష్ట్రకూట, చాళుక్య, పాల, పల్లవ, పాండ్య, చేర, చోళ లాంటి అనేక ప్రాంతీయ రాజ్యాలు ఆవిర్భవించాయి. స్థానిక, ప్రాంతీయ పరిణామాల ఫలితంగా ఈ రాజ్యాలు ఆవిర్భవించాయి. అందుచేతనే ఈ రాజ్యాలు రాజకీయ నిర్మాణంలోను, సంస్కృతి, భాషల్లోను, మత ఆచరణల్లోను, భావాలలోను, కళలు, నిర్మాణ శైలుల్లోను ప్రాంతీయ లక్షణాలను ఇముడ్చుకున్నాయి. కొంత మంది మార్క్సిస్టు పండితులు క్రీ.శ. 600 తర్వాత కాలంలో ఫ్యూడలిజం అంశాలు ఉన్నాయని గమనించారు. తరచుగా మధ్య యుగాల భారతాన్ని రెండు ఉప యుగాలుగా విభజిస్తారు. ఒకటి, ఢిల్లీ సుల్తానుల కాలం (క్రీ.శ. 1200 నుండి 1529 వరకు), రెండు, మొగలుల కాలం (క్రీ.శ. 1520 నుండి 1750 వరకు).

సంప్రదాయంగా వస్తున్న అత్యధిక యుగ విభజనలు రాజ్యాల మార్పిడి ఆధారంగాను, ప్రధానంగా ఉత్తర భారత మైదాన ప్రాంతాలలోని పరిణామాలపైన ఆధారపడి జరిగాయి. గంగా యమున డెల్టా ప్రాంతం భారత ఉపఖండంలో కీలకమైన ప్రాంతం అన్న భావన ఇలాంటి యుగవిభజన వెనుక ఉంది. అందుచేతనే ఈ ప్రాంతానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. కాని దక్షిణ భారతం పెద్ద ప్రాంతాలలో సామాజిక నిర్మాణాలు ఆయా ప్రాంతాలలోని ప్రత్యేక చారిత్రక పరిస్థితుల ఆధారంగా ఏర్పడ్డాయి. అలాగే ఈశాన్య ప్రాంతంలో సామాజిక నిర్మాణాలు కూడ అక్కడి ప్రత్యేక చారిత్రక పరిణామాల ఆధారంగా ఏర్పడ్డాయి. ఉదాహరణకు, హరప్పా నాగరికతపై చర్చలు ఈ ప్రాంతాలకు వర్తించవు. అంతేకాకుండా అడవుల్లో నివసించే వారిని ఈ

యుగ విభజనలన్నీ విస్మరిస్తాయి. ప్రత్యేకించి వలసవాద పూర్వ కాలానికి సంబంధించి ఇది ఒక ప్రధాన లోపం. ఎందువల్లనంటే విస్తారమైన ప్రాంతాలలో, ప్రత్యేకించి మధ్య భారతంలో ఇలా అడవుల్లో నివసించే వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. దురదృష్టవశాత్తు ఈ జాతులకు సంబంధించి ప్రచురించిన సమాచారం పెద్దగా అందుబాటులో లేదు. అందుచేత ఈ ఖాళీని ఇప్పటికిప్పుడు భర్తీ చేయడం అంతతేలిక కాదు. ఏదేమయినప్పటికీ, భారత దేశ చరిత్రకు సంబంధించిన చర్చ ఏదైనా ఈ సమస్యలను పరిగణనలోకి తీసుకోవాలి.

♦ ♦ ♦

గుప్తుల యుగం (గుప్తులు క్రీ.శ. 300 నుండి 550 మధ్యలో పాలించారు.) ముగిసే నాటికి గుర్తించదగిన ఆర్థిక, రాజకీయ మార్పులు చోటుచేసుకున్నాయి. గుప్త సామ్రాజ్యంలో ప్రధానమైన ప్రాంతం పశ్చిమ గంగా మైదానం. అయినప్పటికీ దాని రాజకీయ అదుపు ఉపఖండంలో చాల ప్రాంతాలకు విస్తరించింది. క్రీ.శ. 600 తర్వాత రాష్ట్రకూట, చాళుక్య, పాల, పల్లవ, పాండ్య, చేర, చోళ లాంటి పలు ప్రాంతీయ రాజ్యాలు ఆవిర్భవించాయి.

గుప్తుల పాలన అనంతరం రెండు ప్రధాన పరిణామాలు జరిగాయి. (ఇక మీదట పేర్కొనే తేదీలన్నీ వేరేవిధంగా పేర్కొంటే తప్ప క్రీస్తు శకానికి చెందినవే.) అవి 1, పట్టణ కేంద్రాలు క్షీణించడం, 2, డబ్బు తగ్గిపోవడం. ఇటీవల కాలంలో చాల రచనలు పట్టణ ప్రాంతాల క్షీణతపై చూపిన సాక్ష్యాలను వ్యతిరేకించి, ఆనాడు పట్టణ కేంద్రాలు క్షీణించలేదని వాదిస్తాయి. సంబంధిత ఒక పరిణామం రాజ్యం భూగ్రాంటులను (ఇనాములు) మంజూరు చేయడం పెరగడం. ఇలా ఇనాములు ఇవ్వడం గుప్తుల పాలన మలిదశలో మొదలయింది. గుప్తుల పాలన అనంతరం బాగా విస్తరించింది.

ఈ భూగ్రాంటులు ఒక వైపున రాజుకు వివిధ సేవలు అందించేందుకు ఇవ్వబడ్డాయి, మరొక వైపున ఇవి భూ సంబంధాలలో ఒక ఉన్నత వర్గాన్ని సృష్టించాయి. ఉత్పత్తి దారుల నుండి కౌలు రూపంలో కాని, శ్రమ రూపంలో కాని మిగులును ఈ వర్గం పోగుచేసేది. ఈ భూస్వామ్య వర్గానికి ఆర్థిక, న్యాయ, సైనిక అధికారాలు కూడ కట్టబెట్టబడ్డాయి. గుప్తుల పాలన అనంతరం ఏర్పడిన ఈ సామాజిక నిర్మాణాన్ని

(తొలి మధ్యయుగాల భారతం) ఆరెస్ శర్మ 'ఫ్యూడల్' అని పిలిచాడు. ఇది కొశాంబి ప్రతిపాదించిన 'పైనుండి ఫ్యూడలిజం' అన్న భావనకు దగ్గరగా ఉంది. రాజ్యం మంజూరు చేసిన భూ గ్రాంట్లు ఫ్యూడలీకరణకు దారితీశాయి. అయితే ఈ పరిణామం, క్రింది నుండి ఫ్యూడలిజం ఏర్పడటాన్ని పూర్తిగా కొట్టివేయలేదు. క్రింది నుండి ఫ్యూడలిజం ఏర్పడటం అంటే, ఫ్యూడల్ ప్రభువులను రాజ్యం పైనుండి సృష్టించడం కాకుండా, గ్రామీణ ప్రాంతాలలో అసమానతలు పెరిగి ఫ్యూడల్ ప్రభువులు ఆవిర్భవించడం.

బ్రాహ్మణ పూజారులకు పెద్ద సంఖ్యలో భూగ్రాంటులు లభించాయి. భావజాల ప్రయోజనం కోసమూ, వ్యవసాయాన్ని విస్తరించేందుకూ ఈ గ్రాంటులు మంజూరు చేయబడ్డాయి. మధ్య యుగాల నాటి ఐరోపాలో 'ఫియఫ్' లకు ఈ భూగ్రాంటులు బాగా దగ్గరగా ఉంటాయి. అయితే అర్ధ బానిస రైతు (సెర్ఫ్) వ్యవస్థ పెద్దగా విస్తరించిన దాఖలాలు లేవు. గుప్తుల పాలన ముగిసే నాటికి శూద్రులు తమ స్వేచ్ఛారహిత సేవక హోదాను కోల్పోయినట్లు (చాల సందర్భాలలో వారి ప్రతిఘటన వల్ల) చెప్పబడింది. ఈ శూద్రులు, వైశ్యులతో కూడ కలిపి గ్రామీణ ప్రాంతాలలో పెద్ద పాలిత రైతు వర్గంగా తయారయ్యారు. మిగులును ఉన్నత భూస్వామ్య వర్గం గుంజుకునేది. వారికి మత క్రతువుల పరంగా కూడ ఉన్నత హోదా ఉంది. ఈ కాలానికల్లా సజాతి వివాహాలు మాత్రమే చేసుకునే జాతి (స్థూలంగా అనువాదం చేస్తే ఉపకులం) కుల ఆధారిత బ్రాహ్మణవాద సామాజిక వ్యవస్థలో కీలకమైన యూనిట్‌గా మారింది. గుప్తుల అనంతర కాలంలో జాతులు అధికం కావడం జరిగింది. వర్ణం అనేది తన ఆచరణాత్మక ప్రాధాన్యతను కోల్పోయింది. వర్ణం అనేది కేవలం ఒక సైద్ధాంతిక చట్రంగా తయారయింది. అఖిలభారత స్థాయిలో కుల వ్యవస్థకు ఒక సైద్ధాంతిక సమన్వయాన్ని వర్ణం అందించిందని భావించబడింది. నిత్య జీవితంలో మాత్రం సజాతి వివాహాలు మాత్రమే చేసుకునే జాతి మాత్రమే వారి ఆర్థిక, సామాజిక హోదాను నిర్ణయించేది.

గుప్తుల కాలంలో రూపుదిద్దుకున్న 'ఫ్యూడల్' సామాజిక నిర్మాణం (లేదా ఫ్యూడల్ ధోరణులు కలిగిన సామాజిక నిర్మాణం) దాదాపు ఆరు దశాబ్దాల పాటు (600–1200) వరకు కొనసాగింది. ఆ కాలంలో అది ఉత్తర భారతం నుండి ఉపఖండం ఇతర ప్రాంతాలకు కూడ వ్యాపించింది. దక్షిణ భారత దేశంలో బ్రాహ్మణులకు ఇచ్చిన భూగ్రాంట్లు 'బ్రాహ్మదేయ' ఆ ప్రాంతంలో ప్రత్యేకించి చోళుల కాలంలో (పది నుండి పదమూడవ శతాబ్దం వరకు) ఫ్యూడలిజం అభివృద్ధి చెందటంలో

కీలక పాత్ర వహించాయి. 13వ శతాబ్దం ఆరంభం తర్వాత ఉత్తర భారతంలో టర్కిష్ రాజకీయ ఆధిపత్యం నెలకొంది. ఆ కాలంలో రాజ్యం ఇక్తాల పేరుతో భూములను కేటాయించడం జరిగింది. అలా కేటాయించబడిన వారు ఆ ప్రాంతంలో ఉత్పత్తి నుండి రాజుకు చెందాల్సిన వాటాను వసూలు చేసే అధికారాన్ని కలిగి ఉండేవారు. ఇలా భూమి కేటాయించబడిన వారు కొన్ని బాధ్యతలను నెరవేర్చాల్సి ఉండేది. ఎక్కువగా ఆ బాధ్యతలు సైనిక స్వభావం కలిగి ఉండేవి. ఇక్తాలు వారసత్వంగా కొనసాగుతున్నప్పటికీ మహ్మద్ బిన్ తుగ్లక్ (1325-1351) కుమారుడు ఫిరోజ్ షా తుగ్లక్ (1351-88) హయాంలో వాటిని వేరేవారికి బదలాయించే అవకాశం కూడ కల్పించబడింది. దీంతో ఫ్యూడలీకరణ వైపుకు ధోరణులు బలపడ్డాయి.

ఢిల్లీ సుల్తానుల కాలంలో క్రింది జాతుల వారి హోదాలో ఎలాంటి మార్పు వచ్చినట్లు కనిపించదు. అయితే ఈ కాలంలో ముస్లిం సమాజం కూడ జాతుల వ్యవస్థకుండే చాల లక్షణాలను స్వీకరించింది. అంతే కాదు ఈ కాలంలో విస్తారమైన చేతివృత్తుల నూతన సాంకేతిక పరిజ్ఞానం కూడ వ్యాపించింది. కొశాంబి చెప్పినట్లు 'ఇస్లామిక్ దండయాత్రికులు ఒకరి పరిజ్ఞానాన్ని మరొకరికి అందించని పరిస్థితిని బద్దలుకొట్టి నూతన సాంకేతిక పరిజ్ఞానం వ్యాప్తి చెందేలా చేశారు.' అనేక నూతన సాంకేతిక పరికరాలు ఆచరణలోకి వచ్చాయి. వాటిలో ఒకటి పర్షియా చక్రానికి (13-14 వతాబ్దాలు) తుదిరూపం ఇచ్చే లంబకోణ గేర్ అమరిక. నూతన చేతివృత్తులు నూతన వృత్తి సముదాయాలను ఏర్పరిచాయి. అవి కాలక్రమంలో జాతులుగా మారాయి.

అంతేకాదు, టర్కిష్ పాలక వర్గాలు ప్రధానంగా పట్టణ ప్రాంత కేంద్రాలుగానే ఉండేవి, వారికి వ్యవసాయ ఉత్పత్తిలో నేరుగా ఎలాంటి జోక్యం ఉండేది కాదు. ఇది పట్టణీకరణ నూతన దశకు దారితీసింది. దక్షిణ భారత దేశంలో ఒక ముఖ్యమైన పరిణామం విజయ నగర సామ్రాజ్యంలో (14వ శతాబ్దం నుండి తొలి 17వ శతాబ్దం వరకు) ఫ్యూడల్ రాజకీయ వ్యవస్థ ఆవిర్భవించడం. ఇదే కాలంలో ఆర్థిక వ్యవస్థలో డబ్బు చలామణి అధికం కావడం, పట్టణీకరణ, వాణిజ్యం పెరగడాన్ని కూడ మనం చూస్తాము. ఇవి పూర్తి స్థాయి ఫ్యూడలీకరణను నిరోధించి ఉండవచ్చు.

మొగలుల రాకతో 16వ శతాబ్ది అంతానికి అక్బర్ హయాంలో (1556-1605) ఒక నూతన అత్యంత కేంద్రీకృత రాజ్యవ్యవస్థ ఏర్పడింది. (ఆధునిక పూర్వ రాజ్య వ్యవస్థగా ఆ కేంద్రీకరణ ఆనాటి భౌతిక పరిస్థితుల పరిమితులకు

లోబడి ఉంటుంది.) ఆ రాజ్య వ్యవస్థ ప్రత్యేకించి ప్రధాన రంగాలలో మిగులు స్వాధీనాన్ని సుసంఘటితమైన, సమర్ధవంతమైన రెవిన్యూ వసూలు యంత్రాంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా క్రమబద్ధం చేసింది. మొగల్ సామాజిక నిర్మాణం మార్క్స్ చెప్పిన ఆసియాతరహా ఉత్పత్తి విధానానికి దగ్గరగా ఉందని ఇర్ఫాన్ హబీబ్ అభిప్రాయపడ్డారు. ఎందువల్లనంటే, మిగులులో అధిక భాగాన్ని రాజ్యము, రాచరిక వర్గమే స్వాధీనం చేసుకునేది. ఇది పన్ను కౌలు రూపంలో ఉండేది. (దాదాపు మొత్తం మిగులు శ్రమను, దానిలో కొంత భాగం కాకుండా పన్ను రూపంలో రాజ్యమే వసూలు చేసేది.) మొగల్ సామ్రాజ్యం ఉచ్ఛదశలో ఉన్నపుడు మిగులులో నామమాత్రంగా మాత్రమే జమీందారులకు (భూమిపై ఉన్నత హక్కులు కలిగిన సంప్రదాయ వర్గం) మిగిల్చేది. రైతుకు మిగిల్చేది కూడ అతని జీవనానికి కనీసంగా సరిపోయేంత మాత్రమే ఉండేట్లు జాగ్రత్త పడేది. ఇలా మిగులంతా తానే స్వాధీనం చేసుకోవడంతో మొగల్ సామ్రాజ్యం భారీ సైన్యాన్ని నిర్వహించకలిగింది. తద్వారా తన అధికారాన్ని బలంగా చలాయించడం, సామ్రాజ్య విస్తరణ కూడ సాధ్యమయింది.

చక్రవర్తి, అలాగే రాచరిక వర్గం కూడ వ్యవసాయ మిగులు స్వాధీనం కోసం జమీందార్లతో (భూమిపై విశేష హక్కులు కలిగిన సంప్రదాయవర్గం) పోటీపడేవారు. రాచరిక వర్గంలో ఉన్నత మన్సబ్ దారులు (వారు ర్యాంకు కలిగి నిచ్చెనమెట్ల రాచరిక వ్యవస్థలో మన్సబ్ హెూదా ఉన్నవారు) ఉండేవారు. వారికి సాధారణంగా నగదు రూపంలో వేతనాలు చెల్లించడానికి బదులు భూమి శిస్తును కేటాయించేవారు. ఈ కేటాయింపులను సాధారణంగా జాగీర్లు అని పిలిచేవారు. (అందుచేత జాగీరు కేటాయించబడినవారు జాగీర్దార్లుగా పిలవబడేవారు.) జాగీర్దార్లు వారికి కేటాయించబడిన జాగీరులో ఉత్పత్తిలో రాజ్యానికి రావలసిన వాటాను పొందేవారు. ఢిల్లీ సుల్తానుల కాలంనాటి ఇక్తాకు జాగీరుకు కొన్ని పోలికలు ఉన్నాయి. జాగీర్దారు, లేదా మన్సబ్‌దారు నెరవేర్చాల్సిన సైనిక బాధ్యతల్లోను పోలిక ఉంది.

మిగులులో అత్యధిక భాగాన్ని భూమి శిస్తు రూపంలో మొగల్ రాజ్యవ్యవస్థ ఆ మిగులును గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు తరలించింది. రాజ్యానికి చెల్లించాల్సిన పన్నును విపులంగా నమోదు చేయడం ద్వారా మొగలులు కొంత మేరకు జమీందారులు, ఇతర మధ్యవర్తులు ఇష్టం వచ్చినట్లు పన్నులు వసూలు చేయకుండాచూసే వారు, వారి ప్రాబల్యానికి అడ్డుకట్ట కూడ వేసేవారు. జమీందారులకు, రాజ్యానికి ఉన్న ఈ వైరుధ్యాన్ని ఉపయోగించుకొని రైతులు వీలును

బట్టి ఏదో ఒక పక్షం వైపుకు చేరి తమ పరిస్థితిని మెరుగుపరుచుకునేందుకు ప్రయత్నించేవారు. 17వ శతాబ్ది మలి అర్థ భాగంలో రైతులు తీవ్రమైన దోపిడీకి గురవుతున్న పరిస్థితి ఉండేది. పైగా ఆ కాలంలో శాస్త్ర, సాంకేతిక రంగాలలో కూడ పెద్దగా అభివృద్ధి జరగలేదు. 18వ శతాబ్ది ఆరంభం నాటికి మొగల్ సామ్రాజ్యం క్షీణించడం వెనుక ఉన్న కారణం ఇదే. వలస వాద, మతతత్వ చరిత్ర రచన కాని, ప్రామాణిక పాఠ్య గ్రంథాలు కాని, మొగల్ సామ్రాజ్య పతనానికి ఔరంగజేబు (1658 నుండి 1707 వరకు పాలించాడు.) అనుసరించిన 'మత విధానాలు', 'మత చాందసత్వం' పూర్తిగా కారణాలు అని చెబుతాయి.

మధ్య యుగాల సామాజిక నిర్మాణాల సంక్షోభానికి, లేదా మొగల్ సామాజిక నిర్మాణపు సంక్షోభానికి వ్యక్తీకరణ అయిన వ్యవసాయ సంక్షోభం విస్తృతమైన రైతాంగ తిరుగుబాట్లకు దారితీసింది. 17వ శతాబ్ది చివరి భాగం నుండి ఈ సంక్షోభ వ్యక్తీకరణ జాట్లు, సిక్కులు, మరాఠాల తిరుగుబాట్లలో అతి ప్రముఖంగా కనిపించింది. పైన పేర్కొన్న చర్చ అంతా ఇర్ఫాన్ హబీబ్ అధ్యయనం పైనే ఆధారపడింది. అలాంటి ఇర్ఫాన్ హబీబ్ మొగల్ సామ్రాజ్య కాలపు సామాజిక నిర్మాణాన్ని 'ఫ్యూడల్' అనేందుకు అంగీకరించలేదు. ఆ సామాజిక నిర్మాణం మార్క్స్ పేర్కొన్న 'ఆసియా తరహా ఉత్పత్తి విధానం'కు చాల వరకు దగ్గరగా ఉన్నదని చెప్పాడు.

**మొగల్ సామ్రాజ్య క్షీణత-వలసవాద ఎదుగుదల:** మొగల్ సామ్రాజ్యం క్షీణించడం, ఐరోపా వలసవాద ఎదుగుదల ఒకే సమయంలో జరిగాయి. ఇక్కడ ఒక ప్రశ్న ఎదురవుతుంది. ఈ సామాజిక నిర్మాణాన్ని దానంతట దానికి వదిలేస్తే (అంటే వలసవాదం జోక్యం చేసుకోకపోతే) ఎలా పరివర్తన చెందేది, పెట్టుబడిదారీ విధానానికి పరివర్తన చెందడానికి అవకాశాలు ఉన్నాయా అన్నది ఆ ప్రశ్న. వలసవాద పూర్వ చివరి దశలో సరుకుల ఉత్పత్తి పెద్ద ఎత్తున జరుగుతూ ఉండేదన్న అంశాన్ని ఇక్కడ మనం గుర్తించవచ్చు. అంతేకాదు, మొగల్ ఆర్థిక వ్యవస్థ అత్యంత ద్రవ్యీకరణ చెందిన వ్యవస్థ. భూమి శిస్తులో అధిక భాగం నగదు రూపంలోనే వసూలు చేయబడేది. (వస్తు రూపంలో వసూలు చేసిన సందర్భాలలో కూడ ఆ ఉత్పత్తి నగదులోకి మార్చుకోబడేది.) అందుచేత వలసవాద పూర్వ చివరి దశలో భారత దేశపు సామాజిక నిర్మాణంలో పెట్టుబడిదారీ పరివర్తనకు తప్పనిసరి అని మపం తరచు చెప్పుకునే అంశాలు ఉన్నాయి. మరి అలాంటప్పుడు పెట్టుబడిదారీ పరివర్తనను అడ్డుకున్నదేమిటి? చారిత్రక అభివృద్ధి కీలకమైన దశలో స్వాధీనం చేసుకోబడిన మిగులులో అధికభాగాన్ని

వలసవాద కప్పం రూపంలో తరలించుకుపోవడం కనిపించే ఒక సమాధానం. కాని ఇర్ఫాన్ హబీబ్ 1971లో ప్రచురించిన తన ప్రామాణిక వ్యాసం, 'పొటెన్షియాలిటీస్ ఆఫ్ క్యాపిటలిస్ట్ డెవలప్‌మెంట్' ఇన్ మొగల్ ఇండియాలో మరింత సంక్లిష్టమైన సమాధానాన్ని చెప్పారు.

హబీబ్ విశ్లేషణ ప్రకారం సరుకుల ఉత్పత్తి, ద్రవ్యీకరణ ప్రధానంగా మొగల్ రాచరిక వర్గానికి, వారిపై ఆధారపడిన వారికే పరిమితమయింది. వ్యాపారులు, బ్యాంకర్లు ఈ వర్గాలపైనే ఆధారపడ్డారు. సరుకుల ఉత్పత్తి, ద్రవ్యీకరణ అంశాలు పరివర్తనకు ప్రేరకాలుగా పనిచేయకుండా ఈ పరిస్థితి తీవ్రమైన పరిమితులను విధించింది. తమ కార్యకలాపాలకు స్వతంత్ర ప్రాతిపదిక లేని వ్యాపారులను మొగల్ సామ్రాజ్య క్షీణత శక్తిహీనులను చేసింది. ఆ తర్వాత ఒక వ్యాసంలో హబీబ్ ఇలా చెప్పారు, "పట్టణ ప్రాంతాలలో తయారయిన చేతివృత్తుల ఉత్పత్తుల మార్కెట్‌కు సంబంధించి భారత దేశానికి, ఫ్యూడల్ అనంతర ఐరోపాకు మధ్య ప్రధాన వ్యత్యాసం ఉంది. భారత దేశంలో ఈ మార్కెట్ రాచరిక వర్గానికి, వారిపై ఆధారపడిన వారికే పరిమితమయింది. కాని ఐరోపాలో ఈ మార్కెట్ గ్రామీణ పెత్తందార్లు, ఎదిగివస్తున మధ్యతరగతివారితో కూడ కలిసి ఉండేది." మరొక రరంగా చెప్పాలంటే, వలసవాద పూర్వ భారత దేశంలో పెట్టుబడిదారీ పరివర్తనను ఐరోపాలో మాదిరి ముందుకు తీసుకెళ్ళకుండా నిరోధించే అంశాలు అంతర్గతంగానే ఉన్నాయి. ఇటీవల తాజాగా ఇదే అంశంపై ఒక ప్రముఖమైన రచన వెలువడింది. కెన్నెత్ పోమెరాంజ్, 'ది గ్రేట్ డైవర్జన్స్: చైనా, యూరప్ అండ్ మేకింగ్ ఆఫ్ ది మోడర్న్ వర్ల్డ్ ఎకానమీ' పుస్తకాన్ని 2000లో వెలువరించారు. దానిలో ఆయన అరుదైన ఐరోపా అన్న వాదనను ఒప్పుకునే రీతిలో వ్యతిరేకించారు. కనీసం 18వ శతాబ్దం ఆరంభం నాటికి అభివృద్ధి చెందిన ఆసియా ప్రాంతాలకు, ఐరోపాకు గుర్తించదగిన వ్యత్యాసాలు లేవని చెప్పారు. ఆయన చైనా మీద, ప్రత్యేకించి యాంగ్జీ నదీ డెల్టా ప్రాంతంపైన ప్రధానంగా కేంద్రీకరించారు. వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో శ్రమ ఉత్పాదకత, తలసరి ఆదాయం, పట్టణీకరణ ఇంగ్లండ్‌లో ఏ స్థాయిలో ఉందో ఇక్కడా అదే స్థాయిలో ఉంది. అమెరికాలో వలసలను సంపాదించడం ద్వారా ఇంగ్లండు భూమి కొరతను, ఆహార కొరతను అధిగమించింది. పెద్ద ఎత్తున బొగ్గు సరఫరా కావడంతో కట్టెల స్థానంలో బొగ్గును ప్రవేశపెట్టడం తేలికయింది. బొగ్గు పారిశ్రామికీకరణకు కీలకమైనది. ఆ తర్వాత మేధావులు భారత దేశానికి, అభివృద్ధి చెందిన ఐరోపా ప్రాంతాలకు మధ్య సమానతల గురించి

నొక్కిచెప్పారు. మరొక రకంగా చెప్పాలంటే పశ్చిమ ఐరోపా ప్రత్యేకమైనదేమీ కాదు.

కొన్ని 'మితవాద' రచనలు మరొక విధంగా సూచించాయి. మొగల్ సామ్రాజ్య క్షీణత ప్రాంతీయ రాజకీయ వ్యవస్థల ఆవిర్భావానికి అవకాశాలు కల్పించింది. ఈ అవగాహన ప్రకారం 18వ శతాబ్దం ఆరంభం నుండి మొగలుల అధికారం బలహీనపడసాగడంతో (దక్కను, బెంగాల్ గవర్నర్ల లాంటి ప్రాంతీయ ప్రతినిధులు తమ స్వతంత్రతను ప్రకటించుకోవడం తోను, 1739లో ఉప్పెనలా వచ్చిపడిన ఇరాన్ పాలకుడు నాదిర్ షా దండయాత్ర తోను, 1740ల చివరి నుండి అఫ్ఘన్ పాలకుడు అహ్మద్ షా అబ్దాలి వరుస సైనిక చర్యల తోను మొగలుల అధికారం బలహీనపడే ఈ క్రమం వూపునందుకున్నది.) సామ్రాజ్య ఖజానాకు చేరే మిగులు బాగా తగ్గిపోయింది. ప్రాంతీయ సంపన్న వర్గాలు సంపద పోగుచేసుకోవడానికి ఇది వీలు కల్పించింది. ఇదే సమయంలో ఐరోపా కంపెనీల వాణిజ్య కార్యకలాపాలు రాష్ట్రాలు, సుబాలు, ఇంకా ప్రాంతీయ స్థాయిల్లో ఆర్థిక కార్యకలాపాలకు వూపునందించాయి. ఆ విధంగా మొగల్ సామ్రాజ్య పతనం ప్రాంతీయ సంపన్నతకు దారులు తెరిచింది. ఐరోపా కంపెనీల రాక సానుకూల పరిణామంగా పరిగణించబడింది. ఇది కనీసం 18వ శతాబ్దం చివరి వరకు ప్రాంతీయ సంపన్నతకు దోహదపడింది. మతతత్వ చరిత్ర రచనల్లో మొగల్ సామ్రాజ్య పతనం గురించి చెప్పే దానికి ఈ అవగాహన భిన్నమైనది. మొగలు సామ్రాజ్య క్షీణత సమయంలో మొగలు పాలనకు(ఇస్లాం పాలనగా కూడ చెప్పబడింది) వ్యతిరేకంగా జాట్లు, మరాఠాలు, రాజపుత్రులు, సిక్కులు 'జాతీయ' తిరుగుబాట్లు చేశారు. వీరంతా కూడ అంతర్గతంగా ఇస్లాంను వ్యతిరేకించే ఏకీకృత మత సముదాయాలని మతతత్వ చరిత్ర రచన సిద్ధాంతీకరిస్తుంది.

18వ శతాబ్దంపై 'మితవాద' అవగాహన అయిన మొగల్ సామ్రాజ్య పతనంతో ప్రాంతీయ అధికార కేంద్రాలు అవిర్భవించడం, ఐరోపా వాణిజ్య కార్యకలాపాలు ఆర్థిక సంపన్నతకు దోహదపడ్డాయని అంగీకరించినప్పటికీ, మనం వలసవాదం యొక్క చారిత్రక ప్రభావాన్ని అంచనా వేయాల్సి ఉంటుంది. మొగల్ సామ్రాజ్య పతనం దీర్ఘకాల ప్రభావాన్ని తగ్గించి చూడటం, అంతకన్నా గట్టిగా ఈ కాలంలో వలసవాద జోక్యం యొక్క ప్రాధాన్యతను తగ్గించి చూడటం 'మితవాద' మేథావుల ధోరణిగా ఉంది. చాల మంది ఈ 'రివిజనిస్టు' ప్రముఖ మేథావులు మొగలు కాలానికి సంబంధించిన మార్క్సిస్టు అవగాహనతో జరిగిన కృషిని గుర్తించరు. ఇర్ఫాన్ హబీబ్ నాయకత్వంలో జరిపిన చరిత్ర పరిశోధనలు 'ఆలిగడ్ స్కూల్' గా పేరుగాంచాయి.

18వ శతాబ్దపు ప్రత్యేకత ఏమంటే, మొగలులు అధికారాన్ని కోల్పోవడం, ఐరోపా వలసవాదం ఎదిగిరావడం. మొగలుల పాలన క్షీణించి, ప్రాంతీయ, స్థానిక సంపన్నులు పైకి రావడం పట్ల ఎంతైనా సంబరపడవచ్చు. కాని ఆ ప్రాంతీయ అధికారాల సమర్థతపై పైన పేర్కొన్న రెండు పరిణామాలు ప్రతికూల ప్రభావం చూపాయి. మరింత ముఖ్యమైన అంశమేమంటే, స్థానిక, రాష్ట్ర, ప్రాంతీయ సంపన్న వర్గాలకు దీర్ఘకాలంలో ఈస్టిండియా కంపెనీ సైనిక బలాన్ని ఎదుర్కొనే వనరులు మాత్రం లేవు. ఇదే 18వ శతాబ్దం రెండవ అర్ధ భాగంలో వలసవాదం పైకి ఎదిగిరావడానికి వీలు కల్పించింది.

♦ ♦ ♦

బ్రిటిష్ పాలన స్థాపించబడటం వెనుక చాల చరిత్ర ఉంది. భారత ఉపఖండంలో వలసవాద జోక్యం 16వ శతాబ్ది ఆరంభంలోనే మొదలయింది. వాస్కొ డి గామా పోర్చుగల్ నుండి భారత్‌కు (1487-98) సముద్ర మార్గంలో రావడం చారిత్రక క్రమాన్ని ముందుకు నెట్టింది. ఆయన రాక ఆసియాలోను, ఆఫ్రికాలోను అనేక ప్రాంతాలను లొంగదీసుకుంది. క్రిస్టఫర్ కొలంబస్ కరీబియన్ దీవులను చేరుకొన్న (1492) తర్వాత అమెరికా ఖండాన్నంతటిని వశపరుచుకున్న రీతిలో ఇది కూడ జరిగింది. 1500 నుండి ప్రధానంగా స్పెయిన్, పోర్చుగల్, నెదర్లాండ్స్ (హాలండ్), ఇంగ్లండు, ఫ్రాన్స్‌లు ఐరోపాయేతర దేశాలను వలసలుగా మార్చుకోవడంలో ముందున్నాయి. 16వ శతాబ్దం నుండి 18వ శతాబ్దం ఆరంభం వరకు ఈ రెండు శతాబ్దాలలో ఈ ప్రాంతంలోని రాజకీయ వ్యవస్థల బలము, స్వతంత్రము అణచివేయబడినాయి.

డచ్ ఈస్టిండియా కంపెనీ లాంటి ఐరోపా వ్యాపార కంపెనీలు (వీటికన్నా ముందు ప్రవేశించిన పోర్చుగల్ మాదిరిగా) ఆసియాలోని వివిధ ప్రాంతాలలో తమ ఆధిక్యతను నెలకొల్పుకోవడానికి విపరీతంగా హింసకు పాల్పడ్డాయి. వారు తమకు కావలసిన సరఫరాలను తక్కువ ధరలకు (అసలు చెల్లించకుండాను) పొందేందుకు తమ వద్ద ఉన్న మెరుగైన సాయుధ బలాన్ని వినియోగించారు. ఆసియా జలాల్లో సంప్రదాయంగా జరుగుతూ వస్తున్న వాణిజ్య మార్గాలను ధ్వంసం చేయడానికి కూడ సాయుధ బలాన్ని ప్రయోగించారు. వాటి నౌకలు కేవలం వాణిజ్య నౌకలు కావు, అవి సాయుధ నౌకలు కూడ. వాటిలో ఫిరంగులు, మారణాంతక విధ్వంసానికి పాల్పడకలిగిన వివిధ రకాల ఆయుధాలు వాటిలో ఉండేవి.

18వ శతాబ్దం ఆరంభానికల్లా ఇంగ్లండు, ఫ్రాన్సులు ప్రధాన వలసవాద దేశాలుగా ఆవిర్భవించాయి. ఇంగ్లీషు ఈ స్టిండియా కంపెనీ కార్పొరేటీకరణ 1600లో, ఫ్రెంచి కంపెనీ కార్పొరేటీకరణ 1664లో జరిగాయి. అయితే, 17వ శతాబ్ది చివరి నాటికి డచ్ ఈస్టిండియా కంపెనీ వెనకపట్టు పట్టిన తర్వాత కాని, ఇంగ్లీషు, ఫ్రెంచి కంపెనీలు హిందూ మహా సముద్ర ప్రాంతంలో తమ ఉనికిని చాటుకోలేదు. 18వ శతాబ్దం రెండవ అర్ధ భాగంలో ఈ రెండు కంపెనీల మధ్య దక్షిణ భారత దేశం సంఘర్షణా వేదికగా తయారయింది. ఇది వలసల కోసం ఇంగ్లండుకు, ఫ్రాన్స్‌కు మధ్య జరిగిన సుదీర్ఘపోరాటంలో ఒక భాగం. ఆ శతాబ్దం మొత్తం మీద ఈ రెండు దేశాలు ప్రపంచాధిపత్యం కోసం పరస్పరం తలపడ్డాయి. వీటికి పరాకాష్ట నెపోలియన్ యుద్ధాలు. నెపోలియన్ పరాజయం పాలు కావడంతో ఆ తర్వాత వందేళ్లు ఇంగ్లండు (బ్రిటన్) ఆధిపత్యానికి అడ్డులేకుండా పోయింది. 1815 నుండి మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభం అయ్యే 1914 వరకు అంతర్జాతీయ పెట్టుబడిదారీ వ్యవస్థపై బ్రిటన్ పెత్తనం చలాయించింది. ఈ కాలంలో బ్రిటిష్ నౌకాదళానికి ఎదురన్నదే లేదు. దాని మూలంగానే బ్రిటన్ విస్తారమైన వలస సామ్రాజ్యంపై ఆధిపత్యం సంపాదించింది. అట్లాంటిక్ బానిస వ్యాపారం ద్వారా కూడ (ఆఫ్రికాలో బానిసలను పట్టుకొని అట్లాంటిక్ సముద్రం మీదుగా అమెరికాకు తరలించడం) బ్రిటన్ పెద్ద ఎత్తున ఆర్జించింది. 19వ శతాబ్దం నాటికల్లా ఆఫ్రికాలో కూడ బ్రిటన్ విస్తారమైన భూభాగాలను సంపాదించింది. అయినప్పటికీ, బ్రిటిష్ వలస సామ్రాజ్యంలో భారత దేశమే కలికితురాయి.

బ్రిటన్‌ను అంతిమంగా అతి ప్రధాన వలసవాద దేశంగా చేసింది దాని ఆర్థిక వ్యవస్థే. 18వ శతాబ్ది మధ్య భాగం నుండి ఇంగ్లండులో జరిగిన పారిశ్రామికీకరణ దాని ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టింది. ఇంగ్లండులో పారిశ్రామికీకరణ మొదటి దశ (1760–80), ఇంగ్లండు ఈస్టిండియా కంపెనీ బెంగాలును (బీహారు, ఒరిస్సాలలో కొన్ని భాగాలు) స్వాధీనం చేసుకోవడం ఒకే సమయంలో యాదృచ్ఛికం కాదు. పాలాషి లేదా ప్లాసీ యుద్ధం (1757), దాని తర్వాత బక్సర్ యుద్ధం(1764) ఇంగ్లండు ఈస్టిండియా కంపెనీని భారత దేశంలో అతి పెద్ద భూభాగంపై ఆధిపత్యం కలిగిన దానిగా చేశాయి. ఈస్టిండియా కంపెనీ అధికారులు నేరుగా దోచుకోవడమే కాకుండా, ఇప్పుడు కంపెనీ తూర్పు భారతంలో తనకు వచ్చే రెవిన్యూతో నూలు వస్త్రాలు లాంటి సరుకులను కొనుగోలు చేసి ఇంగ్లండుకు పంపసాగింది. దీనికి బదులుగా ఇంగ్లండు నుండి బంగారం, వెండి

తీసుకొచ్చి చెల్లించాల్సిన అవసరం లేకుండా పోయింది. ఆ విధంగా ఇంగ్లండుకు వలసవాద కప్పం (ట్రిబ్యూట్) నిరంతర తరలింపు మొదలయింది.

బెంగాలు, బీహారులను (1757) ఇంగ్లండు ఈస్టిండియా కంపెనీ స్వాధీనం చేసుకోవడంతో, బర్మా/మయన్మార్‌తో సహా యావత్ ఉపఖండాన్ని స్వాధీనం చేసుకునే క్రమం ప్రారంభమయింది. ఈ క్రమం తదుపరి వందేళ్లు, ఇంకా ఆ తర్వాత కూడ కొనసాగింది. విస్తరణ అంటే అది అనివార్యంగా పెద్దఎత్తున హింసతోను, రక్తపాతంతోను కూడి ఉంటుంది. బ్రిటిష్ వలస ప్రాంత విస్తరణ కోసం వందేళ్లపాటు భీకర యుద్ధాలు జరిగాయి. తీవ్రమైన నాలుగు మైసూరు యుద్ధాలు 1799 వరకు సాగాయి. మరాఠాలకు వ్యతిరేకంగా మూడు పెద్ద యుద్ధాలు 1818 వరకు కొనసాగాయి. (వీటిలో రెండవ ఆంగ్లో మరాఠా యుద్ధం అతి భీకరమైనది. దీనిలో విజయం సాధించడం బ్రిటన్‌కు కష్టతరం అయింది.) నేపాల్ యుద్ధం (1814–16), మొదటి బర్మా యుద్ధం (1824–26) దీనిలో బ్రిటన్ దాదాపు ఓటమి అంచులకు చేరింది. ఈ బర్మా యుద్ధంతో ఉపఖండం ఈశాన్య ప్రాంతంలో పెద్ద భాగం బ్రిటిష్ వలస పాలన కిందికి వచ్చింది. 1839–1849 మధ్యలో సింధ్, బెలూచిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, పంజాబ్‌లలో వరుసగా యుద్ధాలు జరిగాయి. వీటి ద్వారా వాయివ్య భారతాన్ని బ్రిటన్ స్వాధీనం చేసుకుంది. మొదటి ఆఫ్ఘన్ యుద్దం (1839–42) బ్రిటన్‌కు 19వ శతాబ్దం మొదటి అర్ధ భాగంలోనే మిలిటరీ పరంగా అతి పెద్ద వినాశకర యుద్ధం. ఈ యుద్ధంలో పారిపోతున్న బ్రిటిష్ సైన్యాలు మొత్తం తుడిచిపెట్టబడ్డాయి. మొదటి పంజాబు యుద్ధం (1845–46), రెండవ పంజాబు యుద్ధం (1848–49) కూడ అతి భీకర యుద్ధాలే. ఇవి అనవసరంగా ప్రజలపై రుద్దబడ్డాయి.(ఆ మాటకొస్తే మిగతా ఇతర యుద్ధాలు కూడ) ఈ యుద్ధాల ద్వారా పెద్ద లాహెూర్ రాజ్యాన్ని బ్రిటన్ వశం చేసుకున్నది. ఈ రాజ్య నిర్మాత 1839లో మరణించిన రాజా రంజిత్ సింగ్. 1852లో జరిగిన రెండవ బర్మా యుద్ధం 1857 తిరుగుబాటుకు ముందు జరిగిన అతి పెద్ద యుద్ధం. దీని ద్వారా దక్షిణ బర్మా స్వాధీనం పూర్తయింది. ఉత్తర బర్మా లేదా ఎగువ బర్మా అంటే ఆవ సామ్రాజ్య ప్రాంతాల స్వాధీనం 1885లో జరిగిన మూడవ బర్మా యుద్ధం తర్వాత జరిగింది. రాజును బందీగా పట్టుకొని రత్నగిరికి తరలించారు. ఈ విధంగా వలసవాద స్వాధీనాలు 19వ శతాబ్ది చివరి దశాబ్దాల వరకు కొనసాగాయి.

♦ ♦ ♦

భూభాగాల విస్తరణ బ్రిటిష్ వారు స్వాధీనం చేసుకున్న ప్రాంతాల నుండి సంపదను పోగుచేసి ఇంగ్లండుకు తరలించేందుకు వీలుకల్పించింది. వలస పాలన ఫలితంగా వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ, మాన్యుఫ్యాక్చరింగ్ పతనమయ్యాయి. ల్యాండ్ రెవిన్యూ సెటిల్‌మెంట్ల ఫలితంగా, భూసంబంధాలు సమూలంగా మారిపోయాయి. స్వాధీనం చేసుకున్న బెంగాల్‌లో పెర్మనెంట్ సెటిల్‌మెంటు, బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీలలో రైత్వారీ విధానం, ఉత్తర భారతంలో మహల్వారీ విధానం, మధ్య భారతంలోని అనేక ప్రాంతాలలో మల్గుజారీ విధానం ప్రవేశపెట్టబడ్డాయి. ఈ భూవిధానాలతో పాటు రెవిన్యూ వసూలు పద్ధతి కూడ పూర్తిగా మారిపోయింది. శిస్తు రేట్లను సంప్రదాయ మిరాసీదార్లు, పోలీగార్లు, జమీందార్లు, తాలూక్‌దార్లు కాకుండా ఈస్టిండియా కంపెనీ అధికారులే నిర్ణయించేవారు. రెవిన్యూ బకాయి పడిన వారి భూములకు వేలం వేసి, కొత్తవారికి కేటాయించే నిబంధనలను ప్రత్యేకించి పెర్మనెంట్ సెటిల్‌మెంట్ ప్రాంతంలో బ్రిటిష్ వారు ప్రవేశపెట్టారు. దీని అర్థమేమంటే, తమ స్వంత ఎస్టేట్లను అజమాయిషీ చేసి, నిర్వహించేవారిగా ఉన్న సంప్రదాయ భూ ఆసాములు  కేవలం శిస్తు వసూలు చేసేవారిగా దిగజార్చబడ్డారు.

1793లో ఒక పెర్మనెంట్ సెటిల్‌మెంట్ బెంగాల్, బీహార్‌లపై విధించబడింది. ఈ ల్యాండ్ సెటిల్‌మెంట్ ప్రకారం పంటలో రాజ్యం వాటా శాశ్వతంగా నిర్ణయించబడింది. రెవిన్యూ రేటు అపరిమితంగా నిర్ణయించబడింది. పంటలో 11 వంతుల్లో 10 వంతులు రెవిన్యూగా చెల్లించాలి. బ్రిటిష్ రాకకు పూర్వం భూమిలో ప్రైవేటు ఆస్తి లేనట్లుగా, బడా భూకామందులను, జమీందార్లను, రెవిన్యూ వసూలు చేసేవారిని ఇంగ్లండులో మాదిరి భూస్వాములుగా వలసవాద ప్రభుత్వం గుర్తించింది. ఈ భూస్వాములు వారసత్వ యజమానులుగా చేయబడ్డారు. వారు ప్రభుత్వానికి క్రమబద్ధంగా రెవిన్యూ చెల్లించడానికి బాధ్యులుగా ఉంటారు. సాగుదార్లు లేదా రైతులు తమ సంప్రదాయ హెూదాను కోల్పోయారు. చాలవరకు భూస్వామి ఇష్టం  మేరకు పనిచేసే కౌల్దారుగా మారిపోయారు. 19వ శతాబ్దం ఆరంభంలో బ్రిటిష్ వారు దక్షిణ భారత దేశంలో (తొలుత మద్రాసు ప్రెసిడెన్సీలో, ఆ తర్వాత బొంబాయి ప్రెసిడెన్సీలో) రైత్వారీ విధానాన్ని ప్రవేశపెట్టారు. రైత్వారీ విధానంలో రెవిన్యూ చెల్లింపుకు రైతునే బాధ్యునిగా చేశారు, అతడినే భూయజమానిగా గుర్తించారు. దక్షిణ భారత దేశంలోను, పశ్చిమ భారత దేశంలోను పెద్ద భూకామందులు లేరన్న అవగాహనతో వలసవాద అధికారులు ఈ రైత్వారీ విధానాన్ని రూపొందించారు. రైత్వారీ సెటిల్‌మెంట్ అనేది

పెర్మనెంటు కాదు. రెవిన్యూ రేటును ప్రతి 20/30 సంవత్సరాలకొకసారి సవరించేవారు. సవరించిన ప్రతిసారి దాన్ని చాల ఎక్కువగా పెంచేవారు. అంతేకాదు, హక్కుల నమోదు సక్రమంగా లేకపోవడంతో, చాల తరగతుల సాగుదార్లు, కౌలుదార్లు తమ సంప్రదాయ హక్కును కోల్పోయారు. ఎందువల్లనంటే గ్రామసీమల్లో ఆధిపత్య గ్రూపులకు చెందిన రైతులు (ఉదాహరణకు అగ్రకులాలకు చెందినవారు) వాస్తవంగా సాగుదార్లు కాదు. ఉత్తర భారతంలో (అవధ్‌లో, గంగా యమునల మధ్య కొన్ని ప్రాంతాలలో), మధ్య భారతంలోను రెవిన్యూ వసూళ్లకు ప్రవేశపెట్టిన మహల్వారీ విధానంలో పెద్ద ఎస్టేట్ల యజమానులు, కొన్ని గ్రామ సముదాయాలపై సమిష్టి అదుపు కలిగిన కుటుంబాల పెద్దలు రైతుల నుండి కౌల్దార్ల నుండి రెవిన్యూ వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉండేది. పెర్మనెంట్ సెటిల్‌మెంటును బెనారస్ జిల్లాకు, ఒరిస్సాకు, మద్రాసు ప్రెసిడెన్సీలోని కొన్ని ఉత్తర ప్రాంతాలకు కూడ విస్తరించారని మనం గుర్తుంచుకోవాలి.

వలసవాద జోక్యం వల్ల మరొక పర్యవసానం వ్యవసాయంలో బలవంతపు వాణిజ్యీకరణ. పెంచిన శిస్తులు చెల్లించేందుకు, (వాటిని నగదు రూపంలో చెల్లించాలి) రైతులు ఇండిగో, పత్తి, గంజాయి పంటల సాగు చేయాల్సి వచ్చింది. (దీనికి తోడు మరొక అదనపు భారం కూడ ఉండేది. ప్రభుత్వం సాగునీరు అందిస్తే ఆ సాగునీటి సదుపాయాలకు, కాల్వలకు రైతులు అదనంగా చెల్లించాల్సి వచ్చేది.) ఇండిగో సాగు ఇంగ్లండు వస్త్ర మార్కెట్ అవసరాలకు, రెమిటెన్స్ వాణిజ్య అవసరాలకు అనుగుణంగానే నిర్ణయించబడేది. ఇరవై రెండేళ్ళ పాటు (1780–1802) ఈస్టిండియా కంపెనీ నేరుగా ఇండిగో ఫ్యాక్టరీలను అభివృద్ధి చేసింది. భారత దేశాన్ని ప్రపంచంలోనే అతి పెద్ద ఇండిగో ఉత్పత్తి దేశంగా తయారు చేసింది. ఇండిగో ప్లాంటేషన్ అనేది ప్రైవేటు వ్యవహారం. అయినప్పటికీ ఈస్టిండియా కంపెనీ ప్లాంటర్లను అనేక విధాలుగా ప్రోత్సహించింది. అంతేకాకుండా, ఆహార పంటలకు బదులు ఇండిగో సాగుకు బలవంతంగా మళ్ళించబడిన రైతులకు వ్యతిరేకంగా ప్లాంటర్లకు పాలనాపరమైన, చట్టపరమైన రక్షణను కూడ కల్పించింది. ప్లాంటర్లు అనేక ఆర్థిక, ఆర్థికేతర అణచివేత చర్యలకు పాల్పడే వారు. చిత్రహింసలకు సైతం పాల్పడేవారు. రైతులపై తమ ఆధిపత్యాన్ని చలాయించడానికి, తమ ప్రాంతంలో సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్లాంటర్లు స్థానిక జమీందార్ల మద్దతు స్వీకరించేవారు. ఇండిగో రైతుల్లో మూడు కారణాల రీత్యా అసంతృప్తి పెరిగిపోయింది: ఇండిగోకు గిట్టుబాటు ధర లేకపోవడం, ఆహార పంటల స్థానంలో ఇండిగో సాగు చేయడం లాభసాటిగా ఉండేది కాదు, ఇండిగో

సాగువల్ల భూసారం క్షీణిస్తుంది. ఇండిగో కమిషన్ (1860) ఇండిగో వాణిజ్యం ప్రాధాన్యతను నొక్కి చెప్పింది. ఆ సమయంలో ఏడాదికి 20 లక్షల పౌండ్ల ఇండిగో వ్యాపారం జరిగేది. పెద్ద సంఖ్యలో యూరోపియన్ ప్లాంటర్లు ఉండటం యొక్క రాజకీయ ప్రాధాన్యతను కూడ కమిషన్ వివరించింది. బ్రిటిష్ వారి దోపిడీ తీవ్రమయిందనడానికి ఇండిగో సాగు ఒక నిదర్శనం.

కొన్ని సరుకుల్లో ప్రత్యేకించి ఉప్పు, నల్లమందు వ్యాపారాలలో వలసరాజ్యపు గుత్తాధిపత్యం కూడ దోపిడీకి ఒక సాధనంగా పనిచేసింది. ఉప్పు, నల్లమందు వ్యాపారాల కోసం ఈస్టిండియా కంపెనీ తన ఏజంట్లను నియమించింది. ఈ సరుకులను దేశీయులు ఉత్పత్తి చేయడం, వ్యాపారం చేయడం చట్టవిరుద్ధమని నిబంధనలు జారీ చేసింది. ఉప్పు ఉత్పత్తిపై పన్ను విధించింది. కంపెనీ లీజులు మంజూరు చేసిన ఏజంట్ల వద్దనుండి మాత్రమే ఉప్పుకొనుగోలు చేసేలా కట్టుదిట్టం చేసింది. సాధారణ రైతులు ఉప్పును విపరీతమైన ధరలకు ఏజంట్ల నుండి కొనుగోలు చేయాల్సి వచ్చేది. ఇండియా, చైనా, బ్రిటన్‌ల మధ్య 'త్రికోణ వ్యాపారం' లో నల్లమందు కీలకమైన సరుకు. నల్లమందు బీహారులోను, ప్రస్తుత తూర్పు ఉత్తర ప్రదేశ్ ప్రాంతంలోను ఉత్పత్తి అయ్యేది. దాన్ని పెద్దఎత్తున చైనాకు ఎగుమతి చేసేవారు. అయితే అక్కడ అది నిషేధించబడిన సరుకు. అందుచేత నల్లమందు వ్యాపారం చట్టవిరుద్ధంగా జరుగుతుండేది. నల్లమందును అక్రమ రవాణా చేయడం ద్వారా వచ్చిన లాభాలను బ్రిటన్ కోసం చైనాలో టీ కొనుగోలుకు వినియోగించేవారు. భారత్ నుండి బ్రిటన్‌కు సంపద తరలించడానికి ఇది ఒక ప్రధాన మార్గమయింది. 18వ శతాబ్దం చివరి నుండి రైతులు వలసవాద ప్రభుత్వం నుండి లైసెన్సు తీసుకుని మాత్రమే నల్లమందు ఉత్పత్తి చేయాల్సి ఉండేది. ఉత్పత్తి అయిన మొత్తం సరుకును ప్రభుత్వ ఏజంట్లకు అందచేయాలి. రైతుల చేత గంజాయి బలవంతంగా సాగు చేయించేవారు. ప్రభుత్వం చెల్లించే ధర కనీస ఉత్పత్తి ఖర్చుల కన్నా తక్కువ ఉండటంతో రైతులు దీన్ని సాగుచేయడానికి – ఇష్టపడేవారు కాదు.

♦ ♦ ♦

19వ శతాబ్దం మొత్తం మీద భారత దేశంలో వలసవాద ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన అతి విస్తారమైన, అతి హింసాత్మకమైన పోరాటం 1857 తిరుగుబాటు అని సాధారణంగా అందరు గుర్తిస్తారు. ఆ తిరుగుబాటు రెండేళ్ళ పాటు

కొనసాగింది. ఉత్తర, మధ్య, తూర్పు భారతంలోని విస్తారమైన ప్రాంతాలలో ఇది జరిగింది. భారత సామ్రాజ్య వ్యాపితంగా కొనసాగుతున్న వలసవాద ప్రభుత్వ వ్యతిరేక సుదీర్ఘ పోరాట సంప్రదాయంలో ఇది ఒక భాగం. వలసవాద అణచివేతకు వ్యతిరేకంగా నిరంతరంగా కొనసాగుతున్న పోరాటంలో ఇది ఒక మహత్తర ఘట్టం.

1857 తిరుగుబాటు సంఘటనలపై తీవ్రమైన చర్చ జరిగింది. ఈ మహత్తర వలసవాద వ్యతిరేక సంగ్రామం ప్రాధాన్యతను తగ్గించి చూపాలనుకుంటున్నవారికి, సామ్రాజ్యవాద అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన పోరాట చరిత్రలో ఇది ఒక ఉజ్వల ఘట్టంగా దాని చారిత్రక ప్రాధాన్యతను నొక్కిచెప్పేవారికి మధ్య ఈ చర్చ జరిగింది. 19వ శతాబ్దం రెండవ అర్ధ భాగం పొడవునా ఈ తిరుగుబాటుపై పెద్ద ఎత్తున సమాచారం ప్రచురించబడింది. దీనిలో అత్యధికం విజయం సాధించిన బ్రిటిష్ వారి వైఖరిని సమర్థించేవే. దీంతో ఈ తిరుగుబాటు గురించి బ్రిటిష్ వారు చెప్పిందే చలామణిలోకి వచ్చింది. 19వ శతాబ్దం ఆరంభం వరకు భారత సామ్రాజ్యంలో లొంగుబాటుకు గురయిన ప్రజానీకం వైఖరిని వివరించే ఎలాంటి రచనలు వెలువడలేదు. అయితే దీనికి ఒకే ఒక్క మినహాయింపు ఉంది. అది మార్క్స్, ఎంగెల్స్‌లు ఈ తిరుగుబాటుపై వరుసగా రాసిన వ్యాసాలు. ఇవి న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్‌లో ప్రచురించబడ్డాయి. ఈ వలసవాద వ్యతిరేక తిరుగుబాటులోని మిలిటరీ అంశాల గురించి వారు తమ వ్యాసాలలో విపులంగా రిపోర్టు చేశారు. 1858 మధ్య భాగం వరకు కూడ తిరుగుబాటు బ్రిటిష్ పాలనను కూలద్రోసి విజయం సాధించగలదన్న ఆశాభావంతో వారు ఉన్నారు. లేదంటే కనీసం భారత దేశంలో బ్రిటిష్ పాలనను దెబ్బతీస్తుందని విశ్వసించారు.

19వ శతాబ్దం మొదటి అర్ధ భాగం అంతటా కూడ వలసవాద పాలనకు వ్యతిరేకంగా నిరంతరం ప్రజాప్రతిఘటన కొనసాగుతూ వచ్చింది. ఆ పోరాట సంప్రదాయపు పరాకాష్టే 1857 తిరుగుబాటు. గ్రామీణ ప్రాంతాలలో ఈ ప్రతిఘటన స్థానిక భూస్వామ్య గ్రూపుల అణచివేతకు వ్యతిరేకంగా జరిగేది. ఈ భూస్వాములకు సాధారణంగా వలసవాద ప్రభుత్వ అండ ఉంటూ ఉండేది. ఈ సంఘర్షణల్లో వలసవాద రాజ్యం సాధారణంగా భూస్వాముల పక్షాన జోక్యం చేసుకునేది. ఆదివాసీ ప్రజలు పెద్ద ఎత్తున తరలింపుకు గరయ్యారు. ఈ ప్రజానీకానికి, అణచివేతకు పాల్పడే ప్రభుత్వ యంత్రాంగానికి మధ్య హింసాత్మక సంఘర్షణలు జరుగుతుండేవి.

1857 తిరుగబాటు 18వ శతాబ్ది చివరిలోను, 19వ శతాబ్ది మొదటి అర్ధ

భాగంలోను వ్యవసాయ తిరుగుబాట్ల వెల్లువ అనంతరం జరిగిందని మనం ఇక్కడ తప్పనిసరిగా గుర్తించాలి. ఈస్టిండియా కంపెనీ తీసుకొస్తున్న మార్పులను వ్యతిరేకించడమే ఈ ప్రతిఘటనల్లో ప్రధాన అంశం. తమ సామ్రాజ్యపు రాజకీయ, ఆర్థిక భద్రతను కాపాడుకునేందుకు వలసవాద పాలన మొదటి శతాబ్దం పొడవునా అప్పుడు ఉనికిలో ఉన్న ఫ్యూడల్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించేందుకు కంపెనీ అధికారులు ప్రయత్నించారు. ఇది సంప్రదాయ భూకామందులు, రైతులు, కౌలుదార్లలో తీవ్ర అసంతృప్తిని రేకెత్తించింది. ఇంకా పశుపోషకులు, ఆదివాసీలు, వ్యవసాయ కార్మికులు తదితర వ్యవసాయంపైన, దాని అనుబంధ కార్యకలాపాలపైన ఆధారపడి జీవించే వారు కూడ తీవ్ర అసంతృప్తికి గురయ్యారు.

1757 నుండి 1857 వరకు ప్రతిఘటనకు కనీసం మూడు నాలుగు అంశాలు దారితీశాయి. అన్నింటికన్నా ముఖ్యమైనది బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన ల్యాండ్ సెటిల్‌మెంట్లు. ఈ కాలంలో ఇవే బ్రిటిష్ వారి విధానాలను రూపుదిద్దాయి. ఆ కాలంలో జరిగిన ప్రతిఘటనలకు, తొలగించబడి అసతృప్తికి గురయిన జమీందార్లు తాము స్వయంగా కాని, తమ సాయుధుల ద్వారా కాని నాయకత్వాన్ని అందించారు. ఇలాంటి తిరుగుబాట్లకు అత్యంత ప్రాతినిధ్యం వహించే ప్రతిఘటన తమిళనాడులో జరిగింది. వలసవాద చర్యల మూలంగా తమ అధికారాల్ని కోల్పోయిన సంప్రదాయ నేతలు, రెవిన్యూ వసూలుదార్లు చేసిన పోలిగార్ల (పాలెగాళ్ళ) తిరుగుబాటు.

మైసూరును లొంగదీసుకున్న తర్వాత బ్రిటిష్ వారు శక్తివంతమైన స్థానిక నేతల (పాలిగార్లు) తిరుగుబాట్లను అణచివేయడానికి మధ్య, దక్షిణ తమిళనాడుల్లో 1799–1805 మధ్యలో వరుసగా అనేక సైనిక చర్యలకు పూనుకోవలసి వచ్చింది. వలసపాలనకు లొంగడానికి పెద్ద సంఖ్యలో పాలిగార్లు నిరాకరించారు. దీంతో నాల్గవ మైసూర్ యుద్ధం ముగిసిన వెనువెంటనే బ్రిటిష్ వారు భారీ ఎత్తున సైనిక చర్యలను మొదలుపెట్టారు. పాలిగార్లకు వ్యతిరేకంగా మొదటి యుద్ధం (1799) తిరునల్వేలిలోను, దాని పరిసరాల్లోను ప్రధానంగా కట్టబొమ్మనకు వ్యతిరేకంగా జరిగింది. ఈస్టిండియా కంపెనీని ఎదుర్కొన్న వారిలో ఏమాత్రం రాజీపడని వాడు కట్టబొమ్మన. 1805 వరకు సాగిన రెండవ పాలిగార్ల యుద్ధంలో బ్రిటిష్ వారు తిరుగుబాటు చేసిన పాలిగార్లు అందరినీ అణచివేశారు. 19వ శతాబ్దం మొదటి సంవత్సరాలలో దక్షిణ భారత దేశంలో బ్రిటిష్ పాలన పూర్తిగా స్థాపించబడింది.

ఒరిస్సాలో జగబంధు నాయకత్వంలో పాయకార్ల (రైతాంగ సాయుధులు) తిరుగుబాటు 1817లో జరిగింది. జగబంధు ఖుర్దా రాజుకు సేనాని. కుమావున్‌లో

బిజయ్ సింగ్ తాలూక్‌దార్ నాయకత్వంలో గుజార్ల తిరుగుబాటు (1824), ఒరిస్సా, గంజాం జిల్లాలో గుమ్‌సూర్ జమీందార్ల తిరుగుబాటు (1835–37) – ఇవి సంప్రదాయ ఫ్యూడల్ కులీన వర్గాలలో ఆనాడు నెలకొన్న సార్వత్రిక అసంతృప్తికి అద్దం పట్టాయి.

బ్రిటిష్ వారి చర్యలతో సంప్రదాయ కులీన వర్గం తమ అధికారాల్ని, విశేష హక్కుల్ని కోల్పోయి ఉండవచ్చు. కాని రైతాంగంపై మాత్రం ఇది వినాశకర ప్రభావాన్ని చూపింది. రెవిన్యూ నిర్ణయం నేరుగా వలస పాలకులే చేయడంతో, రైతులు అంతకంతకు అధిక పన్నులను ఎలాంటి తగ్గింపు లేకుండా చెల్లించవలసి వచ్చేది. బ్రిటిష్ వారికి తలొగ్గిన భూకామందులు, వలసపాలకులకు ఏజంట్లుగా తయారయారయి, వారు నిర్దేశించిన గడువు లోపల కచ్చితంగా పన్నులు వసూలు చేసి చెల్లించాల్సి వచ్చేది. తమ స్వంతం కోసం కూడ రైతుల నుండి అదనంగా శ్రమరూపంలోను, నగదు రూపంలో అధికంగా వసూలు చేసేవారు. ఈ విధంగా రైతులు రెండురకాల దోపిదీకి గురయ్యేవారు. అంతేకాకుండా, రైతులు గతంలో మాదిరి పన్నులు బకాయిపడినప్పుడు భూకామందులతో తమకు సంప్రదాయంగా ఉండే సంబంధాలను ఇప్పుడు వినియోగించలేకపోతున్నారు. దీంతో రైతులకు, బ్రిటిష్ వారి చేత తమ పదవులు పొందిన వారితో సహా భూకామందులకు మధ్య వైరుధ్యం తీవ్రతరమయింది. మరొక వైపున, రైతాంగం రుణభారం పెరిగిపోవడం, నూతన భూకామందుల, వడ్డీ వ్యాపారుల దోపిడీ వ్యవసాయ తిరుగుబాట్లలో వ్యక్తమయ్యాయి. తూర్పు బెంగాలులో సన్యాసుల తిరుగుబాటు (1763–1800), చోటానాగపూర్‌లో కోల్‌ల తిరుగుబాట్లు (1831–32), సంతాలుల తిరుగబాటు (1855–56) వలసపాలనలో తమ స్థానాన్ని బలపరుచుకున్న భూస్వాములు, మహాజన్లకు వ్యతిరేకంగా జరిగాయి. అదే విధంగా మలబార్ ప్రాంతంలో జమీందార్లకు వ్యతిరేకంగా మొప్లా తిరుగుబాట్లు జరిగాయి. ఈ తిరుగుబాట్లన్నీ చాలవరకు జమీందార్ల, వడ్డీ వ్యాపారుల ఆస్తులను దోచుకోవడం, వారి నుండి పన్నులను వసూలు చేయడం అనే పద్ధతినే అనుసరించాయి. ఈ రకంగా ఈ వర్గాల వారు వలస పాలకుల అణచివేత విధానాలను అమలుపరిచేవారిగా గట్టిగా గుర్తించబడ్డారు. రైతాంగ ఉద్యమాలలో ఈ వలసవాద వ్యతిరేక ధోరణి సిల్హెట్‌లో ఖాసీ తిరుగుబాటులోను (1829–31), మాల్వా సత్‌మహల్లలో గ్రామపెద్ద లాలాజీ పటేల్ నాయకత్వంలో తిరుగబాటు (1831), గంజాంలో ఖోండ్‌ల తిరుగుబాటులోను(1846) అతి స్పష్టంగా వెల్లడయింది.

1857 పూర్వపు తిరుగుబాట్లకు ప్రధాన ప్రాతిపదిక ఆస్తి హక్కులలో బ్రిటిష్ వారు తెచ్చిన మార్పులు అయినప్పటికీ, ఇండిగో లాంటి వాణిజ్య పంటల ద్వారా వ్యవసాయంలో వాణిజ్యీకరణను ప్రవేశపెట్టడం, వాటి కోసం యూరోపియన్ ప్లాంటేషన్లను ఇండిగో విషయంలో అయితే ఆ పంట పండే ప్రాంతాలలో నెలకొల్పడం కూడ ముఖ్యమైన కారణాలే.

18వ శతాబ్దం చివరిలోను, 19వ శతాబ్దం ఆరంభంలోను చాల తిరుగుబాట్లు రైతులు తాము అప్పటివరకు ఆహార పంటలు పండిస్తున్న భూములలో ఇండిగో లాంటి వ్యాపార పంటలు వెయ్యడానికి నిరాకరించి ప్లాంటర్ రాజ్‌ను వ్యతిరేకించడంతోను, పన్ను చెల్లింపును నిరాకరించడం తోను జరిగాయి. తూర్పు భారతంలో తొలి దశ ఇండిగో తిరుగుబాట్లు 19వ శతాబ్దం ఆరంభంలో మొదలయ్యాయి. బిశ్వనాథ్ సర్దార్ నాయకత్వంలో జరిగిన ఈ తిరుగుబాట్ల సమయంలో నీల్‌కుంతిస్‌ను (ఇండిగో గృహాలు) లూటీ చేశాయి. మళ్ళీ రెండు దశాబ్దాల తర్వాత శరన్, తిర్హుట్, ముంజర్, భగల్పూర్, పూర్నియా లలోని రైతులు ఇండిగో పంట వేయడానికి నిరాకరించడంతో మళ్ళీ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. మధుబని సబ్‌డివిజన్‌లో వారు ఒక కమిటీని ఏర్పరుచుకొని ఇండిగో వేయబోమని ప్రకటించారు. ఇండిగో ప్లాంటర్లకు, వారి జమీందార్లకు వ్యతిరేకంగా మరొక ప్రధాన తిరుగుబాటు (1831) బెంగాలు 24 పరగణాల జిల్లాలో జరిగింది. దీనికి నాయకత్వం వహించిన రైతు నాయకుడు టిటు మిర్ క్రింది కులాలకు చెందిన హిందూ, ముస్లిం రైతులందరికీ నాయకత్వం వహించాడు.

1960ల నుండి కొందరు పండితులు తొలి రైతాంగ తిరుగుబాట్లలో పునరుద్ధరణ స్వభావం కలిగినవని చెప్పసాగారు. వారు మత చిహ్నాలను వాడారని, పునరుద్ధరణవాద, స్థానిక నాయకులపై ఆధారపడేవారని వారి వాదనకు సమర్థనగా చెప్పారు. ఆ విధంగా టిటు మిర్ తిరుగుబాటు, సన్యాసుల ఉద్యమం, మొప్లా తిరుగుబాటు మొదలైనవి మత ప్రాతిపదికన జరిగినవని, మతతత్వ ధోరణి కూడ కలిగినవని పేర్కొంటున్నారు. అయితే ఈ రకమైన విశ్లేషణలు వ్యవసాయ రంగంలో అసంతృప్తి గురించికాని, ఆ ఉద్యమాల రాజకీయ తాత్విక స్వభావం గురించి కాని అవగాహన లేకుండా చేసినవే.

గుర్తుంచుకోవలసిన మొదటి అంశమేమంటే, 18వ శతాబ్దం మధ్య నుండి 1857 వరకు జరిగిన ఈ వ్యవసాయ తిరుగుబాట్లు అన్నీ మొత్తం దేశవ్యాపితంగా

జరిగాయి, చాల సందర్భాలలో వలసవాద విస్తరణ మార్గాన్ని అనుసరించి జరిగాయి. వలసవాద చొరబాటు వ్యతిరేకతను చవిచూస్తూ జరిగిందని, వలసవాదులు ఎక్కడ తమ ఆధిపత్యాన్ని నెలకొల్పాలని చూసినా అది ప్రతిఘటనను ఎదుర్కొందని ఈ ఉద్యమాలు స్పష్టం చేస్తున్నాయి. ఇలాంటి ప్రధాన తిరుగుబాట్లు బెంగాలులో ఆరు, బీహారులో ఐదు, అస్సాంలో మూడు, మధ్య, దక్షిణ భారత దేశంలో పదిహేను జరిగినట్లు మనం గుర్తించవచ్చు. అంటే, వలసవాదం తన జోక్యంతో అప్పటి వర్గ పొందికను మార్పు చేయడానికి పూనుకున్నపుడు వలసవాద పూర్వ భారత సమాజం నుండి ఆ ప్రయత్నం ముఖ్యమైన సవాలు నెదుర్కొందని మనం తెలుసుకోవాలి. ఈ వర్గ శక్తుల పునఃపొందిక కొన్ని సార్లు మాత్రమే, అన్ని సార్లు కాదు పునరుద్ధరణ ఉద్ఘాటనలను కలిగి ఉంది. మరొక విధంగా చెప్పాలంటే, వలసవాద వ్యతిరేకత అన్నది ఈ ఉద్యమాల సాధారణ స్వభావం. పునరుద్ధరణ వాద ఎజెండా ఈ ఉద్యమాలలోని శక్తుల మధ్య స్థానిక సహ సంబంధాలపైనే ఆధారపడి ఉంది.

అయినప్పటికీ, ద్వితీయ స్థాయిలో మనం ఒక విషయాన్ని గమనంలో ఉంచుకోవాలి. వీటిలో చాల ఉద్యమాలు బీజప్రాయంలో ఫ్యూడల్ వ్యతిరేక స్వభావాన్ని కలిగి ఉన్నాయి, రాజకీయ సమీకరణ కోసం, తమ లక్ష్యాల ఉద్ఘాటన కోసం మతాన్ని వినియోగించుకున్నాయి. ఉదాహరణకు సన్యాసులు, ఫకీర్లు వ్యవసాయ రంగంవైపుకు, వలసవాద దోపిడీ బాధితులైన రైతుల వైపుకు వచ్చారు. అంతేకాకుండా, దేశంలోని చాల ప్రాంతాలలో ముస్లిం రైతాంగానికి, హిందూ భూస్వాములకు మధ్య సంఘర్షణ లు 19వ శతాబ్దపు నిరసనల నిర్మాణాన్ని రూపొందించాయి. ఈ సంఘర్షణల్లో మతం అనేది వారికి ఒక నైతిక మద్దతును అందించింది, వారి డిమాండ్ల ఉద్ఘాటనకు బలమైన భాషను సమకూర్చింది.

అన్నింటికన్నా ఎక్కువగా మతాన్ని వినియోగించడం, ఈ ఉద్యమాలలో కొన్ని పునరుద్ధరణవాద ఎజెండాను స్వీకరించడం ప్రత్యేకించి సంప్రదాయ సంపన్న వర్గాలు రైతాంగానికి నాయకత్వం వహించిన చోట రైతాంగానికి తమ స్వంత రాజకీయాలను ఉద్ఘాటించకలిగిన శక్తి లేదన్న విషయం స్పష్టమవుతున్నది.

♦ ♦ ♦

19వ శతాబ్దం ఆరంభం నాటికి కొందరు వలసవాద సిద్ధాంతకారులు అభివృద్ధి పేరుతో వలస పాలనను సమర్థించేందుకు పూనుకున్నారు. సామ్రాజ్యానికి

మరింత ఉన్నతమైన ప్రయోజనం ఉండాలని వారు నొక్కిచెప్పారు. బ్రిటిష్ పాలన ఉద్దేశం ఆధునిక ఐరోపియన్ సంస్కృతి పాధించిన విజయాలను భారత దేశానికి చేరవేయడం. ఈ అభిప్రాయాలను ప్రతిపాదించిన ముఖ్యుల్లో ఒకరు  జేమ్స్ మిల్. తన ప్రభావశీలమైన గ్రంథం 'హిస్టరీ ఆఫ్ బ్రిటిష్ ఇండియా' లో తన అభిప్రాయాలలో చాలవాటిని పొందుపరిచాడు. బ్రిటిష్ పాలన ఉన్నతమైనదని, జ్ఞానదాయకమైనదని ఆయన చెప్పాడు. అందువల్ల సామ్రాజ్యం నైతికమైనది.  భారతీయ సమాజం వెనకబడి ఉంది, దాన్ని పురోగమన పథంలో పెట్టడం బ్రిటిష్ వారి చారిత్రక బాధ్యత.

మతము, సంప్రదాయాల విషయంలో వలసవాద ప్రభుత్వం సాధారణంగా జోక్యం చేసుకోనప్పటికీ, అప్పుడప్పుడు కొన్ని విషయాలలో కల్గించుకునేది. 18వ శతాబ్దం చివరి దశకంలో ప్రముఖంగా కనిపించిన అలాంటి అంశం 'సతి'. 1798లో కలకత్తా నగరంలో సతి చట్టవిరుద్ధమని ప్రభుత్వం ప్రకటించింది. సతి ఆచారం గురించి ప్రభుత్వం తీసిన లెక్కలు బెంగాల్ ప్రెసిడెన్సీలో ఈ అంశంపై ప్రజల దృష్టిని కేంద్రీకరించేలా చేశాయి. ఇదే సమయంలో ఒక వైపున ప్రభుత్వం బ్రిటిష్ పాలన నాగరికత నేర్పే బాధ్యతకు కట్టుబడటం గురించి సైద్ధాంతిక ప్రచారం జరుగుతున్నది. ఈ సమయంలో సతి అంశం భారతీయుల వెనకబాటు తనానికి నిదర్శనంగా చూపడానికి, తద్వారా తమ పాలనను సమర్థించుకోవడానికి  బ్రిటిష్ వారికి అవకాశం లభించింది.

మేధావుల్లో  కొన్ని సెక్షన్లకు చెందిన వారు సమాజంలోను, మత ఆచారాల్లోను మార్పులు జరగాలని ప్రచారం చేయనారంభించడానికి ఇదే నేపథ్యం. బ్రిటిష్ పాలన పట్ల ఇలాంటి వారి స్పందన సంస్కరణలను డిమాండు చేయడంగా ఉంది. అదే సమయంలో వలస పాలనకు సంబంధించిన అనేక విషయాలలో విమర్శిస్తూ కూడ ఉండేవారు. 19వ శతాబ్దం మొదటి అర్ధ భాగంలో రాజరామ్ మోహన్ రాయ్‌ను అతి ముఖ్యమైన భారతీయ సంఘసంస్కర్తగా గుర్తించవచ్చు. సంపన్న కుటుంబం నుండి వచ్చిన ఆయనకు అనేక భాషలలో ప్రావీణ్యం ఉండేది. ఆయనకు ఇంగ్లీషు కాకుండానే, సంస్కృతము, పర్షియన్, అరబిక్ భాషలు కూడ తెలుసు. ఆయన అపారమైన మేధా సంపత్తి కలిగిన వాడు, విస్తారంగా చదువుకున్న వాడు. అనాటి చాలమంది సంఘసంస్కర్తల లాగా, ప్రజామేధావుల్లాగా రాజరామ్ మోహన్ రాయ్ గొప్ప పండితుడు. రాయ్ 1828లో బ్రహ్మ సమాజాన్ని స్థాపించాడు. రాజారామ్ మోహన్ రాయ్ మత చాందసాన్ని నిశితంగా విమర్శించేవాడు. 'భారత దేశంలో పాతకు, కొత్తకు మధ్య అరుదైన వారధి' లాంటి వాడని రాయ్ పేరుగాంచాడు. రాయ్ లాంటి సంస్కర్తలు సతి అంశాన్ని చేపట్టి, ఆ దురాచారాన్ని నిషేధించేందుకు చట్టం తీసుకురావాలని

గట్టిగా ప్రభుత్వంపై వత్తిడి చేయడం సాధ్యమయింది. సతిని నిషేధించేందుకు ఒక చట్టాన్ని తీసుకురావాలన్న ఏకాభిప్రాయం వలస పాలకుల్లో ఏర్పడింది. మతానికి, ఆచారాలకు సంబంధించిన అంశాలలో జోక్యం చేసుకోరాదన్న వలస పాలకుల సాధారణ వైఖరికి ఇది మినహాయింపు. వితంతువుల హెూదా గురించిన సమస్య కూడ భారతీయ సంఘసంస్కర్తలకు ఎదురైంది. బెంగాల్‌లో వితంతువులు చాల మంది బాల వితంతువులు, వారి సమస్యను ఈశ్వర చంద్ర విద్యాసాగర్ శక్తివంతంగా చేపట్టారు. రాజారామ్ మోహన్ రాయ్, ఈశ్వర చంద్ర విద్యాసాగర్ వీరిరువురూ విద్యావ్యాప్తికి కూడ చొరవ తీసుకున్నారు. ప్రత్యేకించి విద్యాసాగర్ స్త్రీ విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు.

19వ శతాబ్దం మొదటి అర్ధ భాగంలో వలస పాలకులలో విద్య గురించి పెద్దఎత్తున చర్చ జరిగింది. వలసవాద ప్రభుత్వం తన భారత పాలితుల విద్య కోసం ఏదో ఒకటి చేయాలన్న ప్రయత్నానికి 1813 చార్టర్ చట్టం ఒక గుర్తు. అయితే ఈ చట్టంలో పేర్కొన్న చర్యలు చిహ్నప్రాయంగానే ఉన్నాయి. కాని సాంఘిక సంస్కర్తలకు ఇది చాల ప్రాముఖ్యత కలిగిన అంశం. రాజారామ్ మోహన్ రాయ్, ఇంకా బెంగాలుకు చెందిన ఇతర విద్యావేత్తలు, పెద్ద ఎత్తున పాశ్చాత్య విజ్ఞానంతో కూడిన ఇంగ్లీషు విద్య భారతీయులకు తగినదని భావించారు. ఈ మార్గంలో విద్యను బోధించేందుకు 1817లో కలకత్తాలో ఒక విద్యాసంస్థ (హిందూ కాలేజి) స్థాపించబడింది. ఈ విద్యా సంస్థ చాల విజయవంతంగా పనిచేసింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఆ సంస్థలో చేరారు. హిందూ కాలేజీ ప్రధానంగా స్కాటిష్ జాతీయుడైన గడియారాల తయారీదారు, విద్యావేత్త డేవిడ్ హారె కృషి వల్ల స్థాపించబడింది. హిందూ కాలేజీ తేజోవంతమైన మేధో సంస్కృతికి కేంద్రంగా తయారయింది. విశాల దృష్టి, సందేహవాదం, పాశ్యాత్య సంస్కృతి సాధించిన పురోగామి విజయాల పట్ల గౌరవం – ఈ విద్యా ప్రాంగణంలో ఉట్టిపడుతుండేవి. ఇలాంటి సంస్కృతికి అతిముఖ్యమైన ప్రతినిధి అక్కడ ఇంగ్లీషు బోధించిన ఆకర్షణీయమైన కవి, పండితుడు హెన్రీ లూయీ వివియన్ డెరోజియో. ఆయన తన రచనల ద్వారా, ఉపన్యాసాల ద్వారా ఇలాంటి సంస్కృతికి రూపుదిద్దారు. డెరోజియో మేథో సంప్రదాయ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లింది మిఖాయల్ మదుసూదన్ దత్. ఆయన హిందూ కాలేజీలోనే చదివారు. బెంగాలీ సాహిత్యాన్ని రూపుదిద్దడంలో ఒక ముఖ్యమైన పాత్ర పోషించారు.

జ్యోతిరావు పూలే (1827–1890) మహారాష్ట్రకు చెందిన సామాజిక విప్లవ కారుడు. ఆధిపత్యాన్ని నిరసిస్తూ శక్తివంతమైన సామాజిక–సాంస్కృతిక విశ్లేషణను ముందుకు తెచ్చారు. సమానత్వం, న్యాయం, హేతువు ఆధారంగా సమాజాన్ని

పునర్నిర్మించే బహుముఖ పోరాటానికి ఆయన ముందున్నారు. శ్రామిక కులాలు, అన్ని తరగతుల మహిళలు ఎదుర్కొంటున్న బానిసత్వాన్ని బట్టబయలు చేశారు. తాము బానిసత్వంలోకి నెట్టబడ్డామన్న స్పృహ వారికి కలిగితే తప్ప దానిలో నుండి బయటపడలేరని ఆయన ఉద్ఘాటించారు. ఆయన తన ఉద్యమానికి కేంద్ర అంశంగా అందరికీ విద్యను తీసుకున్నారు. సమాజాన్ని ఎదుర్కొంటున్న దాదాపు అన్ని ముఖ్య సమస్యల మీద కృషి చేశారు. మతము, కులము, రాజకీయాలు, విద్య, భాష, సాహిత్యం, చరిత్ర, జండర్, దారిద్ర్యం, వ్యవసాయరంగ పరిస్థితి, రైతుల దుస్థితి – ఇలా ఎన్నో అంశాలను చేపట్టారు. ఆయన పట్టించుకున్న అంశాలు కాని, ఆయన అభిప్రాయాలు కాని 19వ శతాబ్దంలో ఏ నాయకునికి లేనంత విశాలమైనవి.

# III. భారత దేశ చరిత్రకు హిందూత్వవాదుల వక్రీకరణలు

**గ**త కొన్ని దశాబ్దాలుగా హిందూత్వ – ఆరెస్సెస్‌వాదులు చరిత్రను తమ ప్రచార వేదికగా చేసుకున్నారు. భారత దేశ చరిత్రను వక్రీకరించడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. పురావస్తు పరిశోధనలు, శాసనాలు, నాణాలు, ప్రాచీన వనరులు, సాహిత్యం మొదలైన వాటి ఆధారంగా లభించిన సమాచారాన్ని శాస్త్రీయంగా విశ్లేషించిన చరిత్రకారుల రచనలపై వీరు దాడి చేస్తున్నారు. ఇలాంటి ప్రయత్నాలు చరిత్రను పుక్కిటి పురాణంగా మారుస్తున్నాయి. అత్యుత్తమ విద్యార్థి సైతం అందులో కల్పితమేదో, వాస్తవమేదో తెలుసుకోనంతగా చరిత్రను మారుస్తున్నారు. ఇటీవల కాలంలో పాఠ్యగ్రంథాలలోకి ఇలాంటి మార్పులు చాల ప్రవేశపెట్టబడ్డాయి. అలాంటి వక్రీకరణలలో ప్రధానమైనవి ఈ క్రింది విధంగా ఉన్నాయి.

## 1. హరప్పా సంస్కృతి

**హిందూత్వ కథనం:** హరప్పా సంస్కృతి భారత ఉపఖండంలో తవ్వకాలలో బయటపడిన అతి పురాతన సంస్కృతి. ప్రపంచంలోని ఏ ఇతర ప్రాంతంలోకన్నా భారతీయ నాగరికతకు అధిక ప్రాచీనత ఉందని చెప్పుకోవడానికి హరప్పా సంస్కృతిని వేద సంస్కృతిగా పరిగణించి, దాన్ని సరస్వతీ నాగరికతగా పిలుస్తున్నారు. కాలిబంగన్ లాంటి చోట్ల 'యజ్ఞగుండాలు' బయపడటం, సుర్కతోడ లాంటి చోట్ల గుర్రం ఉనికి కనిపించడం, కొన్ని ముద్రలపై 'పశుపతి శివ', 'సప్తర్షి' లాంటి బొమ్మలు, థార్ ఎడారిలో కాలిబంగన్ సమీపంలో ఘగ్గర్ హక్రా నది అదృశ్యమవడం గురించిన భూగర్భ శాస్త్ర ఆధారం – ఇలాంటి వాటి ప్రాతిపదికన ఈ వాదనలు

చేయబడుతున్నాయి. ఎస్‌పి గుప్తా అనే చరిత్ర కారుడు, ఘగ్గర్ హక్రా నది వాస్తవంగా గుజరాత్, కచ్ లోని రాన్‌లోకి ప్రవహించిందని, అందుచేత అది 'భారతీయ నది' అని వాదించాడు. అంతకు ముందు అది ప్రయాగలోకి (ప్రస్తుత అల్హాబాద్) ప్రవహించిన గంగ, యమున, సరస్వతి త్రివేణి సంగమంలో భాగం. పురాతత్వవేత్త ఎస్‌ఆర్ రావు హరప్పా లిపి సంస్కృతమని తేల్చాడు. హరప్పా నాగరిగకత అంతరించడానికి కారణం సరస్వతి నది అంతరించడం, ప్రజలు వలసలు పోవడం. మూలవాసులతో సంఘర్షణలు కూడ కారణమని చెప్పబడింది.

**శాస్త్రీయ వివరణ:** ఘగ్గర్ హక్రా నది హిందూత్వ వాదులు చెబుతున్న సరస్వతీ నది అని అంగీకరించినప్పటికీ, దాని చుట్టూ నాగరికత కేంద్రీకరించినట్లు ఆధారలేమీ లేవు. ఇలాంటి పురావస్తు ప్రదేశాలలో అధికం సింధునదీ పొడవునా, దాని ఉపనదుల పొడవునా ప్రస్తుత హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ యుపి, అఫ్ఘనిస్తాన్ వరకు వ్యాపించి ఉన్నాయి. సుర్కతోడ వద్ద లభించిన గుర్రం ముద్ర అక్కడ వేద ఆర్యుల సంస్కృతి ఉన్నదని సూచిస్తున్నది అనడం సరికాదు. ఆ ముద్ర హరప్పా సంస్కృతిలో ఎక్కువగా బయటపడిన ఒంటికొమ్ము మృగం ముద్రల్లో ఒక ముక్క అయి ఉండవచ్చు. యజ్ఞగుండాలు అని భావించబడుతున్నవి వేద కాలపు హోమ గుండాలు కావు. అవి మూలవాసులు ఉపయోగించిన పొయ్యిలు మాత్రమే. ఘగ్గర్ హక్రా నది, సరస్వతీ నది అని చెప్పడం కూడ నిరాకరించబడింది. బహుశా అది మధ్య ఆసియా ప్రజలు తమ వలసల క్రమంలో గుర్తించిన (హెల్మండ్) నది అయి ఉండవచ్చు. ప్రయాగలో కలిసిన నది సిరుసితి అనే చిన్న నదిగా గుర్తించబడింది. ఇప్పుడు అది హర్యానాలో ఉంది. అన్నింటికన్నా ముఖ్యంగా హరప్పా లిపి, సంస్కృత లిపి ఒక్కటే అనడం గట్టిగా తిరస్కరించబడింది. కంప్యూటర్ అధ్యయనాల ఆధారంగా అది మూల ద్రవిడ భాషగా గుర్తించబడింది. రాఖి గర్హి (హర్యానా) లోని ప్రజల డిఎన్‌ఏ నమూనాను విశ్లేషించినపుడు అది దక్షిణ భారతంలోని అతి పురాతన ప్రజల డిఎన్‌ఏ నమూనాతో సమానంగా గుర్తించబడింది. చివరిగా పెరక్‌తో సహా ఈ సంస్కృతులు వలసవచ్చిన వారికి చెందినవిగా గుర్తించబడింది. గాంధర్వ సమాధుల సంస్కృతి, స్మశానం – హెచ్ హరప్పా తర్వాతి కాలానికి సంబంధించినవి. అవి హరప్పా సంస్కృతి (క్రీ.పూ. 2250–1750) తర్వాతవే అని కాల నిర్ణయం చేయబడింది.

## 2. ఆర్యావర్తం, భరత వర్షం

**హిందూత్వ వాదన:** హిందూత్వ చరిత్రకారులు సింధు, గంగా మైదాన ప్రాంతంలోని భారత దేశాన్ని ఆర్యావర్తం అని పిలవాలని చెబుతారు. మరికొందరయితే

అసలు ఇదే ఆర్యుల పుట్టిల్లు అని కూడ వాదిస్తారు. అయోధ్య రామమందిరం కోసం ఆరెస్సెస్ ప్రచారం చేసిన సమయంలో ఈ భావన మరింత వాడుకలోకి తీసుకు రాబడింది. అయోధ్య ఆర్యావర్తంకు కేంద్రస్థానంలో ఉందని పదే పదే చెప్పబడింది. వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాస పురాణాల సంప్రదాయం కూడ ఆర్యావర్తానికి చెందినదే అని చెబుతారు. ఆర్యావర్తం యొక్క భౌగోళిక స్వరూపం భరత వర్షం, అంటే భరతుని భూమిగా చెప్పబడింది. ఈ భూమి జంబూద్వీపం అనే ఒక వూహాజనిత ద్వీపంపై ఉన్నదని, జంబూద్వీపం భూమిపై ఉన్న మేరుపర్వతానికి దక్షిణాన ఉందని అంటారు. వేద గాథల్లోని యయాతి వారసుడైన భరతుడనే రాజు ఈ భూమిపై ఆర్యుల ఆధిపత్యాన్ని స్థాపించాడని వీరి నమ్మకం. ఇతిహాస పురాణాల సంప్రదాయం కూడ, ప్రత్యేకించి మహాభారత, రామాయణాలలోని గాథలు భరత వర్షంతో ముడివడి ఉంటాయి. ఇతిహాస పురాణాల గాథల్లో, స్మృతులలో ప్రస్తావింబడిన ప్రదేశాలన్నింటికీ పురావస్తు రుజువుల కోసం హిందూత్వవాద పురాతత్వవేత్తలు, చరిత్రకారులు తెగప్రయత్నిస్తుంటారు.

**శాస్త్రీయ విశ్లేషణ:** ఆర్య అనే పదానికి (ప్రకృతి అమ్మ, దక్షిణాది అయ్య) పెద్ద మనిషి అని అర్థం. అది ఒక జాతిని కాని, భాషను కాని సూచించదు. ఏ సమూహంలో ఉత్తమమైనా ఆర్య అని పిలుస్తారు. ఆ విధంగానే బౌద్ధులకు ఆర్య సత్యాలు ఉన్నాయి. ఐరోపా మేధావులు ఇండో ఆర్యుల గురించి, ఇండో ఆర్యన్ భాషా గ్రూపు గురించి చర్చించడం మొదలైన తర్వాత ఆర్య అనే పదానికి జాతిపరమైన, భాషాపరమైన స్వభావం అంటగట్టబడింది. వారు దక్షిణాదిన ఉన్న మరొక సమూహం ద్రవిడ సమూహం నుండి భిన్నంగా చూపబడ్డారు. ఈ రెండు సమూహాలు కూడ జాతిపరమైన, భాషాపరమైన అర్థాన్ని సంతరించుకున్నాయి. బ్రిటిష్ చరిత్రకారుడు విన్సెంట్ స్మిత్ ఆర్యుల దండయాత్రతో భారత దేశ చరిత్ర మొదలైందని భావించాడు. దాని తర్వాత వేదయుగము, ఇతిహాస యుగము వచ్చాయని చెప్పాడు. దీన్ని జాతీయవాద, హిందూత్వ వాద చరిత్రకారులు వెనువెంటనే వంటబట్టించుకున్నారు. ఆర్యావర్తం అనేది ఆర్యుల భూమిగా సూచించబడుతున్నది.

తర్వాత వచ్చిన చరిత్ర పరిశోధనలతో ఇలాంటి చిత్రానికి అనేక సవరణలు చేయాల్సి వచ్చింది. హరప్పా సంస్కృతి ఆర్యుల గురించి సాధారణంగా చెప్పుకునే వాటికి భిన్నమైన లక్షణాలను వ్యక్తం చేసింది. మధ్య ఆసియాలోను, ప్రస్తుత పాకిస్తాన్‌లోను జరిగిన పురావస్తు తవ్వకాలు, మధ్య ఆసియా నుండి కనీసం రెండు వలసలు జరిగాయని తెలుపుతున్నాయి. వలసలు అంటే అవి దండయాత్రలు కానక్కరలేదు. ఉత్తర భారత దేశంలో పురావస్తు తవ్వకాలు కూడ రంగులతో కూడిన

గోధుమ వర్ణపు పాత్రలను వాడే ప్రజలు వలసవచ్చారని, వారు స్థానికంగా ఉండే ప్రజలతో కలగలిసి పోయారని చెబుతున్నాయి. హరప్పా వాసులు కూడ పట్టణాలు పతనమయిన తర్వాత వేరే ప్రాంతాలకు వలసలు పోయి స్థానిక జనంతో కలిసిపోయారు. ప్రాచీన భారతంలోని జనాభా అంతా ఇలా కలగలుపులతో ఏర్పడింది తప్ప వారిని కేవలం ఆర్యులు అనడానికి వీలు లేదు. ఈ జనాభా డిఎన్ఏ అధ్యయనాలు అవి అతి ప్రాచీన దక్షిణ భారత ప్రజల జీన్స్‌తోను, అతి ప్రాచీన ఉత్తర భారత ప్రజల జీన్స్‌తోను కలగలిసి ఉన్నాయని చెబుతున్నాయి. అతి ప్రాచీన ఉత్తర భారత ప్రజల జీన్స్ వాటి స్వచ్ఛమైన రూపంలో ఒక్క వాయివ్య భారతంలోనే ఉన్నాయని అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఆ విధంగా ఆర్యావర్తం అని చెప్పబడుతున్న అత్యధిక ప్రాంతం కలగలిసిన ప్రజల భూమి మాత్రమే. స్త్రీలలో పరిణామాన్ని నమోదు చేసే మైటోకాండ్రియల్ భారత దేశ భూభాగానికి మాత్రమే పరిమితమయింది. కేవలం వై క్రోమోజోముల ఆరంభం మాత్రమే మధ్య ఆసియా వరకు ఉన్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. అంటే వలస వచ్చిన వారు పురుషులు మాత్రమే అని, వారు మూలవాసీ స్త్రీలతో కలగలిసిపోయారని తెలుసుకోవాలి.

భరత వర్షం అనేది పౌరాణిక భావన, బ్రాహ్మణాల భౌగోళికంలో భాగం. జంబు ద్వీప భౌగాళికాన్ని తామూ చెప్పే బౌద్ధ, జైన సాహిత్యం కూడ భరత వర్షం అనే ప్రదేశం ఉన్నట్లు చెప్పడం లేదు. ఈ పదం క్రీశ 5వ శతాబ్ది శాసనాల్లో మాత్రమే కనిపిస్తుంది. అంటే అది తర్వాతి కాలంలో వచ్చిన పదం అని అర్థం చేసుకోవాలి. ఆర్షభారతంగా గుర్తించబడిన భరత వర్షం పురాణాలలో మొదలయింది. పురాణాల కాలనిర్ణయం చేసే అధ్యయనాలు వాటిలో అత్యధికం క్రీ.శ. మొదటి 1000 సంవత్సరాలకు చెందినవని చెబుతున్నాయి. మహాభారతం, రామాయణం తుది ప్రతులు కూడ ఆ కాలంలోనే రూపుదిద్దుకున్నాయి. మధ్య ఆసియా నుండి వలసలకు, పురాణాల పుట్టుకకు మధ్య వేయి సంవత్సరాల కాల వ్యవధి ఉంది. అందుచేత పురాణాల్లో చెప్పిన వాటిలో అత్యధికం పుక్కిటి పురాణాలు, కల్పిత గాథలు. వాటి ఉనికిని సరిచూడటం సాధ్యమయ్యే పని కాదు.

## 3. హిందూ అనే పదం

**హిందూత్వవాదుల వాదన:** హిందూ అనే పదం ఒక ప్రత్యేకమైన మతానికి, సంస్కృతికి ప్రాతినిధ్యం వహిస్తుంది. దీనికి ఒక విభిన్న ప్రాపంచిక దృక్పథం కూడ ఉంది. దానికి 4–5 వేల ఏళ్ళ గతం ఉంది. కొంతమంది 8–10 వేల ఏళ్ళ ముందుకు కూడ దాని ఆవిర్భావం ఉందని చెబుతారు. గుజరాత్ తీరంలో సముద్రగర్భంలో

జరిపిన పురావస్తు పరిశోధనలు 8000 సంవత్సరాల క్రితం అవశేషాలను కనుగొన్నాయి. అవి ద్వారకకు సంబంధించినవని చెబుతున్నారు. ఇతిహాస పురాణ సంప్రదాయం లోని పట్టణాలు హస్తినాపురం, అహిచత్ర, ఇంద్రప్రస్థ, అయోధ్య, కాశీలకు ఇలాంటి గతాన్నే సూచిస్తున్నారు. అదే రకమైన గతాన్ని ఆలయాలకు కూడ ఆపాదిస్తున్నారు. హిందూ మతం, సంస్కృతి మధ్య ఆసియా, టర్కీ, తూర్పు ఆఫ్రికా, ఆగ్నేయాసియా తదితర ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు వ్యాపించడం గురించి కూడ వీరు ఇలాంటి కథనాలనే చెబుతుంటారు. ఇలాంటి కథలన్నీ గతంలో ఒక హిందూ సామ్రాజ్యం ఉండేదని చెప్పడం వరకు కొనసాగుతాయి. అంతర్గత విభేదాలు, 'విదేశీ' దండయాత్రలు మహత్తర హిందూ ఇండియా పతనానికి దారితీశాయని చెబుతారు.

**శాస్త్రీయ విశ్లేషణ:** ఈ కథనాలన్నీ పూర్తిగా కల్పితాలు, వాటికి, అందుబాటులో ఉన్న సమాచారానికి ఎలాంటి సంబంధం లేదు. హిందూ అనే పదం దేశీయమైనది కాదు, దీన్ని మొదట పర్షియన్లు సింధు నదీ పరీవాహక ప్రదేశాన్ని సూచించడానికి వాడారు. తర్వాత గ్రీకులు కూడ ఇదే అర్థంలో వాడారు. భారత దేశంలోని అనేక మత ధోరణులకు, తాత్వికతలకు ఒకే ఉమ్మడి పేరు లేదు. అవి వాటి వాటి ప్రత్యేక ధోరణులతో పిలవబడుతున్నాయి. అలాంటి ధోరణులలో నాస్తికులు, సందేహవాదులు, విశ్వవాదులు, ప్రత్యేకవాదులు, ఆనందప్రియులు, లేదా సూటిగా చెప్పాలంటే హేతువాదులు. వీరు కాకుండా వివిధ రకాల ఆధ్యాత్మిక వాదులున్నారు. ఇతిహాస పురాణ సంప్రదాయంలో ప్రస్తావించబడిన నగరాలన్నీ క్రీ.పూ. 5వ శతాబ్దానికి సంబంధించినవని పురావస్తు పరిశోధనల్లో తేలింది. ఇతిహాస వీరుల ఆవిర్భావం ఈ కాలంలో కనుగొనబడలేదు. అదే కాలానికి చెందిన ఉపనిషత్తులు, బౌద్ధ గ్రంథాలు సైతం కొన్ని రాజ్యాలు, రాజవంశాల గురించి ప్రస్తావించాయి. అయితే అవి ఇతిహాస వీరులను పూర్తి భిన్నమైన విధంగా ప్రస్తావించాయి. అంటే అవి ఈ కథనాల పరిణామాన్ని సూచిస్తున్నాయి. అంటే, ఇతిహాసాలలోని కథలు మనకు కనిపించే రూపంలో చారిత్రక విశ్లేషణకు పనికి వచ్చేవి కావు. అంతేకాదు, క్రీ.శ. 5వ శతాబ్దానికి ముందు ఆలయ ఆధారిత మతాలున్నట్లు దాఖలాలు లేవు. బ్రాహ్మణుల బలిదాన సంప్రదాయాలకు ఆలయాల అవసరం లేదు. మతాలకు సంబంధించిన తొలి అవశేషాలు స్తంభాలు, స్తూపాల రూపంలో మాత్రమే ఉన్నాయి. అవేవీ ఏ హిందూ దేవుడ్ని సూచించవు. హిందూ దేవాలయాలు విష్ణువు, శివుడు, శక్తి మత తెగలకు సంబంధించి ఆవిర్భవించాయి. వాటికి పాలకుల సంరక్షణ కూడ ఉండేది. మధ్య యుగాల భారత దేశంలో ఆచార్యులు, మఠాలు ఆవిర్భవించిన తర్వాతనే ఆ మత

తెగలు సంఘటిత రూపం సంతరించుకున్నాయి. అప్పుడు సైతం వాటిని హిందూ అని పిలిచేవారు కాదు. వైష్ణవులు, శైవులు, శాక్తేయులు మొదలైన విధాలుగా పిలవబడేవారు. ఈ తెగలు అభివృద్ధి చెందడంతో బౌద్ధం, జైనంతో సహా తొలి తాత్విక, నైతిక ఉద్యమాలు క్షీణించాయి.

ఇవన్నీ కూడ భారత దేశపు మతపరమైన, సాంస్కృతికపరమైన వైవిధ్యానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. అనేక వలసలతో ప్రజలు ఒకరితో మరొకరు కలగలిసి పోవడం విభిన్న భాషలు, జీవన శైలుల ఆవిర్భావానికి కారణమయింది. ఇవి ఒకే మాదిరి వారమని భావించే బ్రాహ్మణులపై సైతం ప్రభావం చూపాయి. మధ్య యుగాల భారత దేశంలో ప్రాంతీయ సాంస్కృతిక సముదాయాలు ఏర్పడటం ఈ వైవిధ్యం ఫలితమే. ఏకీకృత దృక్పథాన్ని నొక్కి చెప్పే హిందూత్వ కథనాలు ఈ వైవిధ్యాన్ని గుర్తించడంలో విఫలమయ్యాయి.

## 4. ముస్లిముల దండయాత్రలు – హిందూ సంస్కృతి క్షీణత

**హిందూత్వ వాదుల వాదన**: ముస్లిముల చేత హిందూ సంస్కృతి క్షీణతకు గురయిందని హిందూత్వ వాదుల ప్రధాన వాదన. ఆ వాదన పలు రూపాల్లో ఉంది. కొన్ని ముఖ్యమైనవి ఇలా ఉన్నాయి.

### ఎ. దేవాలయాల విధ్వంసం:

**హిందూత్వ వాదుల వాదన:** మహ్మద్ ఘజనీ ధ్వంసం చేశాడని భావించబడుతున్న సోమనాథ్ దేవాలయంతో మొదలు పెట్టి, ముస్లిం దురాక్రమణదారుల ప్రధాన లక్ష్యం దేవాలయాలు అని చూపించేందుకు హిందూత్వ చరిత్ర రచన ప్రయత్నిస్తుంది. ముస్లిం పాలకులు, యువరాజులు, సైన్యాధిపతులు దేశవ్యాపితంగా ధ్వంసం చేసిన 3000 దేవాలయాల జాబితాను విశ్వహిందూ పరిషత్ తయారు చేసింది. ముస్లిం దురాక్రమణదారులు అపవిత్రం చేసిన దేవాలయాలు మరికొన్ని ఉన్నాయి. ఇది జరిగిన సమయంలో తీవ్రమైన అభద్రతా భావం, భయం ఆవరించి ఉన్నాయి. పెద్ద సంఖ్యలో హిందువులు వేరే నివాసం వెదుక్కొంటూ తమ గ్రామాలను వదిలి పారిపోయారు. పెద్ద సంఖ్యలో దేవాలయాలు దురాక్రమణదారుల లూటీకి గురయ్యాయి. స్వాధీనం చేసుకున్న సంపదతో దురాక్రమణదారులు తమ ఖజానాలను నింపుకున్నారు. దేవాలయాల్లో ఉండే నిర్మాణ శైలిని, అలంకరణలను తమ మసీదుల పునర్నిర్మాణం కోసం స్వీకరించారు.

**శాస్త్రీయ వివరణ:** ముస్లిం దురాక్రమణ దారుల దండయాత్రల్లో కొన్ని దేవాలయాలు ధ్వసం చేయబడ్డాయనడాన్ని కాదనలేము. అయితే, ముస్లిం రాజులు దేవాలయాల ధ్వంసాన్ని అణచివేతకు, భయోత్పాతానికి మార్గంగా ఉద్దేశపూర్వక వ్యూహంగా ఎంచుకున్నారన్నది మాత్రం వాస్తవం కాదు. ముస్లిం పాలకులు హిందూ దేవాలయాలకు విరాళాలు ఇచ్చినట్లు చూపే శాసనాల్లో ముస్లిం పాలకులను హిందూ పద సురత్రణ అని పేర్కొన్నారు. సోమనాథ్‌తో సహా ముస్లిములు ధ్వంసం చేశారని చెప్పబడుతున్న చాల దేవాలయాలు తర్వాత కాలంలో మరమ్మతులు చేయబడ్డాయి, పునర్నిర్మించబడ్డాయి. విశ్వహిందూ పరిషత్ జాబితా అంతా కాకి సాక్ష్యాల ఆధారంగాను, ఇలియట్, డాడ్సన్ రాసిన సందేహాస్పద రచన 'ది హిస్టరీ ఆఫ్ ఇండియా యాజ్ టోల్డ్ బై ఇట్స్ హిస్టారియన్స్' లో అతిశయోక్తిగా చెప్పిన వాటి ఆధారంగాను తయారు చేయబడింది.

విశ్వహిందూ పరిషత్ చెప్పేదానికి విరుద్ధమైన మరొక అంశం ఉంది. భారత దేశంలోకి ప్రవేశించిన ముస్లిములలో కొద్ది మంది మాత్రమే రాజకీయ దురాక్రమణదారులుగా వచ్చారు. అత్యధికులు భూమార్గాలు, సముద్రమార్గాల ద్వారా వ్యాపారులుగా వచ్చి సంపన్నవంతమైన నివాస స్థావరాలను ఏర్పరుచుకున్నారు. ఇలాంటి సెటిల్‌మెంట్లలో దేవాలయాల ధ్వంసం కాని, అపవిత్రం చేయడం కాని జరిగినట్లు దాఖలాలు లేవు. సూఫి సన్యాసుల వలసలు కూడ జరిగాయి. వారు భక్తి శ్రద్ధలతో ఇస్లాంను ప్రచారం చేసేవారు తప్ప ఎలాంటి అరాచక చర్యలకు పాల్పడేవారు కాదు. వాస్తవానికి, సూఫీ ఖంకాలను (ప్రార్థనా స్థలాలు) పెద్ద సంఖ్యలో భక్తులు స్థానిక హిందువులతో సహా సందర్శించుకునేవారు. విధ్వంసం, లూటీ అనే వాటిని మధ్య యుగాలలో అందరు పాలకులు హిందువులతో సహా అనుసరించారు. కాశ్మీర్ పాలకులు దేవాలయాల ధ్వంసానికి ఒక అధికారినే నియమించారు. అతని పేరు 'దేవోత్పతన నాయక'. కొందరు పాలకుల రాజకీయ సాధనాన్ని మొత్తం ఆ జాతి ప్రజలందరికీ అంటకట్టడం సముచితం కాదు.

## బి. ప్రాచీన చిహ్నాలను, ఆలయాలను మార్చడం

**హిందూత్వవాదుల వాదన:** హిందువులు తమ నిర్మాణ కౌశలం తోను, లోహ పరిశ్రమ, సాంస్కృతిక నైపుణ్యంతోను పేరుగాంచారు. శాస్త్ర సాంకేతిక రంగాలలోను వారు గొప్ప అభివృద్ధి సాధించారు. ముస్లిములు ఈ లలిత కళలు, హస్తకళలను ధ్వంసం చేయడమే కాకుండా, హిందువుల నైపుణ్యాలను తమ ప్రధాన స్మారక చిహ్నాలను

నిర్మించుకోవడంలో ఉపయోగించుకున్నారు. ఢిల్లీలోని మెరౌలీ ఇనుప స్తంభం నుండి తాజ్‌మహల్ వరకు దీనికి ఉదాహరణలుగా చెప్పబడ్డాయి.

శాస్త్రీయ వివరణ: ఎంతో మంది సుల్తానులు, పాదుషాలు పాలించినప్పటికీ వారి కాలంలో లలిత కళలు, హస్త కళలు క్షీణించిన దాఖలాలు ఎక్కడా లేవు. హిందువులు, ముస్లిములే కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాలకు చెందిన చేతివృత్తుల వారు, హస్తకళానిపుణులు ప్రధాన నగరాలలో కలిసి మెలిసి ఉండేవారు. ఇనుము తుప్పుపట్టకుండా చూసే విధానాన్ని భారతీయ లోహపరిశ్రమ నిపుణులే కనుగొని ఉండవచ్చు. అయితే  ఇనుప స్తంభం తయారు చేసేటప్పుడు ఇతరులు దాన్ని ఎందుకు వినియోగించుకోకూడదు. భారతీయ, పర్షియన్ నిర్మాణ నిపుణుల కౌశలాలను మిళితం చేసి భారతీయులు షార్కి లాంటి మిశ్రమ నిర్మాణ శైలులను కనిపెట్టారు. మధ్య యుగాల కాలమంతా ఆ నిర్మాణ శైలి వినియోగించబడింది. ఇలాంటి మిశ్రమ రూపాలే చిత్ర లేఖనం, శిల్పం, ఎంబ్రాయిడరీ, సంగీతం, నాట్యం తదితర రంగాలలో కూడ ఏర్పడ్డాయి. హిందీ, ఉర్దూ మిశ్రమ భాషా రూపాలు  సైతం ఏర్పడ్డాయి. అంతేకాకుండా, ఖగోళ శాస్త్రం, ఖగోళపరిశోధనా శాలలను సవాయ్ జై సింగ్ లాంటి భారతీయ పాలకులు తమ ఖగోళ పరిశోధనా శాలలు నిర్మించుకునేందుకు వినియోగించుకున్నారు. జగన్నాథ పండిత, గణేశ్ సర్వజ్ఞ లాంటి పండితులు తమ మానువల్స్ రాయడానికి ఈ పరిజ్ఞానాన్ని వినియోగించారు. భారతదేశంలో గణనీయంగా వ్యాపించిన యునాని లాంటి మిశ్రమ వైద్యవిధానం కూడ ఇలా ఏర్పడిందే. తాజ్‌మహల్ విషయంలో 'పయెట్రా దురా' అనే ఇటాలియన్ రంగు రాళ్ళ అద్దకం కళను కూడ వినియోగించారు.

## సి. హిందూ మహిళలపై అత్యాచారాలు

మహిళలను బానిసలుగా పడిఉండేలా చేయడానికి వారిపై అత్యాచారాలు చేసేవారు.

**శాస్రీయ వివరణ:** ఢిల్లీ సుల్తానుల గురించిన కొన్ని కథల ఆధారంగాను, మొగల్ అంతఃపురాల శృంగార వర్ణనల ఆధారంగాను  ఈ వాదన చేయబడుతున్నది. కాని ఇది వాస్తవం కాదు. మహిళల పట్ల ముస్లిం పాలకుల వైఖరి శృంగారపరమైనది, పురుషాధిక్యమైనది. భారత దేశంలోకాని, ఇంకే ఇతర ప్రాంతంలో కాని మధ్య యుగాలలోని పాలకుల వైఖరి మహిళల పట్ల ఇలాగే ఉండేది. భారతీయ పాలకులు దేవదాసీలను, బానిసలను కలిగి ఉండటం, ఓటమి పాలయిన పాలకులకు చెందిన మహిళలను రాణులుగా చేసుకోవడం గురించి అనేక కథలు ఉన్నాయి. ఢిల్లీ సుల్తానులు,

పాదుషాలు దీనికి మినహాయింపు కాదు. పరాజయం పాలయిన పాలకుల కుటుంబాలకు చెందిన మహిళలు 'జవహర్' (సామూహిక ఆత్మహత్య) కు పాల్పడేవారని అదనపు ఆకర్షణను ఈ కథనాలకు జతచేశారు. అత్యంత ప్రఖ్యాతి గాంచిన ఘటనను మాలిక్ జైసి మహ్మద్ అనే కవి 'పద్మావతి' అనే తన కావ్యంలో వర్ణించాడు. ఈ కథనంలో అల్లావుద్దీన్ ఖిల్జీ చిత్తూరు రాజు రతన్ సింగ్ భార్య పద్మావతిని కోరుకుంటాడు. ఆ కోర్కెను తిరస్కరించడంతో అల్లావుద్దీన్ ఖిల్జీ ప్రతీకారంతో చిత్తూరు కోటపై దాడి చేసి వశపరుచుకుంటాడు. అల్లావుద్దీన్ ఖిల్జీ కోటలోకి ప్రవేశించడానికి ముందే కోటలోని స్త్రీలందరూ పద్మావతితో సహా జవహర్‌కు పాల్పడతారు. కాని అల్లావుద్దీన్ ఖిల్జీ దండయాత్ర తర్వాత రెండు శతాబ్దాలకు జైసీ ఈ కావ్యాన్ని రచించాడు. ఈ ఘటన చారిత్రకంగా నిర్ధారించబడలేదు.

### డి. హిందువుల ప్రతిఘటన

**హిందూత్వవాదుల వాదన:** హిందూత్వవాదుల అవగాహన ప్రకారం మధ్యయుగాల కాలమంతా హిందువులకు, ముస్లిములకు మధ్య యుద్ధం జరిగిన కాలం. ముస్లిములు మెరుగైన యుద్ధతంత్రం కలిగిన వారు. వారి ఎత్తుగడలు భీకరమైనవి, వేగంగా కదులుతుంటారు, వారి వద్ద ఆశ్వికదళాలు ఉన్నాయి, చుట్టుముట్టే యుద్ధతంత్రంతో సహా మెరుగైన సాంకేతిక పరిజ్ఞానం వారి స్వంతం. ఇలాంటి ముస్లిములు తమపై దురాక్రమణ చేసినపుడు హిందువులు తమ ధైర్యసాహసాల ద్వారా, త్యాగాల ద్వారా, భౌగోళిక పరిజ్ఞానంతో గెరిల్లా యుద్ధం మొదలైన పద్ధతుల ద్వారా ప్రతిఘటించేవారు. ఈ ధైర్య సాహసాలు, దేశభక్తి చాంద్ బర్దాయ్ గానం చేసిన పృధ్వీరాజ్ లాంటి అనేక కథల ద్వారా కీర్తించబడ్డాయి. అలాంటివే రాణా కుంభ, రాణా సంగ, శివాజీ గాథలు కూడ. దక్కన్‌లో విజయనగర రాజులకు, బహమనీ సుల్తానులకు మధ్య జరిగిన యుద్ధాలలో కూడ హిందూ ప్రతిఘటనకు సంబంధించి ఇలాంటి కథనాలే చెప్పబడ్డాయి. బ్రిటిష్ పాలకుల చేత మత చాందసుడు అని పిలవబడ్డ టిపు సుల్తాన్ గురించి కూడ ఇలాంటి గాథలే ఉన్నాయి.

**శాస్త్రీయ వివరణ:** వివిధ ప్రాంతాలకు చెందిన సుల్తానులు, మొగలులకు మధ్య స్థానిక రాజులతో అనేక యుద్ధాలు జరిగాయి. అయితే వీటిలో ఏ యుద్ధం కూడ హిందూ జాతి అనే భావనతో జరిగిన దాఖలాలు లేవు. ఎందువల్లనంటే, పర్షియన్ల దాడులు జరిగినప్పుడు, మధ్య ఆసియా వాసుల దాడులు జరిగినపుడు హిందూ జాతి అన్న భావనే పుట్టలేదు. మహ్మద్ ఘోరి దాడి చేసినపుడు పృధ్వీరాజు,

జయచంద్ ఘడ్వాల్‌తో సంఘర్షిస్తున్నాడు. అందుచేత మహ్మద్ ఘోరీకి తీవ్రమైన హిందూ ప్రతిఘటన ఏమీ ఎదురు కాలేదు. ఆ తర్వాత కూడ రాజపుత్ర రాజులు సుల్తానులకు ఎంత వ్యతిరేకంగా ఉన్నారో, అంతగానూ తమలో తాము కలహించుకుంటూ ఉన్నారు. వారిలో కొందరు ముస్లిం రాజులతో కుమ్మక్కయిన సందర్భాలు కూడ ఉన్నాయి. భారత దేశంలో బాబర్ చేసిన రెండవ యుద్ధం కనౌజ్ యుద్ధంలో హిందువులు, ముస్లిములు కలిసిన సైన్యం ఎదుర్కొన్నది. మొగలుల అంతం వరకు అలాంటి ధోరణే కొనసాగింది. మత చాందసుడు అని చెప్పబడుతున్న ఔరంగజేబు సైనికాధికారుల్లో 40 శాతం మంది హిందువులే. శివాజీకి ఆగర్భశత్రువైన జైసింగ్ కూడ ఈ జాబితాలో ఉన్నాడు. హిందూత్వ చరిత్రకారులచే శివాజీ స్వరాజ్యం అని కీర్తించబడుతున్న జాతీయత కేవలం ఒక మరాఠా రాజు చైతాయి, సర్దేశ్‌ముఖి పన్నులు వసూలు చేసుకునేందుకు స్వేచ్ఛ కలిగిన ప్రాంతం మాత్రమే. ఇలాంటి పన్నులు, వాణిజ్య టోల్ పన్నులు వసూలు చేసుకునే అధికారమే బ్రిటిష్ వారితో జరిగిన యుద్ధాలలో సైతం మరాఠాల ప్రధాన డిమాండుగా ఉండేది. ప్రాదేశిక హక్కుల కోసం జరిగిన ఈ పోరాటాలను ఆధునిక భావన ప్రకారం జాతీయత అని ఎంత మాత్రం అనలేము. ఇలాంటి ప్రాదేశిక అదుపు కోసం సుల్తానులు సైతం పోరాడారు. ఈ పోరాటాలలో మతంతో నిమిత్తం లేకుండా ఎవరినైనా వినియోగించుకున్నారు. హిందూత్వవాదులు చెప్పే మతపరమైన జాతీయత అనేది ఉనికిలో లేనేలేదు.

## 5. భారత స్వాతంత్ర్య పోరాటం

**హిందూత్వవాదుల వాదన:** బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరిగిన పోరాటం విదేశీయులకు వ్యతిరేకంగా జరిగింది. ఇంతకు ముందు మొగలులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి ఇది కొనసాగింపు. మరాఠాలు తమ ప్రాదేశిక హక్కుల పరిరక్షణ కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడారు. ఇలాంటి పోరాటాలనే కిట్టూరు రాణి పద్మిని, కేరళలో పఝాసి రాజా, వేలు తంబి, తమిళనాడు పాంచాలకురుచిలో కట్టబొమ్మన చేశారు. ఇలాంటి ప్రతిఘటననే నానాసాహెబ్, తాతియా తోపే, ఝాన్సి లక్ష్మీబాయి 1857లో కొనసాగించారు.

ఆ తర్వాత హిందూత్వవాదుల కథనంలో ఒక సున్నితమైన మార్పు చోటుచేసుకుంది. ప్రతిఘటన బదులు హిందూ దేశాన్ని రూపొందించడం అన్న అంశంపై ఉద్ఘాటన అధికమయింది. దేశం అనేది ఒక సంపూర్ణమైనదిగా నిర్వచించబడింది. దీనిలో హిందూ అని చెప్పబడే అన్ని అంశాలు, భౌగోళిక ప్రాంతం,

సమాజం, సంస్కృతి, రాజకీయాలు ఉంటాయి. జాతివ్యతిరేక శక్తులపై పోరాటం బ్రిటిష్‌వారిపైనే కాకుండా, క్రైస్తవులు, 'విదేశీ' సిద్ధాంతాన్ని విశ్వసించే కమ్యూనిస్టులపై సైతం జరగాలి.

**శాస్త్రీయ వివరణ:** దీని గురించి ఇక్కడ వివరంగా చెప్పవలసిన అవసరం లేదు. ఎందువల్లనంటే ఈ అంశాన్ని వేరే చోట పూర్తిస్థాయిలో వివరించడం జరిగింది. ఆధునిక అర్థంలో జాతీయవాదం అన్న భావన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో రూపుదిద్దుకొని అభివృద్ధి చెందింది. అన్ని రకాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, ప్రాంతీయ పోరాటాలన్నీ కలగలిసి స్వాతంత్ర్య పోరాటంగా రూపుదిద్దుకున్నాయి. ఇది అందరు కలిసి చేసిన పోరాటం, విడిపోయే పోరాటం కాదు. ఇది జనాభాలోని ఒక తరగతికి వ్యతిరేకంగా మరొక తరగతి జరిపింది కాదు. ఒక మతానికి వ్యతిరేకంగానో, ఒక కులానికి వ్యతిరేకంగానో, ఒక ప్రాంతానికి వ్యతిరేకంగానో జరిగిన పోరాటం కాదు. ఈ పోరాటం ప్రజల తక్షణ సమస్యలన్నింటినీ చేపట్టింది. లౌకిక తత్వం కోసం, ప్రజాస్వామ్యం కోసం, సమానత్వం కోసం, సామాజిక న్యాయం కోసం, ప్రజల జీవనోపాధి హక్కుల కోసం పోరాడే ఒక భిన్నమైన జాతీయ సంఘీభావానికి దారితీసే నినాదాలను ఈ పోరాటం చేపట్టింది.

## 6. ప్రజాపోరాటాలు

**హిందూత్వ వాదన:** గత దశాబ్దాలలో జరిగిన అన్ని ప్రజా పోరాటాలను వాటిలో పాల్గొన్న వారి అభిప్రాయాలు హిందూ జాతి అనుకూలమైనవా, లేక జాతి వ్యతిరేకమైనవా అనే ప్రాతిపదికన అంచనా వేయాలి. హిందూ వ్యతిరేక లేదా హిందువుల ప్రయోజనాలకు వ్యతిరేకమైన పోరాటాలను ఖండించాలి.

వ్యవసాయ పోరాటాలలో ఈ వైఖరి స్పష్టమయింది. 1921లో మలబార్ జిల్లా ఎర్నాడ్ తాలూకాలో వ్యవసాయ పోరాటాన్ని కౌలురైతులు, పేద రైతులు, కూలీలుగా ఉన్న మెజారిటీ ముస్లింల చేత నిర్వహించబడింది. హిందూత్వవాదులు చెప్పేదేమంటే, వారికి ప్రధాన శత్రువులు హిందువులే, వారిని హత్యలు చేశారు, ఎర్నాడ్, దాని పరిసర ప్రాంతాలనుండి తరిమి వేశారు. ఇస్లామిక్ రాజ్యాన్ని స్థాపించాలని వారు ప్రయత్నించారు. దీనికి పునాదులు వేయడానికి ప్రయత్నించింది ఎమిరేట్స్‌లో ఉన్న పలువురు తిరుగుబాటు నేతలు. ఈ తిరుగుబాటు ఆ ప్రాంతంలోని ముస్లిములకు, హిందువులకు మధ్య పెద్ద చీలిక తీసుకు వచ్చింది. సనాతన హిందువులను సమీకరించే సంస్థల ఏర్పాటుకు దారితీసింది.

వ్యవసాయ పోరాటాలకు మరొక ఉదాహరణ తెలంగాణ సాయుధ ప్రజా పోరాటం. అది ఆ ప్రాంత ప్రజలు భూస్వాములకు వ్యతిరేకంగా జరిపిన పోరాటం. భూస్వాములకు, వారి ప్రైవేటు సైన్యం రజాకార్లకు హైదరాబాదు నిజాం మద్దతు ఉంది, నిజాం సేనలు, భూస్వాముల రజాకార్లు కలిసి వేల మంది రైతులను చంపి పోరాటాన్ని అణచివేశారు. హిందూత్వ శక్తులు దీనికి భిన్నమైన కథనాన్ని వండివారుస్తున్నాయి. రజాకారుల దాడులు నిజాంకు వ్యతిరేకంగా పనిచేస్తున్న హిందూ సంస్థలపై జరిగాయని చెబుతారు. అలా చెప్పడం ద్వారా పోరాటంలో పాల్గొని అమరులైన వేలాది రైతాంగాన్ని విస్మరిస్తారు.

**శాస్త్రీయ వివరణ:** పోరాటం చేసే ప్రజలు ఉన్న పరిస్థితిలోని వర్గ శక్తుల బలాబలాల పొందికను బట్టి నిర్దిష్టమైన సందర్భంలో పోరాటాలు ఆవిర్భవిస్తాయి. అలాంటి సందర్భంలో ప్రజలు తాము తక్షణం శత్రులుగా భావించే వారికి వ్యతిరేకంగా తమ ఆగ్రహాన్ని ఎక్కుపెడతారు. పోరాడుతున్న ప్రజానీకపు వర్గ చైతన్యం పెరిగే కొద్దీ వర్గ శక్తుల బలాబలాల పొందికను మరింత శాస్త్రీయంగా అర్థం చేసుకుంటారు. తమ పోరాటాన్ని తాము నేరుగానో, ఇతరుల ద్వారానో గుర్తించిన నిజమైన అణచివేతదారులకు వ్యతిరేకంగా కేంద్రీకరిస్తారు. వారు తమ పోరాటానికి కావలసిన వనరులను తమ తక్షణ పరిస్థితుల నుండే సేకరిస్తారు. ఎర్నాడ్ లోని మోప్లాల విషయానికొస్తే వారు తమ శత్రువును సరిగ్గానే గుర్తించారు. బ్రిటిష్ వలస వాద ప్రభుత్వం, భూస్వాములు తమ శత్రువులని తెలుసుకున్నారు. ఆ పోరాటానికి కావలసిన వనరులను ఖిలాఫత్ ఉద్యమం, జాతీయోద్యమం బోధనల నుండి గ్రహించారు. వలసవాద ప్రభుత్వం వారిని పూర్తిగా వేరుచేసి, కనీసం వారు ప్రాణాలతో ఉండటం కూడ అసాధ్యం అన్న పరిస్థితులను సృష్టించింది. ఈ పరిస్థితి వారు తమ మతంపై ఆధారపడేలా చేసింది. దీంతో వారిలోని మతోన్మాద శక్తులు ముందుకొచ్చాయి. తమ దుస్థితికి కారణమని వారు భావిస్తున్న హిందువులపైకి తమ పోరాటాన్ని మళ్ళించారు.

తెలంగాణ పోరాటం విషయానికొస్తే, పోరాడే రైతాంగం వర్గచైతన్యయుతమైంది, తమ పోరాటాన్ని భూస్వాములకు, అదే విధంగా తాము ఫ్యూడల్ భూస్వామ్య ప్రభుత్వమని భావించే నిజాము రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటాన్ని నిర్వహించారు. నిజాం రాజ్యం అంతంతో భూస్వామ్య విధానానికి కూడ ముగింపు పలకబడుతుంది. అయితే, ఈ ప్రమాదాన్ని గుర్తించిన భూస్వాములు హిందూ సంస్థల పతాకం క్రింద తమను తాము రక్షించుకోవడానికి ప్రయత్నించారు. దీంతో నిజాం పాలన అంతమయినప్పటికీ భూస్వామ్య విధానం పరిరక్షించబడేలా ఒప్పందం

కుదిరింది, రైతాంగ పోరాటం క్రూరంగా అణచివేయబడింది. ఆ విధంగా హిందూ ముస్లిం వైరుధ్యాల మాటున రైతాంగ పోరాటం అణగదొక్కబడింది.

ప్రజాపోరాటాల పట్ల హిందూత్వవాదుల వైఖరి ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో ఇవి సూచిస్తున్నాయి. ప్రజాపోరాటాల డిమాండ్లను వారు తెలివిగా ఒక మతానికి చెందిన డిమాండ్లుగా చూపిస్తారు. ఆ ప్రజాపోరాటాల్లో పాల్గొంటున్న వారిలో కొందరిని ఇతర మతాల పట్ల, జాతుల పట్ల తమ శతృత్వాన్ని పరిష్కరించుకోవడానికి వినియోగించుకుంటారు. దీని ఫలితమేమంటే, ఒక నిర్దిష్ట పోరాటం ఆవిర్భవించి, అభివృద్ధి చెందడానికి కారణమయిన వర్గ ప్రయోజనాలు పక్కదోవ పట్టించబడతాయి. అది ఆ పోరాటం సైతం అణగదొక్కబడేలా చేస్తుంది. భారత దేశ చరిత్రకు హిందూత్వ శక్తులు చేస్తున్న వక్రీకరణలు లౌకిక ప్రజాస్వామిక, సామాజిక న్యాయంతో కూడిన దేశం అనే మన లక్ష్యాన్ని సమర్థవంతంగా అణచివేసే అవకాశం ఉంది. భారత ప్రజానీకం అనేదానికి బదులు, 'హిందూజాతి మౌలిక ఐక్యత' అనే ఒక సంపూర్ణ నినాదాన్ని హిందూత్వవాదులు ముందుకు తీసుకువస్తారు.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ

27-13-3, గవర్నర్‌పేట, విజయవాడ - 2,

ఫోన్ నెం. 0866 2577202, 9490098000

ప్రతులు : 1000

ప్రచురణ కాలం : జూన్, 2023

వెల : ₹. 20/-

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ

27-13-3, గవర్నర్‌పేట, విజయవాడ - 2,

ఫోన్ నెం. 0866 2577202, 9490098000